

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

డ్రోన్, స్పేస్ సిటీలకు శ్రీకారం!

రిలయన్స్‌కు హ్యాట్సాఫ్!

ముఖేష్ అంబానీకి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు


భారీ పెట్టుబడులతో

రాష్ట్రానికి బ్రూక్‌ఫీల్డ్

- మంత్రి లోకేష్

లోపలి పేజీల్లో..

# హిట్.. హిట్.. సమ్మిట్!



- ఏపీ అభివృద్ధికి పోటెత్తిన 'భాగస్వామ్యం'
- వరదలా వచ్చిపడిన పారిశ్రామిక పెట్టుబడులు
- విశాఖ వేదికగా భారీగా కుదిరిన ఎంఓయూలు
- జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు
- పారిశ్రామికవేత్తల స్పందనతో ఏపీలో ఉత్సాహం
- 400 ఎంఓయూల ద్వారా రూ.11.92 లక్షల కోట్లు
- 13.32 లక్షలమందికి ఉద్యోగావకాశాలు..
- తొలి రోజు 'భాగస్వామ్యం' రూ.8.26 లక్షల కోట్లు
- ఒక్కరోజులో రాష్ట్రానికి 12.05 లక్షల ఉద్యోగావకాశాలు
- తొలిరోజు సీఎం సమక్షంలో 41 ఎంఓయూలు
- ఒప్పంద పెట్టుబడులు.. రూ.3.5 లక్షల కోట్లు
- 4.16 లక్షల ఉద్యోగావకాశాలు..
- మంత్రుల సమక్షంలో 324 ఒప్పందాలు
- ఒప్పంద పెట్టుబడులు.. రూ.4.76 లక్షల కోట్లు
- సీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐ అండ్ ఐ, పరిశ్రమలు, ఐటీ, మున్సిపల్ శాఖలకు భారీ స్పందన

11



ఆనందంతో స్వీట్లు తినిపించుకుంటున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి ఎంపీలు

## బీహార్‌లో ఎన్డీఏ అఖండ విజయం

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కనీవినీ ఎరుగని రీతిలో భారీ విజయం సాధించింది. ఏకంగా 200కుపైగా స్థానాలను కైవసం చేసుకుని.. డబుల్ సెంచరీ కొట్టింది. మొత్తం 243 స్థానాలకు గానూ 202 స్థానాల్లో విజయఢంకా మోగించింది. గెలుపు ప్రభంజనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మరోసారి సిద్ధమైంది.

మోదీపై నమ్మకమే..

## బీహార్‌లో విజయం

- ఎక్స్ ట్వీట్‌లో సీఎం చంద్రబాబునాయుడు

## నా-ని మ్యాజిక్‌తో అద్భుతం: మంత్రి లోకేష్

బీహార్‌లో ఏన్డీఏ అఖండ విజయం సాధించినందుకు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కి విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ఇది పని చేస్తున్న నా-ని (Na-Ni-నరేంద్ర మోదీ, నితీష్ కుమార్) మ్యాజిక్ అద్భుతంగా పని చేసింది. ఈ ఘన విజయం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, నితీష్ కుమార్ విశ్వసనీయ పాలనపై బీహార్ ప్రజల అచంచల విశ్వాసానికి నిదర్శనంగా మంత్రి లోకేష్ అభివర్ణించారు.

## మంచి సమయం మించిన దొరకదు!

- ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం
- అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు రోల్‌మోడల్
- ఏపీ అభివృద్ధిపై చంద్రబాబు పూర్తి ఫోకస్ పెట్టారు
- భాగస్వామ్య సదస్సు విజయవంతం కావాలి
- సీఐఐ సదస్సు ప్రారంభించి ప్రసంగించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- ఏపీలో ప్రతీ బిడ్డా అదృష్టవంతుడు: కేంద్రమంత్రి పీయూష్

3

## పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఎస్క్రో

- వేగంగా అనుమతులు.. అవసరం మేరకు భూములు
- ఎర్త్ మినరల్స్‌నుంచి ఎరో స్పేస్‌వరకు ఏపీలో అవకాశాలు
- ముందుకురండి.. ఒప్పందాలు చేసుకుందాం
- భవిష్యత్ అవసరాలపై ప్రణాళికలు రూపొందిద్దాం
- సీఐఐ సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

2

## పెట్టుబడి.. ఆవిష్కరణ.. భాగస్వామ్యం



- ఈ మూడే అభివృద్ధికి హైవేలు..
- గ్లోబల్ బ్రాండ్‌గా అరకు కాఫీ
- ఆక్వా, ప్రకృతి సాగులో ఏపీ అగ్రస్థానం
- పరిశ్రమలకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం
- సీఐఐ సదస్సు తొలి ప్లీనరీలో సీఎం చంద్రబాబు

2

## ఏపీలో ప్రతిభకు కొదవ లేదు



- భారత్‌లో గ్రోత్ ఇంజన్లుగా టైర్-2 నగరాలు
- ఐటీ, జీసీసీ పాలసీలతో అత్యుత్తమ ప్రోత్సాహకాలు ఇస్తున్నాం
- ఇది చరిత్ర సృష్టించే సమయం
- టైర్-2 నగరాలపై సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి లోకేష్
- 42 ఐటీ సంస్థలతో రూ.44,255 కోట్ల మేర పెట్టుబడులకు ఎంఓయూలు
- 1,43,930 మందికి ఉద్యోగ అవకాశాలు


9

సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు

## ఏపీ ఆతిథ్యం ఎంతో గర్వకారణం

- ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్
- పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీని ఎంచుకోవాలి
- దార్శనిక నాయకత్వం, స్పీడ్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ సొంతం
- వికసిత భారత్‌లో భాగంగా ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేష్

7



## ఏపీలో యూనిట్లు పెట్టండి

- ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో భేటీలో మంత్రి లోకేష్

విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ తొలిరోజు శుక్రవారం విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో భేటీ అయి రాష్ట్రంలో వారి యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. యాక్షన్ టెసా సీఈఓ వివేక్ జైన్, ఆస్ట్రేలియా కాన్సలేట్ జనరల్ సిలాయ్ జాకి, జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులు, శ్యామ్ మెటాలిక్స్ ఎండీ షీజిత్ అగర్వాల్, కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్ (కేబీఎల్) ఎండీ అలోక్ కిర్లోస్కర్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్లా, సాగర్ డిఫెన్స్, వారీ (WAREE) సంస్థ చైర్మన్ అంకితా జోషి, ఎస్ఎఐఎల్ చైర్మన్ సుఖ్‌భీర్ ఆవాతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఇలా ఉంటే మంత్రి లోకేష్ సమక్షంలో 17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. తద్వారా 53,879 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

లోపలి పేజీల్లో..

చైతన్యరథం

# పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఎస్క్రో

- వేగంగా అనుమతులు.. అవసరంమేరకు భూములు
- ఎర్త్ మినరల్స్‌నుంచి ఎరో స్పేస్‌వరకు ఏపీలో అవకాశాలు
- ముందుకురండి.. ఒప్పందాలు చేసుకుందాం
- భవిష్యత్ అవసరాలపై ప్రణాళికలు రూపొందిద్దాం
- బిజినెస్ ఎక్స్‌పోల నిర్వహణకు విశాఖలో ఆంధ్రా మండపం
- అరకు అందాలు చూడండి... కాఫీ రుచిని ఆస్వాదించండి
- బీహార్ రాష్ట్రంలో మళ్లీ ఎన్డీఏ గెలిచింది... అభినందనలు
- సీఐఐ సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు



విశాఖపట్నం (చైతన్య రథం): రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలు ఓపెన్ చేస్తుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రోత్సాహకాలకు సావరీన్ గ్యారెంటీ ఇస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో శుక్రవారం రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సును భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ వేదికగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటనలు చేశారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ... "522మంది విదేశీ ప్రతినిధులు, 72 దేశాలనుంచి ప్రతినిధులు వచ్చారు. 2,500మంది పారిశ్రామికవేత్తలు, వివిధరంగాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. భారత్‌లో విశాఖ అత్యంత సుందరమైన నగరం. సుందరమైన బీచ్‌లు, కొండలు, ప్రకృతి వనరులున్న ప్రాంతం. అత్యంత సురక్షిత నగరంగా ఇటీవలే విశాఖకు రేటింగ్ వచ్చింది. భారత్‌లో పెట్టుబడులకు గేట్‌వేగా ఏపీ నిలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించటంలో భారత్ ఇప్పుడు అగ్రగామిగా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో ఏపీలో పరిశ్రమలకు అనుమతులిస్తున్నాం. రియల్ టైమ్‌లో అనుమతులు ఇవ్వటంతోపాటు వేగంగా పరిశ్రమలు నిర్మించేలా చూస్తున్నాం. పది సూత్రాల ఆధారంగా పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

## డ్రోన్ ట్యాక్సీలను అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు

"ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీలను భారతీయులే నడిపిస్తున్నారు. ఏపీలో త్వరలోనే క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలనూ ఉత్పత్తి చేసేలా ప్రయత్నం చేస్తున్నాం. డ్రోన్, ఎలక్ట్రానిక్, ఏరోస్పేస్, స్పేస్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేసి రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. అలాగే గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుదుత్పాదన లక్ష్యంగా పని చేస్తున్నాం. సౌర, పవన, పంప్డ్ ఎనర్జీలతోపాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఆర్థిక వ్యవస్థలను నిర్మించటంతోపాటు సంపద సృష్టించటంలో కలసి పనిచేద్దాం. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్గానిక్ ఉత్పత్తులు, పర్యాటకం ఇలా వేర్వేరు రంగాల్లో అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలను కోరుతున్నాను. గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తోంది. డీప్ టెక్నాలజీ రంగంలోనూ విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయి. ఏరో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందిస్తున్నాం. త్వరలోనే భారత్‌లో అది కూడా ఏపీనుంచి డ్రోన్ ట్యాక్సీలను ప్రారంభిస్తాం. ఏపీలో రేర్ ఎర్త్ మినరల్స్ అపారంగా ఉన్నాయి. ఈ రంగంలో పెట్టుబడులకు ఆస్కారం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశాలు. పోర్టులు, డ్రైపోర్టులు, అంతర్గత జలరవాణా, హెల్త్ కేర్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవచ్చు. అగ్రిటెక్, ఈవీ టెక్ లాంటి రంగాల్లో పెట్టుబడులకు కూడా విస్తృతమైన అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నాను" అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## పెట్టుబడులను ప్రోత్సహించేలా సంస్కరణలు... పాలసీలు

"విశాఖలో వాణిజ్యపరమైన ఎగ్జిబిషన్లు, ప్రదర్శనలకు వీలుగా ఐటీపీఓ ద్వారా 'ఆంధ్రా మండపం' నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇస్తున్నాం. భారత్ మండపం తరహాలోనే ఆంధ్రా మండపం నిర్మాణానికి స్థలం కేటాయిస్తాం. విశాఖ వచ్చినవారు అరకులాంటి ప్రాంతాలనూ సందర్శించాలి. అలాగే స్థానిక గిరిజనులు పండిస్తూ గ్లోబల్ బ్రాండ్‌గా మారిన అరకు కాఫీని, స్థానిక ఆక్వా రుచుల్నీ ఆస్వాదించాలి. రాష్ట్రంలో పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేసే వారికి భూమి కొరత లేదు. వారికి వేగంగా భూములు కేటాయిస్తున్నాం. పెట్టుబడులకు అనుకూలమైన 25 పాలసీలు రాష్ట్రంలో అమల్లో ఉన్నాయి. అవసరమైన సంస్కరణలు తెచ్చాం. కేవలం 17 నెలల కాలంలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి.

20 లక్షల ఉద్యోగాలూ దక్కుతాయి. ప్రస్తుతం 0.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు 50 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా ఏపీ పనిచేస్తుంది. వచ్చే పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తామనే విశ్వాసం మాకుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. సదస్సు కేవలం పెట్టుబడులు, వాణిజ్య, వ్యాపారం, ఒప్పందాల కోసం మాత్రమే కాదు. మేధోపరమైన ఆవిష్కరణలపైనా చర్చలు జరగాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## బిహార్‌లో ఎన్డీయే గెలుపు.. మోదీపై నమ్మకానికి నిదర్శనం

"ప్రస్తుతం బిహార్‌లో ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏకు ప్రజలు పట్టంగట్టారు. వారికి అభినందనలు. ప్రధాని మోదీపై ప్రజలు పూర్తిస్థాయిలో నమ్మకముంచారు. బిహార్ ప్రజలు అభివృద్ధికి పట్టంగట్టారు. అందుకే ఎన్డీయేకు మళ్లీ అవకాశమిచ్చారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# పెట్టుబడి.. ఆవిష్కరణ.. భాగస్వామ్యం

- ఈ మూడే అభివృద్ధికి హైవేలు..
- గ్లోబల్ బ్రాండ్‌గా అరకు కాఫీ
- ఆక్వా, ప్రకృతి సాగులో ఏపీ అగ్రస్థానం
- పరిశ్రమలకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం
- సీఐఐ సదస్సు తొలి ప్లీనరీలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం (చైతన్య రథం): పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే అభివృద్ధికి మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసమేనన్నట్టు చూడొద్దని, నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామన్నారు.

30వ సీఐఐ భాగ స్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీ సదస్సులో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధించగల మనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.




## ప్రకృతి సాగులో ఏపీది అగ్రస్థానం...

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయం లోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. "ఖనిజాలు, రేర్‌ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ సిద్ధంగా ఉంది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, గండికోట, అరకులాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు. అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు. ఏపీలోని వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు, చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. డేటా లేక్, రియల్ టైమ్ డేటా ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. సాంకేతికత సాయంతో అతి తక్కువ నష్టంతోనే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## అందుబాటులో 50 వేల ఎకరాలు

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటుకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు. మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీయేపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్‌ఓ ప్రతినిధులు హాజరయ్యారు.

## 'బ్రూక్‌ఫీల్డ్'తో ఒప్పందం సంతోషదాయకం

### ఎక్స్ ట్వీట్‌లో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం (చైతన్య రథం): ప్రతిష్ఠాత్మక బ్రూక్‌ఫీల్డ్ సంస్థ రాష్ట్రంలో 12 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రూక్‌ఫీల్డ్ మధ్య 12 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ఒప్పందం కుదిరిందని రాష్ట్ర ప్రజలతో పంచుకోవడం సంతోషంగా ఉంది. ఈ ఒప్పందాల్లో క్లీన్ ఎనర్జీ పవర్డ్ 3 గిగావాట్ డేటా సెంటర్ మరియు రాష్ట్ర వ్యాప్తంగా అదనపు క్లీన్-ఎనర్జీ ప్రాజెక్టులు న్నాయి. బ్రూక్‌ఫీల్డ్ మాడ్యూల్ తయారీ.. దాని సరఫరా గొలుసు, గ్రీన్ మాలిక్యూల్స్, హాస్పిటాలిటీ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, వాణిజ్య రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు, పోర్టులు, మొబిలిటీ, లాజిస్టిక్స్ హబ్‌లు మరియు పారిశ్రామిక టౌన్‌షిప్‌లలో అవకాశాలనూ అన్వేషిస్తుంది. ఆంధ్రప్రదేశ్ కోసం వారి ప్రణాళికలపట్ల నేను సంతోషిస్తున్నాను. వారి దార్శనికతను వాస్తవంగా మార్చడానికి, అవసరమైన వ్యాపారాన్ని వేగవంతం చేయడానికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇస్తున్నాను" అని పేర్కొన్నారు.

# మంచి సమయం మించిన దొరకదు!



- ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం
- అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు రోల్‌మోడల్
- ఏపీ అభివృద్ధిపై చంద్రబాబు పూర్తి ఫోకస్ పెట్టారు
- భాగస్వామ్య సదస్సు విజయవంతం కావాలి
- ఏపీ కృషికి తగిన పెట్టుబడులు వరదవ్వాలి
- సీఐఐ సదస్సు ప్రారంభోత్సవంలో రాధాకృష్ణన్
- భాగస్వామ్య సదస్సును ప్రారంభించిన ఉపరాష్ట్రపతి
- ఏపీలో ప్రతీ బిడ్డా అదృష్టవంతుడు: కేంద్రమంత్రి పీయూష్



విశాఖపట్నం (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందకు ఇదే సరైన సమయమని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రకటించారు. భాగస్వామ్య సదస్సు విజయవంతం కావాలని... పెట్టుబడులు వరదలా రావాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంలో శుక్రవారంనుంచి రెండు రోజులపాటు జరగనున్న 30 సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేష్ సహా వివిధ మంత్రులు, ఉన్నతాధికారులు భారీగా స్వాగతం పలికారు. అలాగే ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సదస్సు ప్రాగంణానికి చేరుకున్న ఉప రాష్ట్రపతికి ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప రాష్ట్రపతిని అల్పాహార విందుకు ఆహ్వానించారు. ఈ విందులో కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్‌తోపాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. అనంతరం సభా ప్రాంగణంలోని ప్లీనరీ హాల్లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ సభలో ఉప రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మాట్లాడుతూ... "ప్రధాని మోదీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోంది. సంపద సృష్టిస్తేనే ప్రపంచంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది. ఏపీలో సుపరిపాలన, అత్యుత్తమ విధానాలనే సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఆచరిస్తోంది. అభివృద్ధికి – సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీని అభివృద్ధి చేయడానికి అంతే శ్రద్ధ చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడానికి చంద్రబాబు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేస్తున్నాయి. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పనవంటివి దేశాభివృద్ధి దోహదం చేస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకనామీ ఇలా వేర్వేరురంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయి. ఈ–గవర్నెన్సు, డిజిటల్ ఇన్ ఫ్రా ద్వారా వేగంగా సేవలు అందుతున్నాయి. టెక్నాలజీ నాలెడ్జి డ్రివెన్ ఎకానమీ సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. దేశంలోనూ, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇప్పుడు అనుకూల సమయం. దీన్ని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే రెండు మూడేళ్లలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుంది. అలాగే అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టంగానూ భారత్ ఎదుగుతుంది. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తాం. ప్రతీ దేశంతోనూ భారత్ మైత్రినే కోరుకుంటుంది. అంతా కలిసి ఎదుగుదాం అనే భావన భారతదేశానిది. ఇతరులకు నష్టం కలిగించటం కాదు, ప్రయోజనం కల్పించటం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ నినాదం" అని ఉప రాష్ట్రపతి అన్నారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ... "30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు 8వసారి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తోంది. దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరైన సదస్సు ప్రపంచ వాణిజ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఏపీని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారు. సదస్సు ద్వారా ప్రతీ ఆలోచనా, ప్రతీ పెట్టుబడి భవిష్యత్ తరాలకు సంపదగా మారాలని కోరుతున్నాను" అని ఏపీ గవర్నర్ ఆకాంక్షించారు.

## ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డా అదృష్టవంతుడే: పీయూష్

ప్రారంభోత్సవ సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... "ఏపీ అభివృద్ధి గురించి మాత్రమే కాదు, యావత్ భారతదేశం అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తారు. విజనరీ సీఎం చంద్రబాబు ఉన్న ఏపీలో పుట్టిన ప్రతీ బిడ్డా అదృష్టవంతుడే... వారి భవిష్యత్ అంతా ఉజ్వలమైనదే. గ్లోబల్ ట్రేడ్ గేట్‌వేగా విశాఖ నిలుస్తోంది. స్టీల్ ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో ఏపీ సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం అవుతుంది. 2047నాటికి సుసంపన్నమైన దేశంగా భారత్ అవతరిస్తుంది. టెక్నాలజీ ద్వారా ఈ సుసంపన్నతను సాధిస్తాం. టెక్నాలజీ డెమొక్రటైజేషన్ అనే విధానాన్ని పాటిస్తూ అందరికీ దానిని చేరువ చేస్తున్నాం. భారత్ తెచ్చిన డిజిటల్ పేమెంట్ విధానం ఇప్పుడు చాలా దేశాలు అనుసరిస్తున్నాయి. 30 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాం. 104 శాటిలైట్లను ఒకేసారి అంతరిక్షంలోకి పంపిన దేశంగా సాంకేతికతను ప్రజలకు దగ్గర చేస్తున్నాం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నాం. ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఉన్న భారత యువత ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో 110 దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేసి భారతీయ భావన వసుధైక కుటుంబం అనే విషయాన్ని నిరూపించాం. స్వేచ్ఛా వాణిజ్యం కోసం వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుని దానికి అనుగుణంగా వాణిజ్య



బంధాలను బలోపేతం చేస్తున్నాం. డిజిటల్ ట్రాన్ఫర్మేషన్ దిశగా, జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ ఆర్థిక అభివృద్ధి దిశగా పయనిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా భిన్నమైన పరిస్థితులు ఉన్నా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దఎత్తున భారత్ ఆకర్షిస్తూనే ఉంది. అత్యంత పారదర్శకమైన విధానంలో వాణిజ్యం ఉండాలని మేం కోరుకుంటున్నాం. సీఐఐ సదస్సులతో సరికొత్త పెట్టుబడులు, ఆలోచనలు, ఆవిష్కరణలు రావటం అభినందనీయం. వాణిజ్య ప్రదర్శనలకు, ఎగ్జిబిషన్లు, సదస్సులకు వీలుగా ఢిల్లీలో భారత్ మండపం ఉన్నట్టే ఆంధ్రా మండపం నిర్మించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. బీహార్ ఎన్నికల ఫలితాలు కూడా వచ్చాయి. ప్రధాని మోదీపై ప్రజలు విశ్వాసం ఉంచారు అనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. ప్రధాని మోదీపై నమ్మకం ఉంచి, ఎన్డీఏకు పట్టం కడుతున్న బీహార్ ప్రజలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నా" అని కేంద్ర మంత్రి పీయూష్ పేర్కొన్నారు.

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ఏపీ:

### కేంద్రమంత్రులు కింజరాపు, పెమ్మసాని

సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ వంటి వారు ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. అలాగే ఏపీ పారిశ్రామికవేత్తలకు ఎలాంటి అనువైన వాతావరణం కల్పిస్తుందోననే అంశాలను వెల్లడించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ,



ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి విజనరీ లీడర్ల నేతృత్వంలో భారతదేశం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నాయన్నారు. గత కొన్ని నెలలుగా ఏపీలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని వివరించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం అవుతున్నాయని.. ప్రస్తుతం ఏడు ఆపరేషన్ ఎయిర్ పోర్టులుంటే కొత్తగా మరో 7 ఎయిర్ పోర్టులు నిర్మాణం చేస్తామని... ఏరోస్పేస్, ఎయిర్ క్రాఫ్ట్ తయారీని కూడా ఏపీకి తీసుకువస్తామని రామ్మోహన్ నాయుడు చెప్పారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుతో పాటు... అతిపెద్ద



మార్కెట్‌కు పారిశ్రామికవేత్తలను, కంపెనీలను చేరువ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుం దని వివరించారు. వివిధ రంగాల్లోని పెట్టు బడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన భాగస్వామి గా ఉంటుందన్నారు. అగ్రికల్చర్ నుంచి ఏరో స్పేస్ వరకూ వివిధ రంగాల్లో పెట్టుబడులు, యూనిట్లు ఏపీకి వస్తున్నాయని పెమ్మసాని స్పష్టం చేశారు.



# డ్రోన్, స్పేస్ సిటీలకు శ్రీకారం!

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి పీయూష్ గోయల్
- అవకాశాలు అందుకోవడంలో చంద్రబాబు ముందుంటారని పీయూష్ ప్రశంసలు
- డ్రోన్ -స్పేస్ సిటీల్లో పెట్టుబడులకు ఆరు సంస్థలతో ఏపీ ఎంవోయూలు




విశాఖపట్నం (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికనుంచే ఈ శంకుస్థాపనలు జరగడం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీకి శంకుస్థాపన జరపడం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్‌ని తామెప్పుడూ అందిపుచ్చుకుంటూనే ఉంటామని... డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం మరింత సాయం చేయాలని సీఎం కోరారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు తీసుకువచ్చేంతలా ఈ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభిస్తున్నామని, అలాగే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తీర్చిదిద్దుతున్నామన్నారు. మరోవైపు డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటికి డిమాండ్ విస్తృతంగా ఉందని, దీనిని ముందుగానే ఊహించి డ్రోన్ సిటీని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి ఆలోచనను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రశంసించారు. ఐటీకి గుర్తింపులేని సమయంలోనే ఐటీ భవిష్యత్‌ను ఊహించి ఆరోజు అవకాశాలను సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారని ప్రశంసించారు. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఏఐ, క్వాంటం విషయంలోనూ చంద్రబాబు ముందంజలో ఉన్నారని అన్నారు. దేశంలోనే తొలిసారి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు. దేశం కోసం, రాష్ట్రంకోసం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలిసి కట్టుగా పనిచేస్తున్నారని అభినందించారు.

### 300 ఎకరాల్లో ఓర్వకల్లులో డ్రోన్ సిటీ

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు, ఆర్ అండ్ డీ రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. డ్రోన్ సిటీలో అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్ -సర్టిఫికేషన్ సెంటర్ల ఏర్పాటుతో పాటు 25,000 మంది రిమోట్ పైలట్‌లకు శిక్షణ అందిస్తారు. డ్రోన్ సిటీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40,000 మందికి పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు కానున్నాయి. డ్రోన్ సిటీలో 20 శాతం క్యాపిటల్ సబ్సిడీ, 100 శాతం ఎస్జీఎస్టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

### దేశంలోనే తొలిసారి ట్విన్ స్పేస్ సిటీస్

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటవుతున్నాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ట్విన్ స్పేస్ సిటీస్ నిర్మాణం జరగనుంది. ఉపగ్రహ ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్, ఉపగ్రహ విభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్‌కు ఇక్కడ ప్రాధాన్యం ఇస్తారు. స్పేస్ సిటీలో 10 ఏళ్లలో రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఏపీ స్పేస్ పాలసీ 4.0లో భాగంగా స్పేస్ టెక్ ఫండ్ కింద రూ.100 కోట్ల కేటాయించడం జరిగింది. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో భారత వైమానిక%-%అంతరిక్ష రంగాల్లో కొత్త శకం ఆరంభం కానుంది. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనకు డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ ప్రాజెక్టులు కీలకం కానున్నాయి.

### రాష్ట్ర ప్రభుత్వంతో వివిధ సంస్థల ఒప్పందాలు

సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. అలాగే డ్రోన్ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ అనలిటిక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ సంస్థలు ఎంఓయూ చేసుకున్నాయి. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో టెక్నాలజీ, నైపుణ్యాలు, పరిశ్రమలు విస్తరణకు విస్తృత అవకాశాలు రానున్నాయి. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, సీఎస్ విజయానంద్, మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్‌రెడ్డి, ఎస్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణలవైపు అడుగులేద్దాం




- ఇన్నోవేటివ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ కంపెనీలతో కలిసి పని చేసేందుకు ఏపీ సిద్ధం
- ఏపీని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- సింగపూర్ బృందంతో ఎంఓయూ సందర్భంలో సీఎం చంద్రబాబు
- సింగపూర్ హెూంమంత్రి షణ్ముగం సమక్షంలో ఏపీ-సింగపూర్ మధ్య ఎంఓయూ
- అర్బన్ గవర్నెన్స్, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలపై అవగాహనా ఒప్పందం
- ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్న మంత్రి నారా లోకేష్ - సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రి గాన్ సో హాంగ్
- విజయవాడ- సింగపూర్ మధ్య విమాన సర్వీసు నడపాలని నిర్ణయం

విశాఖపట్నం (చైతన్య రథం): సింగపూర్ ప్రభుత్వం, సింగపూర్ కంపెనీలు ఇన్నోవేటివ్ ఆలోచనలతో పరిశ్రమలు నడిపిస్తాయని... ఇలాంటి ఆలోచనలతో ముందుకొచ్చే సింగపూర్ కంపెనీలతో పనిచేసేందుకు ఏపీ ఉత్సాహంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ హెూంమంత్రి షణ్ముగం సమక్షంలో సింగపూర్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు మంత్రి నారా లోకేష్- సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ట్రేడ్ ఇండస్ట్రీ మంత్రి గాన్ సో హాంగ్ ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అర్బన్ గవర్నెన్స్, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలపై అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "ప్రపంచానికి అభివృద్ధి మోడల్‌గా మారిన సింగపూర్ అంటే అమితమైన అభిమానం. అత్యంత బలమైన పబ్లిక్ పాలసీలు ఆ దేశంలో అభివృద్ధికి కారణమయ్యాయి. లీక్వాన్యూలాంటి నేతలు సింగపూర్‌ను అద్వితీయమైన దేశంగా మలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అభివృద్ధిలో భాగమయ్యాను. ఇప్పుడు మళ్లీ అమరావతిని నిర్మించే భాగ్యం నాకు కలిగింది. కోరగానే అమరావతి బృహత్ ప్రణాళికను రూపొందించి ఇచ్చిన సింగపూర్‌కు ధన్యవాదాలు. మధ్యలో కొన్ని సమస్యలు ఏర్పడినా మళ్లీ రాజధానిని పునర్నిర్మిస్తున్నాం. రాష్ట్రాన్ని నాలెడ్జి ఎకానమీగా తీర్చిదిద్దుతున్నాం. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉంది. గత ఆరు దశాబ్దాలుగా సుస్థిరమైన ప్రభుత్వం సింగపూర్‌లో ఉంది. ఇప్పుడు భారతదేశం కూడా ఆ దిశగానే అడుగులు వేస్తోంది. ప్రధాని మోదీ, ఎన్డీఏపై ప్రజలకు విశ్వాసం ఉంది. బీహార్ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల మద్దతుతో భారీ విజయాన్ని సాధించింది" అని సీఎం చంద్రబాబు అన్నారు.

### అద్భుతమైన ప్రయాణానికి నాంది: నారా లోకేష్

కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... "ఏపీ -సింగపూర్ మధ్య కుదిరిన ఎంఓయూ ఓ అద్భుతమైన ప్రయాణానికి నాంది. రెండో ఛాన్స్ ఇచ్చినందుకు సింగపూర్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. పాలనలో అపారమైన అనుభవమున్న సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అభివృద్ధి చెందుతోంది. సింగపూర్ అభివృద్ధి వేగాన్ని ఏపీ అందుకునేలా పని చేస్తాం" అన్నారు. ఇక సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం పరిశ్రమల మంత్రి గాన్ సో హాంగ్ మాట్లాడుతూ ఏపీ- సింగపూర్ మధ్య బంధం మరింతగా బలపడాలని కోరుంటున్నామన్నారు. హెల్దీ వెల్దీ హ్యాపీ ఏపీ సొసైటీగా ఏపీ మారాలని ఆకాంక్షించారు. సుస్థిరాభివృద్ధి, డిజిటల్, అర్బన్ గవర్నెన్స్,డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని గాన్ సో హాంగ్ వెల్లడించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ విజయవాడ-సింగపూర్ మధ్య వారంలో మూడు రోజులపాటు విమాన సర్వీసులు నడుస్తాయని ప్రకటించారు. ఇప్పటికే విశాఖ నుంచి సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. సింగపూర్ మోడల్‌ను సీఎం చంద్రబాబు విశ్వసిస్తారని.. తాము ఆయనను విశ్వసిస్తామని రామ్మోహన్‌నాయుడు చెప్పారు. సింగపూర్ హెూంమంత్రి షణ్ముగం మాట్లాడుతూ హెల్దీ వెల్దీ హ్యాపీ సొసైటీగా ఏపీని మార్చడానికి స్వర్ణాంధ్ర విజన్ చేపట్టడం సంతోషదాయకమన్నారు. సింగపూర్- ఏపీ మధ్య బలమైన బంధముందని... ఏపీలో సింగపూర్ కంపెనీలకు పూర్తి సహకారం అందుతోందని చెప్పారు. అభివృద్ధిలో పరస్పర భాగస్వామ్యం అత్యంత కీలకమని షణ్ముగం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కుదుర్చుకుంటున్న ఒప్పందాలతో ఏపీ అభివృద్ధి ప్రయాణం వేగంగా జరగాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ద్వారా ఏపీతో తాము కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలును పర్యవేక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్, సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



# విశాఖలో లులూ మాల్

- రాయలసీమలో లాజిస్టిక్ ప్రొక్యూర్మెంట్ ఎక్స్‌పోర్ట్ సెంటర్
- లులూ గ్రూప్ ఇంటర్నేషనల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుదిరిన ఒప్పందం




విశాఖపట్నం (చైతన్య రథం): రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు సంబంధించి లులూ ఇంటర్నేషనల్ గ్రూప్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించి విశాఖలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, లులూ గ్రూప్ చైర్మన్, ఎండీ యుసుఫ్ అలీ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ సంస్థ ప్రతినిధులు అంగీకార పత్రాలు మార్చుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ గత పాలకులు నిలిపేసిన ప్రాజెక్టును ఎట్టకేలకు రాష్ట్రానికి తిరిగి తీసుకువచ్చామన్నారు. గూగుల్, ఆర్సెల్లార్‌వంటి సంస్థలు విశాఖ రావడం లులూ సంస్థకు సానుకూల అంశమని సీఎం ప్రస్తావించారు. మూడేళ్లలోగా మాల్ నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లులూ మాల్ కేవలం షాపింగ్‌మాల్ మాత్రమే కాదని, విశాఖ పర్యాటకానికి దోహదపడుతుందని అన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా 300కి పైగా మాల్స్ నిర్వహిస్తున్న లులూ సంస్థ ఇందుకు అవసరమ్యే వ్యవసాయ ఉత్పత్తులను రాష్ట్రంలోని రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా లులూ చైర్మన్‌ను కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ లులూ సంస్థ ఒప్పందాలు చేసింది. మామిడి, జామ పల్ప్‌తోపాటు మసాలా దినుసులు రాష్ట్రంనుంచి సేకరించి ఎగుమతి చేస్తామని లులూ సంస్థ వెల్లడించింది. వచ్చే జనవరి నుంచి ఏపీనుంచి ఎగుమతులు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. త్వరలోనే లాజిస్టిక్ ప్రొక్యూర్మెంట్ ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్టు లులూ గ్రూప్ చైర్మన్, ఎండీ యుసుఫ్ అలీ ప్రకటించారు. విశాఖ నగరంలో లులూ సంస్థ 13.83 ఎకరాలు, 13.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1,066 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ వరల్డ్ క్లాస్ మాల్‌తో 5 వేల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ప్రస్తుతం విశాఖలో నిర్మించనున్న మాల్ భారత్‌లో 9వదని రాష్ట్రంలో మొట్టమొదటిదని లులూ సంస్థ వెల్లడించింది.

## ఏపీలో స్టీల్ రంగంలో జపాన్ కంపెనీల పెట్టుబడులు

**ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన భేటీలో జపాన్ రాయబారి ఒనో కేయిచ్చి**



విశాఖపట్నం (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో స్టీల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ ఆసక్తిగా ఉందని ఆ దేశ రాయబారి ఓనో కేయిచ్చి తెలిపారు. విశాఖపట్నంలో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఓనో కేయిచ్చి భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వీరిద్దరూ చర్చించుకున్నారు. ఈ మేరకు స్టీల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ దేశంలోని పారిశ్రామిక వేత్తలు ఆసక్తిగా ఉన్నారని కేయిచ్చి సీఎంకు వివరించారు. జపాన్ ఫార్మా రాజధాని కొయామా మాదిరిగానే ఏపీని ఔషధ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు జపాన్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. జపాన్ పనితీరు తనకు ఎంతో ఇష్టమని ముఖ్యమంత్రి తెలిపారు. సీఐఐ పార్టనర్‌షిప్ సమిట్‌లో 20కి పైగా జపాన్ కంపెనీలు పాల్గొనడం పట్ల ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలో భవన నిర్మాణాల్లో జపాన్, సింగపూర్ ప్రతినిధులను ఆహ్వానించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. శ్రీ సిటీలో ఇప్పటికే అనేక జపాన్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని సీఎం చంద్రబాబు కేయిచ్చితో తెలిపారు.



## గ్రీన్ అల్యూమినియంపై ఏఎం గ్రీన్‌తో ఒప్పందం



- రూ.54 వేల కోట్ల పెట్టుబడులకు సంసిద్ధత
- సీఎం చంద్రబాబు, పీయూష్ గోయెల్ సమక్షంలో ఎంఓయూ
- వివిధ జిల్లాల్లో సమీకృత లాజిస్టిక్స్ విధానం తెచ్చేందుకు ఎన్ఏసీడీసీ ఒప్పందం
- గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.2.20 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

విశాఖ (చైతన్య రథం): రాష్ట్రంలో గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్సు సహా 2జి ఇథనాల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఏఎం గ్రీన్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ సమక్షంలో సంస్థ ప్రతినిధులు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. 30 సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు రాష్ట్ర ప్రభుత్వంతో ఏఎం గ్రీన్ సంస్థ వేర్వేరు ఒప్పందాలను కుదుర్చుకుంది. 1 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో గ్రీన్ అల్యూమినియమ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఏఎం గ్రీన్ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రూ.40 వేల కోట్ల పెట్టుబడితో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడవద్ద గ్రీన్ అల్యూమినియం పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. అలాగే బయోమాస్‌నుంచి వివిధ రకాల హైడ్రోకార్బన్స్ ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ఏఎం గ్రీన్ సంస్థ ప్రభుత్వంతో మరో ఒప్పందం చేసుకుంది. రూ.10 వేల కోట్లతో సస్టైయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ తయారీ యూనిట్‌ను సంస్థ నెలకొల్పనుంది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో సెకండ్ జనరేషన్ ఇథనాల్ బయో రిఫైనరీ పరిశ్రమను ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ఈ సంస్థ రూ.50వేల కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సమీకృత లాజిస్టిక్స్ ఇంటర్ ఫేస్ ప్లాట్‌ఫాం (యూఎల్ఐపీ) ఏర్పాటు చేసేందుకు ఎన్ఐసీడీసీ లాజిస్టిక్స్ డేటా సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏపీలింక్ ద్వారా పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, రైలుమార్గాలు, వేర్‌హౌసింగ్ రంగాలను సమన్వయం చేసేందుకు వీలుగా ఈ యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్ ఫేస్ ప్లాట్‌ఫాం ఉపకరించనుంది. అటు గ్రీన్ ఎనర్జీ రంగంలోనూ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు రానున్నాయి. సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సహా పంప్డ్ హైడ్రో స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టుల్లో హిందూజా, ఎస్సార్ రెన్యూవబుల్స్, జీఎంఆర్ తదితర సంస్థలు రూ.2.37 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. తద్వారా 2 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి.






## చిన్నారులకు శుభాకాంక్షలు

**బాలల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు**

విశాఖపట్నం (చైతన్య రథం): జాతీయ బాలల దినోత్సవం సంద ర్భంగా చిన్నారులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ..."రేపటి తరాన్ని అన్నివిధాలా శక్తివంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడం కోసం...వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. బాలలకు చదువు చెప్పిస్తే అది వారి పరిపూర్ణవికాసానికి దోహదం చేస్తుంది. అందుకే 'తల్లికి వందనం' పథకం ద్వారా పిల్లలందర్నీ బడికి పంపించేలా ప్రోత్సహిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకంలో సైతం పిల్లలకు ఇష్టమైన మెనూ ఉండేలా చూస్తున్నాం. అలాగే పిల్లల పథకాలకు స్ఫూర్తి ప్రదాతల పేర్లు పెట్టాం. ప్రభుత్వ ఆశయాన్ని అర్థం చేసుకుని బాలలందరూ బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షిస్తూ.. మరోసారి చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## అతిథులకు హార్దిక ఆహ్వానం

**విశాఖకు కొత్త నిర్వచనమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్**



విశాఖపట్నం (చైతన్య రథం): V-Vision, I-Innovation, Z-Zeal, A-Aspiration, G-Growth – అంటూ విశాఖకు కొత్త అర్థాన్నిస్తూ సీఎం చంద్రబాబునాయుడు అతిథులకు ఆహ్వానంతో కూడిన ట్వీట్ చేసి –సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కొత్త ఉత్సాహాన్నిచ్చారు. విశాఖ భవిష్యత్ – దార్శనికత. ఆవిష్కరణ. ఉత్సాహం. ఆశయం. వృద్ధిగా అభివర్ణించారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "పెట్టుబడులకు ఏపీ సరైన వేదిక అనే అంశాన్ని ప్రతిబింబించేలా... రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సు మొదలైంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అందరికీ అర్థమయ్యేలా... ఏపీలోని అపార అవకాశాలను వివరించేలా భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నాం. అందరి సహకారాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తూ సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ జరుపుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసిన ప్రముఖులందరికీ సాదరంగా స్వాగతం పలుకుతున్నాను" అని పేర్కొన్నారు.

## 2030 నాటికి సెమీకండక్టర్స్ రంగంలో

# ప్రధాన భాగస్వామిగా ఏపీ




విశాఖపట్నం (చైతన్యరథం): ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ రంగాలను ఈనాడు కేవలం కొత్త తరం టెక్నాలజీగా మాత్రమే చూడటంలేదు, భారతదేశంలో గ్లోబల్ హై-టెక్ తయారీరంగాన్ని మహాశక్తిగా మార్చాలనే ఆశయాన్నీ ప్రతిబింబిస్తుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో శుక్రవారంప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా అభివృద్ధి, అవకాశం, బలోపేతం (ఎలక్ట్రానిక్స్)పై పెట్టుబడిదారుల దృక్పథం (Investors perspective on Growth, Opportunity and Enablement (Electronics)) అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌లోకి ఏపీ కొంచెం ఆలస్యంగా ప్రవేశించిందన్నారు. 2014-19 మధ్య మనకు మొదటి అవకాశం వచ్చింది. తిరుపతి ఎయిర్ పోర్ట్ చుట్టుపక్కల ఏర్పడిన ఎకో సిస్టమ్ వల్ల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ 1,2 వచ్చాయి. ఇది మన మొదటి ప్రయత్నం. తరువాత ఐదేళ్లు బ్రేక్ పడింది. అది పెద్ద అడ్డంకి కాదు.. చిన్న ఆటంకం మాత్రమే. ఇప్పుడు మళ్లీ మేం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాం. ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పెట్టుబడిదారులను రాష్ట్రంలోకి తిరిగి రావాలని, మళ్లీ పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

- ఏపీని ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ హబ్‌గా మార్చడమే మా లక్ష్యం
- పారిశ్రామికవేత్తలు తిరిగి ఏపీకి రావాలని ఆహ్వానిస్తున్నాం
- సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ సదస్సులో మంత్రి నారా లోకేష్
- మంత్రి లోకేష్ సమక్షంలో 17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు
- తద్వారా 53,879 మందికి ఉద్యోగ అవకాశాలు

### ఏపీకి ట్రిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధనే లక్ష్యం

మా విధానం కొంచెం భిన్నంగా ఉంటుంది. క్లస్టర్ విధానంలో పారిశ్రామికాభివృద్ధికి కృషిచేస్తున్నాం. వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్.. అంటే ఎకో సిస్టమ్‌లోని ప్రతి భాగం, ప్రతి కంపోనెంట్‌ను ఒకే క్లస్టర్‌లోకి తీసుకురావడం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకు సాగుతున్నాం. దేశంలో తయారయ్యే ఏసీల్లో 60శాతం ఏపీలోనే తయారవుతున్నాయి. భవిష్యత్ విద్య, పరిశోధన, పరిశ్రమ-విద్యారంగ అనుసంధానం మా ప్రాధాన్యత. ఆంధ్రప్రదేశ్‌కు అన్నిరంగాల్లో కలిపి ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2030 నాటికి సెమీ కండక్టర్స్ రంగంలో ప్రధాన భాగస్వామిగా ఉంటాం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్పష్టమైన విధాన దృక్పథం (2024-29), స్నేహపూరిత పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలతో ముందుకు సాగుతూ నవీన ఆవిష్కరణలు, పెట్టుబడులను ఆహ్వానిస్తోందని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

### 17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు

సదస్సులో 17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీవోలు, ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తద్వారా 53,879 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. తిరుపతిలో ఎస్‌సీఐసీ (SCIC) వెంచర్స్ ఎల్ఎల్‌పీ(రూ.1,704 కోట్ల పెట్టుబడి, 2,630 మందికి ఉద్యోగాలు), తిరుపతి - శ్యామా ఎస్‌జీఎస్ లిమిటెడ్(రూ.1595 కోట్ల పెట్టుబడి, 1894 మందికి ఉద్యోగాలు), తిరుపతి- ఎపిటోమ్ కాంపోనెంట్స్ లిమిటెడ్(రూ.700 కోట్ల పెట్టుబడి, వెయ్యి మందికి ఉద్యోగాలు), తిరుపతి- హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రూ.586 కోట్ల పెట్టుబడి, 613 మందికి ఉద్యోగాలు), తిరుపతి- సోలమ్ ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.268 కోట్ల పెట్టుబడి, 700మందికి ఉద్యోగాలు), తిరుపతి- ఈమక్(eemak) ప్రైవేట్ లిమిటెడ్(రూ.11వేల కోట్ల పెట్టుబడి, 20,500 మందికి ఉద్యోగాలు), తిరుపతి- డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(రూ.2,500కోట్ల పెట్టుబడి, 2,500 మందికి ఉద్యోగాలు),రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌పీఎస్‌పీఎల్(NPSPL) స్పెషాలిటీ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.2,400 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు), తిరుపతి- ఈ-ప్యాక్(Epack) గ్రూప్(1,416 కోట్ల పెట్టుబడి, 5,322 మందికి ఉద్యోగాలు), తిరుపతి- నియోలింక్ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.1,150 కోట్ల పెట్టుబడి, 2,100 మందికి ఉద్యోగాలు), తిరుపతి- CIPSA TEC ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (రూ.1,140 కోట్ల పెట్టుబడి, 1,251 మందికి ఉద్యోగాలు), రాష్ట్రవ్యాప్తంగా సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(రూ.1,100 కోట్ల పెట్టుబడి, 2వేల మందికి ఉద్యోగాలు),తిరుపతి-డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ (ఎక్స్ పాన్షన్)(రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి,10వేల మందికి ఉద్యోగాలు),తిరుపతి -అంబర్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ (రూ.400 కోట్ల పెట్టుబడి, 1,500 మందికి ఉద్యోగాలు), తిరుపతి-మీనా సర్క్యూట్స్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.350 కోట్ల పెట్టుబడి, 819 మందికి ఉద్యోగాలు), విశాఖపట్నం-రీఫైబ్స్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.350 కోట్ల పెట్టుబడి, 450 మందికి ఉద్యోగాలు), ఎన్టీఆర్ జిల్లా- టైటాన్ ఇంటెక్ లిమిటెడ్ (రూ.250 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు)తో ఎంవోయూ కుదుర్చుకున్నారు.

ఈ సదస్సులో ఏపీ ఐటి సెక్రటరీ కాటంనేని భాస్కర్, సైర్మా ఎస్‌జిఎస్ ఎండి జస్బీర్ ఎస్ గుజ్రాల్, అసిప్ టెక్నాలజీ ఎండి వెంకటసుధాకర్, డిక్సన్ టెక్నాలజీస్ సిఓఓ పంకజ్ శర్మ, నియోలింక్ సిఇఓ రూవెన్ షైబెల్, పిజి ఎలక్ట్రోప్లాస్ట్ ఎండి వికాస్ గుప్త, హిండాల్కో ఇండస్ట్రీస్ జాయింట్ ప్రెసిడెంట్ దీపక్ దేశ్ ముఖ్, తదితరులు పాల్గొన్నారు.


















## సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు

# ఏపీ ఆతిథ్యం ఎంతో గర్వకారణం



- ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్
- పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీని ఎంచుకోవాలి
- దార్శనిక నాయకత్వం, స్పీడ్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ సొంతం
- వికసిత భారత్‌లో భాగంగా ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేష్



విశాఖపట్నం (చైతన్యరథం): సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ఏపీ ఆతిథ్యం ఇస్తుండటం ఎంతో గర్వకారణంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి లోకేష్ పేర్కొన్నారు. విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మీ అందరికీ సుందర విశాఖపట్నంలో స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. భారతదేశం ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఇంజన్‌గా నిలుస్తున్న సమయంలో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తుండటం ఎంతో గర్వకారణంగా ఉంది.

పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీని ఎందుకు ఎంచుకోవాలని చాలామంది నన్ను అడుగుతారు. అందుకు మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది అనుభవం కలిగిన దార్శనికత కలిగిన నాయకత్వం. ఆయన మరెవరో కాదు.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.

వారసత్వాన్ని నిర్మించే అవకాశం రాజకీయ నాయకులకు జీవితంలో ఒక్కసారి మాత్రమే అవకాశం వస్తుంది. కానీ రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడుకి రెండో వారసత్వాన్ని నిర్మించే అవకాశం ఇచ్చారు. అదే అమరావతి, విశాఖపట్నం అని మంత్రి లోకేష్ వివరించారు.

### ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్

పెట్టుబడులకు ఏపీనే ఎందుకు ఎంచుకోవాలనేందుకు రెండో కారణం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ప్రస్తుతం వేగవంతమైన ప్రపంచంలో మనం ఉన్నాం. మార్కెట్లు, నియంత్రణలు, సాంకేతికత నిరంతరం మారుతున్న ఈ వేగవంతమైన ప్రపంచంలో స్పీడ్ అనేది చాలా ముఖ్యం. నేను వేలాది మంది పెట్టుబడుదారులను, కార్పొరేట్లను కలిశాను. ఒక్క అంశంపై వారందరిలోనూ ఏకాభిప్రాయం ఉంది. అదే స్పీడ్. కంపెనీ ఎంత వేగంగా అడుగులు వేస్తుందో, ప్రభుత్వాలు కూడా అంతే వేగంతో స్పందించాలని వారు కోరుకుంటున్నారు. భూమి కేటాయింపులు దగ్గర నుంచి అనుమతులు, ఆమోదాలు, ప్రోత్సహకాలు.. ఇవన్నీ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యేలోగా మంజూరు చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో మీ కంపెనీ వేగాన్ని మించిన వేగంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్

మూడో కారణం.. ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఒకసారి మీతో చేతులు కలిపిన తర్వాత, అది మీ ప్రాజెక్ట్ కాదు.. అది మా ప్రాజెక్ట్ అవుతుంది. వ్యాపారాన్ని విజయవంతం చేయడంతో పాటు అవసరమైన సంస్కరణలు, విధాన మార్పులను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ఈ అద్భుతమైన అవకాశాన్ని మాకు ఇచ్చినందుకు మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఇక్కడి అవకాశాలను అన్వేషించేందుకు సమయం కేటాయించాలని కోరుతున్నాను. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా.. ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిదుతామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

---

# ఏపీలో సెకండరీ/శాటిలైట్ ఎండీఎఫ్ యూనిట్

**- ఏర్పాటు చేయాలని యాక్షన్ టెసా సీఈఓ వివేక్ జైన్‌కు మంత్రి నారా లోకేష్ వినతి**



విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో సెకండరీ/శాటిలైట్ ఎండీఎఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని యాక్షన్ టెసా ఎండీ, సీఈఓ వివేక్ జైన్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. యాక్షన్ టెసా భారతదేశంలోని ప్రముఖ ఇంజనీర్డ్ కలప ప్యానెల్ తయారీదారు. 1970లలో స్థాపితమైన ఈ సంస్థ పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్, రసాయనాలు, ఫ్లెక్స్ తయారీ, బొగ్గు మైనింగ్, ఇంజనీర్డ్ కలప ఉత్పత్తులలో విభిన్న కార్యకలాపాలను నిర్వహిస్తోంది. 2025లో రూ.4,865 కోట్ల వార్షిక రెవిన్యూ సాధించిన యాక్షన్ టెసా దేశంలో ఏ క్లాస్ నగరాలు, 70శాతం బీ క్లాస్ నగరాల్లో పాన్ ఇండియా ఉనికి కలిగి ఉంది.

సీఈఓ వివేక్ జైన్ తో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో భేటీ అయిన సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం సితార్ గంజ్ తయారీ కేంద్రం 7.5లక్షల సీబీఎం సామర్థ్యంతో పనిచేస్తున్నందున, ఏపీలో సెకండరీ యూనిట్ ఏర్పాటుచేస్తే అదనపు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లకు డిమాండ్ మద్దతునిస్తుందని చెప్పారు. దీనిపై సీఈఓ వివేక్ జైన్ మాట్లాడుతూ ఢిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థలో ప్రస్తుతం 2,846మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. 2018లో మేం ఏడోతరం కాంటిరోల్ టెక్నాలజీని విజయవంతంగా ప్రారంభించాం.

ఉత్పత్తి వైవిధ్యం కోసం డోమ్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని వివేక్ జైన్ తెలిపారు.



---

# సముద్ర తీర పరిశోధనలకు ఏపీ వర్సిటీలతో కలసి పనిచేయండి

**- ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్, జేమ్స్ కుక్ వర్సిటీ ప్రతినిధులతో మంత్రి లోకేష్**



విశాఖపట్నం (చైతన్యరథం): ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ సిలాయ్ జాకి, జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం జేమ్స్ కుక్ యూనివర్సిటీ సింగపూర్ క్యాంపస్ ఆగ్నేసియా, భారతీయ విద్యార్థులకు సేవలందిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ యువత కోసం పర్యావరణ, ఆరోగ్య సంరక్షణ, సస్టయినబుల్ టూరిజం రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ లో 1057 కి.మీ.ల సువిశాల సముద్రతీరం ఉంది. ఫిషింగ్, ఆక్వాకల్చర్, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థ నిర్వహణపై మారిటైమ్, తీర ప్రాంత పరిశోధనలకు ఏపీ వర్సిటీలతో కలసి పనిచేయండి. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ట్రోపికల్ వ్యాధులు, ఆరోగ్య సంరక్షణ, పాండమిక్ ప్రిపేర్డ్ నెస్ పై ఏపీ వర్సిటీలతో కలసి ఉమ్మడి పరిశోధనలు చేపట్టండి. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా టెక్నాలజీ, పాలసీ రీసెర్చికి సహకారం అందించండి. వ్యవసాయ, పట్టణ నీటి అవసరాలకు జలవనరుల నిర్వహణలో నైపుణ్యం కోసం ఏపీతో కలసి ట్రోఫికల్ వాటర్ రీసర్చ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.



# ఏపీలో డౌన్ స్ట్రీమ్ స్టీల్ ప్రొడక్షన్ యూనిట్

**- ఏర్పాటు చేయాలని శ్యామ్ మెటాలిక్స్ ఎండీ షీజిత్ అగర్వాల్‌కు మంత్రి లోకేష్ వినతి**



విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో వ్యాల్యూయాడెడ్ డౌన్ స్ట్రీమ్ స్టీల్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ (రావీజూా) ఎండీ షీజిత్ అగర్వాల్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు.

డైవర్సిఫైడ్ మెటల్స్, ఎనర్జీ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న శ్యామ్ మెటాలిక్స్... రూ.30వేలకోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో దేశవ్యాప్తంగా 5వేలమంది నిపుణులైన సిబ్బంది కలిగి ఉంది. ఆసియా, యూరప్, మిడిల్ ఈస్ట్ దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రాల్లో మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌లు, స్టీల్, అల్యూమినియం ఫ్లాట్ ప్రొడక్ట్స్, ఫెర్రో అల్లాయ్స్, పవర్ జనరేషన్ యూనిట్లు కలిగి ఉంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై శ్యామ్ మెటాలిక్స్ సంస్థ దృష్టిసారించింది.

విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా రావీజూా ఎండీ షీజిత్ అగర్వాల్‌తో శుక్రవారం మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏపీలో వ్యాల్యూయాడెడ్ డౌన్ స్ట్రీమ్ స్టీల్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రస్తుతం ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు పూర్తిస్థాయి అనుకూలమైన వాతావరణం నెలకొని ఉందన్నారు. అనకాపల్లి సమీపంలో ఆర్సెలర్స్ మిట్టల్ సంస్థ రూ.1.35లక్షల కోట్లతో దేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తిచేశారు.

మంత్రి లోకేష్ విజ్ఞప్తిపై షీజిత్ అగర్వాల్ స్పందిస్తూ రాబోయే అయిదేళ్లలో రూ.2,500 కోట్లతో తమ సంస్థను విస్తరించాలని భావిస్తున్నామన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# ఏపీలో వ్యాక్సిన్ తయారీ యూనిట్

**- భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, సీడీఓ రేచస్ ఎల్లాతో భేటీలో మంత్రి లోకేష్ వినతి**




విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో వ్యాక్సిన్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని భారత్ బయోటెక్ ప్రతినిధులను రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ప్రపంచ మానవాళిని కోవిడ్ వంటి మహమ్మారి నుంచి కాపాడిన అంతర్జాతీయస్థాయి వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ మ్యానేజింగ్ డైరెక్టర్ సుచిత్రా ఎల్లా, చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రేచస్ ఎల్లాతో మంత్రి లోకేష్ శుక్రవారం విశాఖలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... అన్నివిధాలా అనుకూలతలు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో వ్యాక్సిన్ తయారీ యూనిట్ నెలకొల్పాలని కోరారు. దీనిపై రేచస్ ఎల్లా మాట్లాడుతూ... ప్రస్తుతం తాము మలేరియా, చికెన్ గున్యా, జికా వైరస్ వంటి పాండమిక్ వ్యాధులకు వైరస్ తయారీ పై పరిశోధనలు సాగిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు.

భారత్ బయోటెక్ సంస్థ కోవాక్సిన్ (కోవిడ్ – 19), రోటావాక్ (రోటా వైరస్), టైప్ బార్ టిసివి (టైఫాయిడ్ వ్యాక్సిన్), జెన్వాక్ (జపనీస్ ఎన్సెఫలిటీస్) వంటి వ్యాక్సిన్లను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా 80దేశాలకు సరఫరా చేస్తోంది. సుమారు రూ.3వేల కోట్ల వార్షికాదాయం కలిగిన ఈ సంస్థ వ్యాక్సిన్ల తయారీలో భారత్ లో టాప్–3లో ఒకటిగా ఉంది. ఆఫ్రికా, సౌత్ ఈస్ట్ ఆసియా, లాటిన్ అమెరికా వంటి దేశాలకు ప్రధానంగా వ్యాక్సిన్ ఎగుమతి చేస్తోంది.

# ఏపీలో మెరైన పరికరాల తయారీ యూనిట్

**- సాగర్ డిఫెన్స్ ప్రతినిధులను కోరిన మంత్రి నారా లోకేష్**




విశాఖపట్నం (చైతన్యరథం): మానవ రహిత సముద్ర వ్యవస్థలు, అటానమస్ వెసల్స్, డిఫెన్స్ సొల్యూషన్స్‌లో పేరెన్నికగన్న సాగర్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో శుక్రవారం విశాఖలో భేటీ అయ్యారు. 2015లో ఏర్పాటైన ఈ సంస్థ సముద్ర భద్రత, నిఘా, పర్యావరణ పరిరక్షణ కోసం అత్యాధునిక ప్లాట్ ఫాంల డిజైనింగ్, తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... భారత్‌ను మెరైన్ రోబోటిక్స్, డిఫెన్స్ ఇన్నొవేషన్‌లో అగ్రగామిగా నిలపడమే తమ లక్ష్యమని అన్నారు. దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు స్వదేశీ సాంకేతికతకు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మెరైన్ రోబోటిక్స్, నావిగేషన్ వ్యవస్థలలో తాము మల్టిపుల్ పేటెంట్లను కలిగి ఉన్నట్లు చెప్పారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 1057 కి.మీ.ల సువిశాల తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక మెరైన్ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పాల్సిందిగా కోరారు. ఏఐ, ఐఓటి, స్వయం ప్రతిపత్తి వ్యవస్థలపై దృష్టి సారించాల్సిందిగా సూచించారు.






# ఏపీలో హైడ్రో టర్బైన్ తయారీ యూనిట్ నెలకొల్పండి

**- కిర్లోస్కర్ ఎండీ అలోక్ కిర్లోస్కర్‌తో భేటీలో మంత్రి లోకేష్**

విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో హైడ్రో టర్బైన్ తయారీ యూనిట్ నెలకొల్పాలని కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్ (కేబీఎల్) ఎండీ అలోక్ కిర్లోస్కర్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో శుక్రవారం కేబీఎల్ ఎండీ అలోక్ కిర్లోస్కర్‌తో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, రెన్యువబుల్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా హైడ్రో టర్బైన్లు, సౌర పంపింగ్ వ్యవస్థల తయారీ యూనిట్ ను ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. నీటిపారుదల, మునిసిపల్ నీటి సరఫరా, పారిశ్రామిక వినియోగానికి కీలకమైన వర్టికల్ టర్బైన్ పంపుల కోసం ఏపీలో ఒక ప్రత్యేక ప్లాంట్‌ను స్థాపించండి. ఏపీ పారిశ్రామిక కారిడార్లలో ముఖ్యంగా విశాఖపట్నం–చెన్నయ్ కారిడార్‌లో ఐఓటి ఆధారిత మురుగునీటి పంపింగ్ వ్యవస్థ, నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయండి. పారిశ్రామిక, పట్టణ మౌలిక సదుపాయాల కోసం UL/FM–సర్టిఫైడ్ ఫైర్ పంపులు, పెద్ద వాల్వ్‌లను (2400 ఎఎ BFV వరకు) ఉత్పత్తి చేసే SPP పంపుల సౌకర్యాన్ని ఏర్పాటు చేయండి. ఏపీలో పారిశ్రామిక క్లస్టర్లు, స్మార్ట్ సిటీలలో భద్రతా వ్యవస్థలకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి లోకేష్ చెప్పారు. దీనిపై అలోక్ కిర్లోస్కర్ మాట్లాడుతూ... తమ సంస్థ ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో తమ సంస్థ కార్యాలయాలు ఉన్నాయని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# రెన్యువబుల్ పవర్, డేటా సెంటర్లలో పెట్టుబడి పెట్టండి

**- వారీ ప్రెసిడెంట్ అంకితా జోషితో భేటీలో మంత్రి లోకేష్ వినతి**



విశాఖపట్నం (చైతన్యరథం) వారీ (WAREE) సంస్థ చైర్మన్ అంకితా జోషి,సీఓఓ శ్యామ్‌సుందర్ రఘుపతితో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం విశాఖలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో 1057కి.మీ.ల సువిశాల తీరప్రాంతం, 6 ఆపరేటింగ్ పోర్టులు, ఆరు విమానాశ్రయాలతో పాటు 5 వేల కి.మీ.లపైగా రైల్వేలైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పరిశ్రమలఏర్పాటుకు అన్నివిధాలా అనుకూలమైన వాతావరణం నెలకొంది. సుదీర్ఘ పాలనానుభవం కలిగిన డైనమిక్ లీడర్ చంద్రబాబునేతృత్వంలో ఏపీ పారిశ్రామికరంగంలో పరుగులు తీస్తోంది. గూగుల్ సంస్థ విశాఖ ఏఐ హబ్ పై 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్న నేపథ్యంలో విశాఖ డేటా సెంటర్ హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల ద్వారా కేవలం 21రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నాం. రెన్యువబుల్ పవర్, డేటా సెంటర్లు, బ్యాటరీ స్టోరేజి రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. వారీ ప్రతినిధులు మాట్లాడూతూ... ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే శుభవార్త చెబుతామని అన్నారు.



# ఏపీలో ప్రతిభకు కొదవ లేదు

- భారత్‌లో గ్రోత్ ఇంజన్లుగా టైర్-2 నగరాలు
- ఐటీ, జీసీసీ పాలసీలతో అత్యుత్తమ ప్రోత్సాహకాలు ఇస్తున్నాం
- ఇది చరిత్ర సృష్టించే సమయం
- టైర్-2 నగరాలపై సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేష్
- 42 ఐటీ సంస్థలతో రూ.44,255 కోట్ల మేర పెట్టుబడులకు ఎంవోయూలు
- 1,43,930 మందికి ఉద్యోగ అవకాశాలు




విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో ప్రతిభకు కొదవ లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భారతదేశంలోని టైర్ - 2 నగరాల్లో ఐటీ, జీసీసీల ఏర్పాటు - ప్రతిబంధకాలు అధిగమిస్తున్నామా... భ్రమలు కల్పిస్తున్నామా? (IT and GCCs in Tier-2 cities in India: Breaking Barriers or Building Illusions?) అనే అంశంపై విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రైమస్ పార్టనర్స్ లిమిటెడ్ సీఈఓ నిలయవర్మ హోస్ట్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఏపీనే ఎందుకు పరిగణనలోకి తీసుకోవాలన్న ప్రశ్నకు ఒకే ఒక కారణం ఉంది. ఇక్కడ ప్రతిభ ఉంది. రెండో ముఖ్య విషయం.. ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే.. విశాఖ ఖర్చుపరంగా పెద్ద ప్రయోజనం ఇస్తుంది. జీసీసీల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నాం. మూడో కారణం.. ఏపీలో ప్రతిభ మాత్రమే కాదు.. యువతను జీవితాంతం నేర్చుకునేలా చేసే మెకానిజాన్ని కూడా నిర్మిస్తున్నాం. నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించబోతున్నాం. ఈ తరహా ప్రాజెక్ట్ దేశంలోనే మొదటిది. స్కిల్ సెన్సెస్ కూడా చేయబోతున్నాం. కార్పెంటర్ నుండి ఏఐ ఇంజనీర్ వరకు ప్రతి ఒక్కరి స్కిల్స్‌ను అంచనా వేసి, వారి బలం, బలహీనతలను గుర్తించి, అనుకూలమైన స్కిల్ పార్టనర్లు వచ్చి వారికి సరైన శిక్షణ ఇవ్వడానికి ఒక వ్యవస్థని ఏర్పాటుచేస్తున్నాం. ఈ మూడు కారణాలు ఏపీనే ఎందుకు ఎంచుకోవాలి అనేందుకు నిదర్శనంగా నిలుస్తాయని మంత్రి లోకేష్ చెప్పారు.

### ఇది చరిత్ర సృష్టించే సమయం

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా విధానం. వేగవంతమైన సౌకర్యాల కల్పన కోసం పెట్టుబడి దారులు ఏపీని ఎంచుకుంటారు. అందుకు మేం కూడా సిద్ధంగా ఉన్నాం. కార్పొరేట్లు ఎంత వేగంగా పనిచేస్తారో, దాని కంటే వేగంగా మేంపనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇది చరిత్ర సృష్టించే సమయం. అందరం కలిసి రాష్ట్రంతో పాటు దేశం గర్వపడే విధంగా చేయాలి. ప్రస్తుతం విశాఖపట్నం కేవలం సముద్రతీర పారిశ్రామిక నగరంగానే కాకుండా భారతదేశ ప్రతిష్టాత్మక డిజిటల్ డెస్టినేషన్‌గా తయారైంది. ఇప్పటికే ఆర్థిక సేవలు, ఆరోగ్య విశ్లేషణలు, ఇంజనీరింగ్ డిజైన్, ఏఐ ఆధారిత ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ వంటి విభాగాల్లో అనేక ప్రముఖ ఐటీ, జీసీసీ కార్యకలాపాలకు విశాఖ నగరం వేదికగా నిలుస్తోంది.

మెట్రో నగరాల కంటే 20% తక్కువ నిర్వహణ ఖర్చులు, అత్యుత్తమ జీవన ప్రమాణాలు, 25వేలకు పైగా ఐటీ నిపుణులతో సాంప్రదాయ విశాఖపట్నం... గ్లోబల్ స్థాయిలో విశ్వసనీయమైన టైర్- 2 నగరంగా తయారైంది. భారత ఐటీ పరిశ్రమ ప్రపంచంలో నమ్మకమైన టెక్నాలజీ భాగస్వామిగా రూపుదిద్దుకుంటోంది.





దీర్ఘకాలంగా పరిమిత అవకాశాలు గల ప్రాంతాలుగా ఉన్న టైర్ -2 నగరాలు... ఇప్పుడు భారతదేశంలో సర్వసన్నద్ధంగా తయారై కొత్త గ్రోత్ ఇంజన్లుగా మారాయి. మా ఐటీ పాలసీ 2024-30, జీసీసీలకు అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తోంది. జీసీసీలు ఇప్పుడు ఖర్చుకేంద్రాలు కాదు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, డిజైన్ ఆధారిత ఆర్ అండ్ డీ ని నడుపుతున్న ఆవిష్కరణ కేంద్రాలు. టైర్ -2 నగరాల అభివృద్ధికి విశాఖనగరం చక్కటి నమూనాగా నిలుస్తోంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా భారతదేశంలోనే బలమైన డిజిటల్ ఆర్థిక నగరంగా మారుతోందని మంత్రి లోకేష్ అన్నారు.

### 42 ఐటీ సంస్థలతో రూ.44,255 కోట్ల మేర పెట్టుబడులకు ఎంవోయూలు

మంత్రి లోకేష్ సమక్షంలో 42 ఐటీ, ఐటీఈఎస్, జీసీసీ, డేటా సెంటర్స్ సంస్థలతో రూ.44,255 కోట్ల పెట్టుబడులకు జీవోలు, ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సదస్సులో ఎక్సా ఎక్సెల్ కంట్రీ హెడ్ అదితి శుక్లా, కాగ్నిజెంట్ ఆసియా పసిఫిక్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ హజ్రా, క్వెస్ కార్ప్ లిమిటెడ్ సిఇఓ కపిల్ జోషి, మాస్టర్‌కార్డ్ టెక్ హబ్స్ ఆసియా-పసిఫిక్ హెడ్ రాజేష్ మణి, టిసిఎస్ గ్లోబల్ హెడ్ శ్రీధర్ వెంకటరమణన్, ఎన్ఎస్ఆర్ కో ఫౌండర్ విక్రమ్ అహూజా, తదితరులు పాల్గొన్నారు.

## డేటా సెంటర్లపై పెట్టుబడులు పెట్టండి

**- ఎస్ఐఎల్ చైర్మన్ సుఖ్‌భీర్ అహ్లూకు మంత్రి లోకేష్ వినతి**




విశాఖపట్నం (చైతన్యరథం): ఎస్ఏఇఎల్ చైర్మన్ సుఖ్‌భీర్ అహ్లూతో మంత్రి నారా లోకేష్ శుక్రవారం విశాఖలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఇప్పటికే రాయలసీమలో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టిన ఈ సంస్థను.. డేటా సెంటర్ హబ్‌గా మారుతున్న విశాఖపట్నంలోనూ పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుఖ్ భీర్ అహ్లూ మాట్లాడుతూ... రెన్యువబుల్ ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎస్ఎఇఎల్ సంస్థ 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసిందన్నారు. వ్యవసాయ, మున్సిపల్ వ్యర్థాల ఆధారిత విద్యుత్ ప్లాంట్లను నిర్మించింది. హైవేలు, ఇండస్ట్రియల్ పార్కులు, సస్టయినబుల్ హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టిందని అన్నారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై సుఖ్ భీర్ అహ్లూ సానుకూలంగా స్పందించారు.

## భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి బ్రూక్‌ఫీల్డ్

**- మంత్రి నారా లోకేష్**

విశాఖపట్నం (చైతన్యరథం): ప్రఖ్యాత బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఏపీలో భారీ పెట్టుబడులకు ముందుకు రావటం పట్ల రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సంస్థను ఏపీకి ఆహ్వానించటం గర్వకారణంగా ఉందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.

పునరుత్పాదక శక్తి, బ్యాటరీ, పంప్డ్ స్టోరేజ్, సోలార్ తయారీ, ఇతర డీకార్బనైజేషన్ యూనిట్లలో 12 బిలియన్ డాలర్ల (రూ.1.1 లక్షల కోట్లు) భారీ పెట్టుబడితో బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఏపీకి వస్తోందన్నారు. బ్రూక్‌ఫీల్డ్ సంస్థ.. డేటా సెంటర్లు, వాణిజ్య రియల్ ఎస్టేట్, GCC\T, మౌలిక సదుపాయాలు, పోర్టులు వంటి విభిన్న రంగాల్లో ప్రఖ్యాతి గాంచింది. స్థిరమైన, పరివర్తనాత్మక పెట్టుబడులకు ప్రముఖ గమ్యస్థానంగా భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ స్థానాన్ని బలోపేతం చేయటంలో ఈ భారీ పెట్టుబడి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.




## బాలల దినోత్సవం.. మంత్రి లోకేష్ శుభాశీస్సులు



విశాఖపట్నం (చైతన్యరథం): చాచా నెహ్రూ జయంతి సందర్భంగా పిల్లలందరికీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ జాతీయ బాలల దినోత్సవ శుభాశీస్సులు అందజేశారు. చిన్నపిల్లలు అంటే నాకు ప్రాణం. కల్మషం లేని చిన్నారుల చిరునవ్వులు నాకెంతో ఇష్టం. . నేటి బాలలను భావి భారతానికి బాధ్యతాయుతమైన రేపటి పౌరులుగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఆటపాటలతో స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం కల్పిస్తున్నాం. పిల్లలకు భద్రత, ఆరోగ్యం, ఆనందం, పౌష్టికాహారం అందిస్తూ సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.



విశాఖపట్నంలో జరుగుతోన్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ఎయిర్‌పోర్టులో హార్దిక స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు నాయుడు. అనంతరం ఉపరాష్ట్రపతికి ఇచ్చిన అల్పాహార విందులో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్, ఇతర మంత్రులు.





# రిలయన్స్‌కు హ్యాట్సాఫ్!

- భారీ పెట్టుబడులకు ముందుకు రావడం అభినందనీయం
- ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు
- రిలయన్స్ ఛైర్మన్ ముఖేష్ అంబానీకి ధన్యవాదాలు



విశాఖపట్నం (చైతన్య రథం): రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమ్ బోర్డు సభ్యుడు ఎంఎస్ ప్రసాద్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సౌత్ మెంటార్ మాధవరావులతో భేటీ ఆనందాన్నిచ్చింది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ అంగీకారం తెలపడాన్ని రాష్ట్ర ప్రజలతో పంచుకోవడం ఆనందంగా ఉంది. రిలయన్స్ రాష్ట్రంలో 1 జిడబ్ల్యు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇది ప్రపంచంలోని అత్యంత అధునాతన జీపీయులు, టీపీయులు, ఏఐ ప్రాసెసర్‌లను హోస్ట్ చేయడానికి రూపొందించబడిన పూర్తి మాడ్యులర్. ఇది జామ్‌నగర్‌లోని రిలయన్స్ గిగావాట్ స్థాయి ఏఐ డేటా సెంటర్‌కు అనుబంధంగా పనిచేయనుంది. జామ్‌నగర్, ఏపీలోని రెండు ఏఐ డేటా సెంటర్లతో ఆసియాలోనే అత్యంత బలమైన ఏఐ మౌలిక సదుపాయాల నెట్వర్క్‌లో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్ ఒకటిగా రూపుదిద్దుకోనుంది. ఏపీ డేటా సెంటర్‌ను మరింత శక్తివంతం చేసేందుకు వీలుగా 6 జీడబ్ల్యుపీ సౌర విద్యుత్ ప్రాజెక్టునూ రిలయన్స్ నెలకొల్పనుంది. ఈ చొరవ ఏపీ ప్రస్తుత గ్రౌండ్-మౌంటెడ్ సోలార్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తుంది. మన పునరుత్పాదక శక్తిలో 30శాతంకంటే ఎక్కువకు దోహదపడుతుంది, ఏపీయొక్క విస్తారమైన సౌర సామర్థ్యాన్ని బలోపేతం చేయనుంది. అదనంగా రాయలసీమలో ప్రపంచస్థాయి ఆటోమేటెడ్ సౌకర్యమైన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్క్‌ను నిర్మించనుంది. ఈ భారీ పెట్టుబడి ప్రత్యక్షంగా పరోక్షంగా వేల ఉద్యోగాలను సృష్టించనుంది. వేలాది కుటుంబాలకు స్థిరమైన ఆదాయ అవకాశాలను కల్పించనుంది. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ, స్వచ్ఛమైన ఇంధన నాయకత్వం, సమ్మిళిత వృద్ధి ప్రయాణంలో కొత్త మైలురాయిని సూచించే రిలయన్స్ ప్రకటనలు సంతోషదాయకం. అందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్ ముఖేష్ అంబానీకి హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.

## టీడీపీ కార్యకర్త అచ్యుత్ మృతిపై
# మంత్రి లోకేష్ సంతాపం

**- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**



విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ యువ సైనికుడు యర్రగొండపాలెం నియోజకవర్గం చిన దోర్నాలకు చెందిన అన్నపురెడ్డి అచ్యుత రెడ్డి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారని తెలిసి షాక్‌కి గురయ్యానని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. పార్టీనే ప్రాణంగా భావించిన తమ్ముడు అచ్యుత్‌కు అశ్రునివాళులర్పిస్తున్నానన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ఎక్కడ, ఏ కార్యక్రమం నిర్వహించినా.. తప్పనిసరిగా కనిపించే మన అచ్యుత్ హఠాన్మరణం చాలా బాధాకరం. ఈ కష్ట సమయంలో అచ్యుత్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఏఐ ఆధారిత స్కిల్ సెన్సస్

## - సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా ఏఐ ఆధారిత నైపుణ్య గణన ప్రారంభిస్తామని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రెండు రోజుల పాటు విశాఖపట్నంలో జరిగే 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు శుక్రవారం ప్రారంభమైనది. మొదటి రోజు Transforming Ideas into Global Impact: Accelerating Inclusive and Sustainable Innovation పేరుతో జరిగిన రెండవ ప్లీనరీ సెషన్‌లో మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాంకేతిక ఆధారిత పాలన, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సేవల విస్తరణ, తదితర కీలక కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన ఏఐ ఆధారిత స్కిల్ సెన్సస్ ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామన్నారు. కార్పెంట్రీ నుండి ఏఐ ఇంజనీరింగ్ వరకు అన్ని రంగాల్లోని నైపుణ్య లోపాలను ఈ వ్యవస్థ గుర్తించగలదని చెప్పారు.

### ఒకే వాట్సాప్ నంబర్‌లో వెయ్యి ప్రభుత్వ సేవలు ...

రాష్ట్రం డిజిటల్ సేవల్లో సాధించిన పురోగతిని మంత్రి వివరిస్తూ ఒకే వాట్సాప్ నంబర్ ద్వారా సుమారు 1,000 ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. జెనరేటివ్ ఏఐ సహాయంతో ఈ ప్లాట్‌ఫామ్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రభుత్వ డేటా లేక్‌ను మరింత బలోపేతం చేయనున్నామని చెప్పారు.

దేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ పెట్టుబడిని డేటా సెంటర్ రంగంలో రాష్ట్రం ఆకర్షించిందని ఆయన ప్రకటించారు. డేటా సెంటర్ ఒక ఎకోసిస్టమ్‌కు కేంద్ర బిందువై, ఫైనాన్షియల్ సర్వీసెస్ నుండి జియో-టెక్ వరకు అత్యాధునిక సాంకేతికత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

### దేశానికి దారి చూపే రాష్ట్రం ఏపీ

భవిష్యత్తు సాంకేతికతను ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపించగల సత్తా ఉందని, ఇదే దేశానికి, ఆపై ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి లోకేష్ విశ్వాసం వ్యక్తం చేశారు. దేశం అందించే స్కిల్‌ను మరే దేశం అందించలేకపోవడం మనకున్న అతిపెద్ద బలంగా పేర్కొన్నారు. సౌదీ అరేబియాతో పరస్పర పెట్టుబడులు, సాంకేతిక సహకారం కొనసాగించడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. సహకారం అనేది ఇరువర్గాలకూ లాభదాయకంగా ఉండాలని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. చర్చలు మాత్రమే కాకుండా అర్థవంతమైన ఫలితాలు సాధించే దిశగా ముందుకు సాగాలని అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.




సౌదీ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ అథారిటీ సీఈవో హెచ్.ఇ ఖలేద్ అల్మహతఫ్ మాట్లాడుతూ... 2028 నాటికి ప్రపంచ డేటా పరిమాణం 395 జటా బైట్స్‌కు చేరుకుంటుందని అంచనా అన్నారు. ఒక దశాబ్దం క్రితం ఎవరూ ఊహించలేని పరిస్థితి కానీ, నేడు ఆ పరిస్థితికి వచ్చామన్నారు. కాబట్టి ప్రస్తుతం ఉన్న డేటాను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అటువంటి వారిదే భవిష్యత్తు అని అన్నారు.

ఏఐ సింగపూర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్, ఎన్యుఎస్ఏఐ (NUSAI) డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డా .మోహన్ కంకణహల్లి మాట్లాడుతూ... కృత్రిమ మేధస్సు (ఏఐ) పునరుజ్జీవనం ప్రపంచవ్యాప్తంగా పరిశోధన, ఆవిష్కరణలకు అపూర్వ వేగాన్ని అందిస్తున్నదన్నారు. NUSAI ఇన్‌స్టిట్యూట్‌లో కోర్ ఏఐ తో పాటు, AI + X మోడల్ ఆధారంగా ఫైనాన్స్, సైన్స్, సస్టైనబిలిటీ వంటి రంగాల్లో 150 మందికి పైగా ప్రొఫెసర్లు పనిచేస్తున్నారని ఆయన వివరించారు. జశీంఎశీం వంటి అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లు ఏఐ సహాయంతో శాస్త్రీయ పత్రాలు, డేటాను విశ్లేషించి పరిశోధన హైపోతెసిస్‌లను వేగంగా రూపొందిస్తున్నా యని, ఫీల్డ్స్ మెడల్ విజేత టెరెన్స్ టావ్ నేతృత్వంలో గణితశాస్త్రంలో కూడా ఏఐ కొత్త నిరూపణలు అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు.

NUS GRID ప్రోగ్రామ్ ద్వారా శాస్త్రీయ పరిశోధనలను స్టార్టప్‌లుగా మార్పు చేసే ప్రయత్నాలు వేగవంతమై, ఐదేళ్లలో 400 కంటే ఎక్కువ స్టార్టప్‌లు ఏర్పడ్డాయని తెలిపారు. భారత్-సింగపూర్ మధ్య కో-ఇన్నోవేషన్ ల్యాబ్స్, అకాడెమియా-ఇండస్ట్రీ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆయన సూచించారు.

చైతన్యరథం

# హిట్.. హిట్.. సమ్మిట్!



*రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహకాలకు ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలు ఓపెన్ చేస్తున్నాం. ఈ ప్రోత్సాహకాలకు సావనీర్ గ్యారంటీ ఇస్తాం. ఎర్త్ మినరల్స్ నుంచి ఏరో స్పేస్ వరకు ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయి. ఒప్పందాలు చేసుకుందాం.. భవిష్యత్ అవసరాలపై ప్రణాళికలు రూపొందిద్దాం. కేవలం 17 నెలల వ్యవధిలో రాష్ట్రానికి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం. వాటిద్వారా 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్ వే అన్నది మర్చిపోవద్దు. పపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ఇప్పుడు అగ్రగామిగా ఉంది. దేశంలో అగ్రస్థానం సాధించడానికి -ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారి ముందుకెళ్తున్నాం. వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాలన్నది ఏపీ సంకల్పం. డ్రోన్, ఎలక్ట్రానిక్, ఏరోస్పేస్, స్పేస్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేసి రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుదుత్పాదన లక్ష్యంగా పని చేస్తున్నాం. ఏరో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ఏపీలో పెట్టుబడులకు ఆర్గానిక్ వాతావరణాన్ని ఆవిష్కరించాం. ఏపీపై దృష్టి పెట్టాలని ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పిలుపునిస్తున్నా.*

**- సీఎం చంద్రబాబునాయుడు**

- **ఏపీ అభివృద్ధికి పోటెత్తిన 'భాగస్వామ్యం'**
- **వరదలా వచ్చిపడిన పారిశ్రామిక పెట్టుబడులు**
- **విశాఖ వేదికగా భారీగా కుదిరిన ఎంఓయూలు**
- **జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు**
- **పారిశ్రామికవేత్తల స్పందనతో ఏపీలో ఉత్సాహం**
- **400 ఎంఓయూల ద్వారా రూ.11.92 లక్షల కోట్లు**
- **13.32 లక్షలమందికి ఉద్యోగావకాశాలు..**
- **తొలి రోజు 'భాగస్వామ్యం' రూ.8.26 లక్షల కోట్లు**
- **ఒక్కరోజులో రాష్ట్రానికి 12.05 లక్షల ఉద్యోగావకాశాలు**
- **తొలిరోజు సీఎం సమక్షంలో 41 ఎంఓయూలు**
- **ఒప్పంద పెట్టుబడులు.. రూ.3.5 లక్షల కోట్లు**
- **4.16 లక్షల ఉద్యోగావకాశాలు..**
- **మంత్రుల సమక్షంలో 324 ఒప్పందాలు**
- **ఒప్పంద పెట్టుబడులు.. రూ.4.76 లక్షల కోట్లు**
- **సీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐ అండ్ ఐ, పరిశ్రమలు, ఐటీ, మున్సిపల్ శాఖలకు భారీ స్పందన**






విశాఖపట్నం (చైతన్య రథం): దేశానికి గేట్ వేలా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పీల్ -ప్రపంచ పారిశ్రామికవేత్తలపై పాశుపతాస్త్రంలా పనిచేసింది. చంద్రబాబు సమర్థత, సంకల్పబలంపై అచంచల విశ్వాసమున్న పారిశ్రామిక దిగ్గజాలు.. సాంకేతిక టైకూన్‌లు -విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు బారులు తీరారు. ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఏపీ డోర్స్ ఆర్ ఓపెన్ అంటూ -బ్రాండ్ సీబీఎన్ ఇచ్చిన ఇన్విటేషన్‌కు ఆరంభంలోనే దక్కిన ప్రతిఫలం -అక్షరాలా రూ.11 లక్షల 91వేల 972 కోట్లు! ఈ పెట్టుబడులవల్ల రాష్ట్రవాసులకు దక్కే ఉద్యోగావకాశాలు 13 లక్షల 32 వేల 445. భాగస్వామ్య సదస్సు ఆరంభానికి 24 గంటలుముందే రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు -రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, పెట్టుబడులు పెట్టేందుకు ఏపీలోవున్న అవకాశాలు.. ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ఇవ్వబోయే ప్రోత్సాహకాలు.. నెలకొల్పిన సంస్థల లాభదాయక మనుగడకు తీసుకొచ్చిన పాలసీలు.. -ఇలా ప్రతి విషయంలోనూ సమర్థవంతమైన ప్రజెంటేషన్ ఇస్తూ వచ్చారు. విశ్రాంతి అన్నదే మర్చిపోయి.. క్షణం తీరిక లేకుండా చంద్రబాబు సాగించిన పెట్టుబడుల వేట.. అందుకు దక్కిన ప్రతిఫలం చూసి రాష్ట్రమే విస్మయానికి గురవుతుంది. సీబీఎన్ టీం లక్ష్యంగా పెట్టుకున్న రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన సాధ్యమేనా? అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ.. ఒక్కరోజులోనే లక్ష్యాన్ని అధిగమించిన చంద్రబాబు సమర్థత, ముందుచూపునకు -కేంద్రం పెద్దలు, రాష్ట్ర ప్రజలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

రెండురోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు శుక్రవారంనాటికి -రాష్ట్ర ప్రభుత్వం 400 ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈమేరకు జరిగిన ఒప్పందాల ద్వారా రూ.11,91,972 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. 13,32,445 ఉద్యోగాలపై హామీ పొందింది. ఇదీ -గురు, శుక్రవారాల్లో వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూల విలువ. మొత్తంగా 7 రంగాల్లో భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఏపీసీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐ అండ్ ఐ, పరిశ్రమలు-వాణిజ్యం, ఐటీ, మున్సిపల్ శాఖల్లో ప్రభుత్వం వివిధ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో విశాఖ సమ్మిట్ మొదటి రోజునే సూపర్ హిట్ అనిపించుకుంది. ప్రభుత్వ అంచనాలకుమించి పరిశ్రమలు ప్రతిస్పందించాయి. మొత్తంగా 410 ఎంఓయూల ద్వారా రూ.10 లక్షల కోట్లవరకు పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకుంది. అయితే అంచనాలకుమించి పారిశ్రామికవేత్తలనుంచి స్పందన కనిపించింది. భాగస్వామ్య సదస్సుకు ముందురోజే భారీఎత్తున పెట్టుబడులురాగా.. సదస్సు తొలిరోజున అంతకుమించిన స్పందన కన్పించింది. సదస్సు తొలిరోజైన శుక్రవారం 365 ఎంఓయూలు కుదుర్చుకోగా... వీటిద్వారా రూ.8,26,668 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా 12,05,175 మందికి ఉద్యోగావకాశాలు వివిధ పరిశ్రమల నుంచి దక్కనున్నాయి. ఇదంతా ఒక్క రోజులో సాధ్యమైన సంచలనం!!

## ముఖ్యమంత్రి సమక్షంలో...

భాగస్వామ్య సదస్సు సందర్భంగా గత రెండు రోజుల్లో సీఎం సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ.7,15,490 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 5,42,761మంది ఉద్యోగాలకు హామీ పొందింది రాష్ట్ర ప్రభుత్వం. భాగస్వామ్య సదస్సు తొలి రోజున వివిధ రంగాలకు చెందిన కంపెనీలతో ముఖ్యమంత్రి వరుస భేటీలు నిర్వహించారు. గురువారం వరుసగా 15 భేటీలు నిర్వహిస్తే.. శక్రవారం దాదాపు అదేస్థాయిలో ముఖ్యమంత్రి వరుస సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం సీఎం సమక్షంలో ఎంఓయూలు చేసుకున్న సంస్థల్లో ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్, ఎకోరెన్ ఎనర్జీ, జాక్సన్ గ్రీన్, జీఎంఆర్ ఎనర్జీ, ఎస్సార్ రెన్యువబుల్స్, వారీ గ్రూప్, సీసన్ గ్లోబల్ ట్రేడింగ్, ఎస్‌ఏఈఎల్, జెఎం బాక్సీ, శ్రీ సిమెంట్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, టాటా పవర్, పతంజలి ఫుడ్, ఇండస్ కాఫీ, కెల్లాగ్ ఇండియా తదితర సంస్థలున్నాయి. ఇక విడివిడి భేటీల్లో రాష్ట్రంలో ఉన్న పెట్టుబుడులను ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులకు ఆసాంతం వివరిస్తూ... పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. అలాగే పారిశ్రామికాభివృద్ధికి చేపడుతున్న చర్యలనూ వివరించారు. వీటితోపాటు.. కేంద్ర ప్రభుత్వం వైపునుంచి రాయితీలు వచ్చే పరిస్థితి ఉంటే.. అవీ వచ్చేలా సహకరిస్తామని కంపెనీల ప్రతినిధులకు హామీలిచ్చారు. భాగస్వామ్య సదస్సు తొలిరోజు జరిగిన ఒప్పందాల కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధనరెడ్డి, సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల సమక్షంలోనూ భారీగా ఒప్పందాలు...

ఇక వివిధ శాఖలకు చెందిన మంత్రులు కూడా భాగస్వామ్య సదస్సు తొలిరోజున భారీఎత్తున ఒప్పందాలు చేసుకుని పెట్టుబడులను రాబట్టారు. ఐటీ మంత్రి లోకేష్, వివిధ శాఖల మంత్రులంతా కలిసి మొత్తంగా 324 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని రూ.4,76,482 కోట్లు పెట్టుబడులకు హామీ పొందారు. ఈ ఒప్పందాల ద్వారా 7,88,884 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. తొలిరోజు సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న మంత్రుల్లో నారా లోకేష్, టీజీ భరత్, గొట్టిపాటి రవి, బీసీ జనార్దన్ రెడ్డి, నారాయణ ఉన్నారు. నారా లోకేష్ రూ.1,38,752 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకోగా... మిగిలిన మంత్రులు కూడా భారీఎత్తున ఎంఓయూలు కుదుర్చుకున్నారు.

## రెండు రోజుల్లో రంగాలవారీ సాధించిన పెట్టుబడుల వివరాలు:

| | | |
|---|---|---|
| విద్యుత్ రంగం | రూ.5,11,502 కోట్లు | 2,45,222 మందికి ఉద్యోగావకాశాలు |
| ఐ అండ్ ఐ | రూ.2,05,008 కోట్లు | 3,05,574 మందికి ఉద్యోగావకాశాలు |
| సీఆర్డీఏ | రూ.50,511 కోట్లు | 42,225 మందికి ఉద్యోగావకాశాలు |
| మున్సిపల్ | రూ.4,944 కోట్లు | 12,150 మందికి ఉద్యోగావకాశాలు |
| ఫుడ్ ప్రాసెసింగ్ | రూ.13,009 కోట్లు | 47,390 మందికి ఉద్యోగావకాశాలు |
| పరిశ్రమలు.. వాణిజ్యం | రూ.2,68,248 కోట్లు | 4,23,869 మందికి ఉద్యోగావకాశాలు |
| ఐటీ | రూ.1,38,752 కోట్లు | 2,56,015 మందికి ఉద్యోగావకాశాలు |



చైతన్యరథం

# ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం



విశాఖపట్నం (చైతన్యరథం): సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనడానికి విశాఖపట్నం చేరిన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ఐఎన్ఎస్ దేగాలో ఘనస్వాగతం లభించింది. ఉప రాష్ట్రపతిని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్య-ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ ఉప రాష్ట్రపతితో పరామర్శించి సమ్మిట్ నిర్వహణ, పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు.

ఐఎన్ఎస్ దేగాలో ఏర్పాటుచేసిన ప్రత్యేక గార్డ్ ఆఫ్ ఆనర్ కార్యక్రమం తరువాత, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ నగరంలోని సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ వేదికకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, పలువురు నేతలు పాల్గొని, ఉప రాష్ట్రపతికి ఆత్మీయ స్వాగతం అందించారు. రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులు, గ్లోబల్ సహకారం వంటి అంశాలకై ఈ సమ్మిట్‌ను కీలక వేదికగా ప్రభుత్వం చూస్తోంది.



























చైతన్యరథం



# ఏపీ పెవిలియన్ ప్రారంభించిన మంత్రి లోకేష్





విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో శుక్రవారం ప్రారంభమైన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లో ఏపీ పెవిలియన్ ను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. పెవిలియన్ మొత్తం కలియతిరిగి వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఏపీ పెవిలియన్ లో ఏర్పాటుచేసిన వివిధ సాఫ్ట్ వేర్, ఏఐ ఇంటిగ్రేటెడ్ అప్లికేషన్స్ ను ఆసక్తిగా తిలకించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి లోకేష్ వెంట కేంద్ర మంత్రి కింజరాజు రామ్మోహన్ నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, తదితరులు ఉన్నారు.






చైతన్యరథం

# ఏపీ అభివృద్ధిలో భాగస్వాములవుతాం

● ఏపీ యువతలో నైపుణ్యం పెంచి ఉద్యోగాలిస్తాం ● సీఎం చంద్రబాబు విజన్ అద్భుతం ● ఏపీలో శరవేగంగా అభివృద్ధి ● 30వ భాగస్వామ్య సదస్సులో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు








విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో ప్రారంభమైన రెండు రోజుల భాగస్వామ్య సదస్సులో తొలిరోజు శుక్రవారం పాల్గొన్న ప్రముఖ సంస్థలకు చెందిన పారిశ్రామిక వేత్తలు ఏపీలో జరుగుతున్న అభివృద్ధి గురించి... పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తెచ్చిన పాలసీల గురించి మాట్లాడారు. అదానీ పోర్ట్స్, సెజ్ ఎండీ కరణ్ అదానీ మాట్లాడుతూ... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఆంధ్రప్రదేశ్ ఆధునిక విధానాలతో నవీకరణ చెందుతోందన్నారు. భారత దేశంలో వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని కరణ్ అదానీ అభిప్రాయపడ్డారు. దీనికి మార్గదర్శిగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. ఏపీలో డేటా సెంటర్లు, ఓడరేవులు, సిమెంట్ ఉత్పత్తి, తదితర రంగాల్లో అదానీ సంస్థ పనిచేస్తోందని వివరించారు. ఏపీ వృద్ధిలో అదానీ సంస్థ కూడా భాగస్వామి అవుతోందని స్పష్టం చేశారు. నైపుణ్యం ఉన్న యువత, మానవ వనరులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఏపీని మంత్రి నారా లోకేష్ తీర్చిదిద్దుతున్నారని కరణ్ అదానీ కితాబిచ్చారు.

జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లిఖార్జున రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఏపీలో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాలు వస్తున్నాయన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో భాగస్వామి అయినందుకు సంతోషంగా ఉందని జీఎమ్మార్ అధినేత చెప్పారు. ఇంటిగ్రేటెడ్ ఏరో స్పేస్ ఎకో సిస్టంను ఆంధ్రప్రదేశ్‌లో సిద్ధం చేస్తున్నామని... మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్ సెంటర్ కూడా భోగాపురం ఎయిర్ పోర్టులో వస్తుందని జీఎమ్మార్ సంస్థ అధినేత ప్రకటించారు.

**సీబీఎన్ ఏర్పాటు చేసిన జినోమ్ వ్యాలీ నుంచే కోవిడ్ టీకాలు**

ఈ సదస్సులో పాల్గొన్న భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె.ఎల్లా మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ భారత్ ముందుకువెళ్తోందని... గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో స్వయం ప్రతిపత్తి సాధించేలా దేశం ముందడుగు వేస్తోందని చెప్పారు. భాగస్వామ్యం, ఆవిష్కరణలు, విలువ ఆధారిత ఉత్పత్తులతోనే ఆత్మనిర్భర్ భారత్ ఆవిష్కృతం అవుతుందని అభిప్రాయపడ్డారు. కోవిడ్ లాంటి విపత్తు వచ్చినప్పుడు ప్రపంచానికి వాక్సిన్ అందించగలిగిన దేశంగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు జీనోమ్ వ్యాలీ లాంటి ఎకోసిస్టమ్‌ను తయారు చేశారని... అదే జీనోమ్ వ్యాలీలో భారత్ బయోటెక్ కోవిడ్‌కు వ్యాక్సీన్ తయారు చేసి అందించిందని సుచిత్రా ఎల్లా వివరించారు.

బజాజ్ ఫిన్ సర్వ్ చైర్మన్, ఎండీ సంజీవ్ బజాజ్ ప్రసంగిస్తూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారతదేశానికి గ్రోత్ ఇంజిన్‌లా ముందుందన్నారు. వెయ్యి కిలోమీటర్ల తీరం కలిగిన ఏపీ... ట్రేడ్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌కు గేట్ వే గా ఉంటోందన్నారు. యువతకు అండగా ఉండేలా రాహుల్ బజాజ్ స్కిల్లింగ్ సెంటర్లు... విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో ఏర్పాటు చేస్తామని సంజీవ్ బజాజ్ ప్రకటించారు.

భారత్ ఫోర్జ్ జాయింట్ ఎండీ అమిత్ కల్యాణి ప్రసంగిస్తూ... ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డేటా యుగం నడుస్తోందని... ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీ కూడా ఈ రంగాల్లో ముందడుగు వేస్తోందన్నారు. ఏపీ వృద్ధిలో భారత్ ఫోర్జ్ కూడా భాగస్వామి అవుతోందని వెల్లడించారు. నౌకా నిర్మాణం, పర్యాటకం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని భారత్ ఫోర్జ్ నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే డిఫెన్స్ ఉత్పత్తుల తయారీలో ఏపీలో పనిచేస్తున్నామని... రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు నైపుణ్యాలు కల్పించే అంశంలోనూ భారత్ ఫోర్జ్ సంస్థ భాగస్వామి అయ్యిందని అమిత్ కల్యాణి వివరించారు.

లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ మాట్లాడుతూ... ఏపీ ప్రజలు, ముఖ్యమంత్రి చంద్రబాబు కలలకు అనుగుణంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని... రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో లులూ గ్రూప్ అత్యాధునిక మాల్స్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోందని అలీ చెప్పారు.

## రాష్ట్ర భవిష్యత్‌కు తలమానికంగా భాగస్వామ్యసదస్సు

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



విశాఖపట్నం (చైతన్యరథం): వికసిత్ భారత్ విజన్ అనుగుణంగా ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విశాఖలో భాగస్వామ్య సదస్సుకు ముందు రోజే రూ.3.65 లక్షల కోట్లు పెట్టుబడులు వెల్లువలా వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణ, చిరస్థాయి ముద్రకు విశాఖ సదస్సు వేదికగా నిలిచిందన్నారు. ప్రోత్సాహకాలు, వేగంగా అనుమతులు ఇవ్వటంలో ఏపీకి పోటీ లేదు. దేశ ఆర్థిక ప్రగతికి విశాఖ దిక్సూచిగా మారబోతుంది. వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి రావడం శుభపరిణామం. కోరమండల్ సంస్థ రాష్ట్రంలో ఎరువుల తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు చేయనుండటం సంతోషకరం. భాగస్వామ్య సదస్సు ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటుకు అవకాశం ఉంటుంది దేశ, విదేశీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ లోపెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

## మున్సిపల్ శాఖలో భారీగా పెట్టుబడులు

- **మంత్రి నారాయణ సమక్షంలో ఎంవోయూలు చేసుకున్న 25 సంస్థలు**
- **ఇప్పటికే సీఎం చంద్రబాబు సమక్షంలో సీఆర్డీయేతో ఎంఓయూలు చేసుకున్న 7 కంపెనీలు**



విశాఖపట్నం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోతే....ఇప్పుడు ఏపీ వైపు క్యూ కడుతున్నారని అన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారాయణ సమక్షంలో మున్సిపల్ శాఖలో పెట్టుబడులకు పలు సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. పెట్టుబడుల సదస్సుకు ఒక్క రోజు ముందే గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఏపీ సీఆర్డీఏ పరిధిలో పెట్టుబడులు పెట్టేందుకు 7 కంపెనీలతో ఎంఓయూలు జరిగాయి. ఇక భాగస్వామ్య సదస్సు మొదటిరోజున శుక్రవారం మంత్రి నారాయణ సమక్షంలో 25 సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. సీఆర్డీయే లో పెట్టుబడులు పెట్టేందుకు 18 సంస్థలతో ఒప్పందాలు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు 6 సంస్థలు, మున్సిపల్ శాఖ డైరెక్టరేట్ నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ఒక సంస్థ ఎంఓయూ చేసుకుంది. ఇప్పటివరకూ మున్సిపల్ శాఖ లో 32 ఒప్పందాలు జరిగాయి.

సీఆర్డీఏలో రూ.36,648 కోట్లు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌లో రూ.1680 కోట్లు, మున్సిపల్ శాఖ డైరెక్టరేట్ నుంచి రూ.1800 కోట్ల పెట్టుబడులకు ఈ ఎంఓయూలు జరిగాయి. వీటిలో కన్‌స్ట్రక్షన్, టూరిజం, స్పోర్ట్స్, విద్యా సంస్థలు వంటివి ఉన్నాయి. ఆయా పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా,పరోక్షంగా 1,57,510 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ తేజ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నమ్మకమైన భాగస్వామిగా ఏపీ

**- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**



విశాఖపట్నం (చైతన్యరథం): వన్ మిషన్, వన్ విజన్ అనే విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. విశాఖలో శుక్రవారం మొదలైన సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుతో పాటు... అతిపెద్ద మార్కెట్‌కు పారిశ్రామికవేత్తలను, కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తోందన్నారు. వివిధ రంగాల్లోని పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన భాగస్వామిగా గుర్తింపు నిలుస్తోందన్నారు. అగ్రికల్చర్ నుంచి ఏరో స్పేస్ వరకూ వివిధ రంగాల్లో పెట్టుబడులు, యూనిట్లు ఏపీ వస్తున్నాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు.

### విజనరీ లీడర్ల నేతృత్వంలో

## అభివృద్ధి వెలుగులు

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



విశాఖపట్నం (చైతన్యరథం):ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వంటి విజనరీ లీడర్ల నేతృత్వంలో భారత దేశం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖలో శుక్రవారం మొదలైన సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఏపీలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం అవుతున్నాయి. ప్రస్తుతం 7 ఆపరేషన్ ఎయిర్ పోర్టులు ఉంటే కొత్తగా మరో 7 ఎయిర్ పోర్టులు నిర్మిస్తాం. ఏరోస్పేస్, ఎయిర్ క్రాఫ్ట్ తయారీని కూడా ఏపీకి తీసుకువస్తామని రామ్మోహన్ నాయుడు చెప్పారు.

## సీబీఎన్ బ్రాండ్‌తో ఏపీలో ప్రగతి పరుగులు

**- మంత్రి టీజీ భరత్**



విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీలో సీబీఎన్ బ్రాండ్‌తో ప్రగతి పరుగులు పెడుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. విశాఖలో శుక్రవారం మొదలైన సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలిరోజు కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పెట్టుబడులకు ఎవరు ముందుకొచ్చినా మద్దతుగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. 550 పారిశ్రామిక పార్కులు ఏపీలో పెట్టుబడుల కోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇది ఏపీ పారిశ్రామిక దశాబ్దంగా మంత్రి భరత్ అభివర్ణించారు.

### పరకామణి చోరీ ఫిర్యాదుదారుడు

# సతీష్ అనుమానాస్పద మృతి

తిరుమల (చైతన్యరథం): తిరుమలలో పరకామణి చోరీకి సంబంధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి రైల్వే ట్రాక్‌పై శుక్రవారం ఆయన మృతదేహం కనిపించింది. పరకామణి కేసులో విదేశీ డాలర్లను దొంగతనం చేసిన రవికుమార్‌పై అప్పట్లో పోలీసులకు ఏవీఎస్వో సతీష్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరచగా అప్పట్లో రాజకీయ నాయకులు, టీటీడీ ఉన్నతాధికారులు, పోలీసుల ఒత్తిడితో ఆ కేసును లోక్ అదాలత్‌లో సతీష్ కుమార్ రాజీ చేసుకున్నారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. హై కోర్టు ఆదేశాలతో ఈ కేసుపై సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ బృందం ప్రస్తుతం దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తు కీలక దశకు చేరుకుంటున్న సమయంలో.. కేసు రాజీ చేసుకున్న సతీష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. ఈ కేసులో సూత్రధారులే అతడిని

**రైల్వేట్రాక్‌పై మృత దేహం - హత్యగా అనుమానాలు**

హతమార్చి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సతీశ్ కుమార్ ప్రస్తుతం గుంతకల్లులో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్వస్థలం కర్నూలు జిల్లా పత్తికొండ. హుండీ సొమ్ము లెక్కింపు సమయంలో సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ చోరీ చేస్తుండగా విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న సతీష్ పట్టుకున్నారు. 2023 ఏప్రిల్లో రవిపై సతీష్ ఫిర్యాదు చేశారు. 2023 మే 30న రవికుమార్‌పై విజిలెన్స్ అధికారులు ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. కేసు నుంచి తప్పిస్తే తన ఆస్తులు టీటీడీకి ఇస్తానని రవికుమార్ ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనతో అతడి ఆస్తులపై వైసీపీ నేతలు కన్నేశారు. ఈ క్రమంలో రవికి చెందిన కొన్ని ఆస్తులు విరాళంగా తీసుకుంటున్నట్లు టీటీడీ బోర్డు తీర్మానించింది. 2023 సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్‌లో కేసును వైసీపీ నేతలు రాజీ చేయించారు. ఈ క్రమంలో రవికుమార్‌కు చెందిన ఆస్తులను వైసీపీ నేతలు రాయించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కూటమి సర్కారు వచ్చాక



పరకామణి వ్యవహారం మళ్లీ వెలుగులోకి వచ్చింది. 2024 సెప్టెంబర్ నుంచి రవికుమార్ కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది.

### కీలకమైన కేసుల్లో సాక్షులను..

# చంపేసిన చరిత్ర వైసీపీ దొంగల ముఠాది

- **పరకామణి చోరీ కేసులో కీలక సాక్షి సతీష్ కుమార్‌ది ముమ్మాటికీ హత్యే**
- **టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పాత్రపై అనుమానాలు**
- **వాస్తవాలు బయటపడతాయనే హతమార్చారు**
- **వైఎస్ వివేకా హత్యని గుండెపోటు అని చెప్పినట్టే.. సతీష్ కుమార్‌ది ఆత్మహత్య అంటూ కరుణాకర్ రెడ్డి నంగనాచి డ్రామాలు**
- **మీడియా సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**



విజయవాడ (చైతన్యరథం): టీటీడీ పరకామణిలో రవికుమార్ అనే ఉద్యోగి దొంగతనం చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏవీఎస్వో. సతీష్ కుమార్ శుక్రవారం తాడిపత్రి సమీపంలోని రైలు పట్టాలపై విగత జీవిగా పడివున్నాడని, దీని వెనక టీటీడీ మాజీ ఛైర్మన్లు వై.వి.సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డిల దొంగల ముఠా వుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు.

టీటీడీ పరకామణి చోరీ కేసులో కీలక సాక్షి సతీష్ కుమార్ అనుమానాస్పద మృతిపై కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శుక్రవారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ గుంతకల్లు నుంచి తిరుపతిలోని సిట్ కార్యాలయానికి విచారణ నిమిత్తం బయలుదేరిన సతీష్ కుమార్ తాడిపత్రి సమీపంలోని రైలు పట్టాలపై విగత జీవిగా పడివున్నాడని, ఇది ముమ్మాటికీ హత్యేనని, ఆత్మహత్య కాదన్నారు.

సిట్ విచారణలో సతీష్ కుమార్ వాస్తవాలు వెల్లడిస్తే ఎక్కడ తమకి ఉచ్చు బిగుస్తుందోననే భయంతో టీటీడీ మాజీ ఛైర్మన్లు వై.వి.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిల దొంగల ముఠా చేత అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యాడని ఆరోపించారు. మండిపడ్డారు. అప్పటి పరకామణి చోరీ అంశంలో కీలకపాత్ర పోషించినటువంటి వ్యక్తులు వై.వి.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డేనని, వీరిద్దరూ వున్న సమయంలోనే ఈ చోరీ ఉదంతం బయటపడటం, తర్వాత లోక్ అదాలత్‌లో రాజీ కుదిర్చారని స్పష్టం చేశారు. వై.వి సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్ గా వున్నప్పుడు 2023 జూన్ 19వ తేదీన నిందితుడి రవికుమార్ కి సంబంధించిన కొన్ని ఆస్తులు టీటీడీకి ఇస్తున్నట్లు తీర్మానం చేశారు.

ఆగస్టు 2023లో భూమన కరుణాకర్ టీటీడీ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న నెలరోజుల్లోనే సెప్టెంబర్ నెలలో లోక్ అదాలత్‌లో రాజీ కుదిర్చి నిందితుడు రవికుమార్, సతీష్ కుమార్‌లతో సంతకాలు చేయించారని, ప్రత్యేకంగా సతీష్ కుమార్‌పై ఒత్తిడి తీసుకువచ్చి బలవంతంగా లోక్ అదాలత్ లో రాజీ చేయించారన్నారు. దీనిపై విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎమ్.గిరిధర్ రావు 25-07-2024 తేదీన నివేదిక ఇచ్చారన్నారు.

పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి సొంత బాబాయి వై.ఎస్.వివేకానంద రెడ్డి గొడ్డలి పోటుతో కిరాతకంగా హత్యకు గురైతే దాన్ని గుండె పోటుగా మార్చి ప్రజలను, చట్టాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారని, వైసీపీ నాయకులంతా పెద్ద ఎత్తున డ్రామాలు ఆడారని పట్టాభిరామ్ గుర్తుచేశారు. నేడు కూడా అదే విధంగా సతీష్ కుమార్ ఎసిట్ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడంటూ మీడియా ముందుకు వచ్చి భూమన కరుణాకర్ రెడ్డి నంగనాచి డ్రామాలు ఆడుతున్నాడని, అసలు భూమన కరుణాకర రెడ్డి ఇది ఆత్మహత్యే అంటూ ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు.


నిజంగా సిట్ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వుంటే గతంలో నిర్భయంగా సిట్ ముందుకు హాజరై కీలక విషయాలు ఎలా వెల్లడిస్తాడని, ఇదంతా కేవలం ప్రజలను, చట్టాన్ని దారి మళ్లించటానికి కరుణాకర్ రెడ్డి ఆడుతున్న నాటకాలని, దీన్ని ఎవరు నమ్మే పరిస్థితి లేదన్నారు. గతంలో పరిటాల రవి హత్య కేసులో కీలక సాక్షిగా వున్నటువంటి మొద్దు శీను, పట్టోళ్ల గోవర్ధన్, అలాగే వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక సాక్షి అయినటువంటి, కసుమూరి శ్రీనివాస్ రెడ్డి, డ్రైవర్ నారాయణ, ఈసీ గంగిరెడ్డి, గంగాధర్ రెడ్డిలను హత్య చేసిన చరిత్ర వైసీపీకి వుందన్నారు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం సతీష్ కుమార్ ముఖం పై, శరీరం భాగాలపై రాళ్లతో కొట్టినట్లు ఆనవాలు వున్నాయని, పోలీసుల పోస్టుమార్టం అనంతరం మరిన్నీ వాస్తవాలు బయటపడతాయని అన్నారు.. పోలీసులు దీన్ని హత్య కోణంలో విచారణ చేయాలని కోరారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంలో ఆధారాలతో సహా వాస్తవాలు బట్టబయలు అయినట్లు సతీష్ కుమార్ హత్య విషయంలో కూడా వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

ఒక పాపాన్ని కప్పి పుచ్చుకోవటానికి మరికొన్ని పాపాలు చేస్తూ ముందుకు వెళుతున్నారని , ఇప్పుడు ఆ పాపాలు పండాయని ఈ నర రూపరాక్షసులకీ తప్పకుండా శిక్ష పడుతుందని, వైసీపీ నాయకులు ఎన్ని డ్రామాలు ఆడిన ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పట్టాభిరామ్ తేల్చి చెప్పారు.

## సతీష్‌ది ముమ్మాటికీ హత్యే

**- ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ**



అమరావతి (చైతన్యరథం): పరకామణి చోరీ కేసులో నిజాలు బయటపడకుండా చేయడానికి టీటీడీ మాజీ విజిలెన్స్ ఏవీఎస్ఓ సతీష్ కుమార్‌ను ఈ కేసులో కీలకవ్యక్తులు హతమార్చి ఉంటారని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అనుమానం వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదు. ముమ్మాటికీ వైసీపీ చేసిన హత్యే. ఆయన నోరు తెరిస్తే వాస్తవాలు బయటపడుతాయనే భయంతో హతమార్చారు. వైసీపీ పాలనలో నేరాలకు పాల్పడిన వారిని, కేసుల్లో కీలకపాత్ర పోషించిన వారిని వరుసగా చంపేయడం కొత్త విషయం కాదు. గతంలో కూడా పరిటాల రవి, వివేక హత్య కేసుల్లోనూ ఇదే తరహా సంఘటనలు జరిగాయి. ఇప్పుడు పరకామణి కేసులో కూడా అదే పద్ధతి స్పష్టంగా కనిపిస్తోంది. ఈ దోపిడీపై ఫిర్యాదు చేసిన టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌ను బెదిరించడం, తర్వాత అనుమానాస్పద స్థితిలో సతీష్ కుమార్ మరణించడం, వైసీపీ నేతల ప్రమేయాన్ని మరింత స్పష్టంగా చూపుతోంది. నిజాలను పాతిపెట్టి, నేరాలను దాచేందుకు వైసీపీ నేతలు చేస్తున్న పన్నాగమిది. ఈ మొత్తం స్క్రిప్ట్ తాడేపల్లి ప్యాలెస్‌లోనే సిద్ధమైందని ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోంది. ఘటన జరిగిన వెంటనే తామేమీ తెలియనట్టుగా, తామే సుద్దపూసలమన్నట్టు కొందరు వైసీపీ నేతలు ప్రెస్ మీట్లు పెట్టడం ఇందుకు నిదర్శనం. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం నిష్పక్షపాత దర్యాప్తు చేస్తుంది. పరకామణి దొంగలను పట్టుకోవడంతో పాటు.. నేడు సతీష్ కుమార్ హత్యకు కారకులకు కఠినమైన శిక్ష విధించాలని జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు.

## సతీష్ మృతిపై పలు అనుమానాలు

**- బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్**



అమరావతి (చైతన్యరథం): పరకామణి కేసులో ఫిర్యాదుదారు సతీష్ మృతిపై రాష్ట్ర బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పరకామణి కేసులో సూత్రధారులపై విచారణ జరపాలని సీఐడీని టీడీపీ బృందం డిమాండ్ చేసిన రెండో రోజే ఫిర్యాదుదారు సతీష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం వెనుక ఎవరి పాత్ర ఉందో తేల్చాలన్నారు. సతీష్ కుమార్ మృతి పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పరకామణి చోరీ, నెయ్యి కల్తీ కేసుల్లో సూత్రధారులందరూ ఒకే ముఠాకు చెందినవారేనన్నారు. ఈ నేపథ్యంలో సిట్ దర్యాప్తు ప్రారంభ దశలో ఉండగానే ఫిర్యాదుదారుడు మృతి చెందడం అనుమానాలు కలిగిస్తోందన్నారు. ఈ కేసులో ఎన్ని పెద్ద తలకాయలు సిట్ దర్యాప్తులో బయటపడతాయో చూడాల్సి ఉందన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో..

# రూ.20 కోట్లతో 19 ఆలయాల అభివృద్ధి



అమరావతి (చైతన్యరథం): దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.20 కోట్లతో పిఠాపురం నియోజకవర్గంలో 19 ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని శక్తిపీఠం శ్రీపురుహూతిక అమ్మవారు, శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయాలు, శ్రీపాద శ్రీవల్లభపీఠం కొలువై ఉన్నాయి.. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికను వేగంగా ముందుకు తీసుకువెళ్లాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. శుక్రవారం పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులతో పవన్ సమీక్ష నిర్వహించారు. ప్రఖ్యాత ఆలయాలతోపాటు నియోజకవర్గంలో జీర్ణావస్థకు చేరిన ఆలయాలను ఇప్పటికే గుర్తించామని, వాటికి పునరుజ్జీవం కల్పించే పనులకు అవసరమైన నిధులు దేవాదాయ శాఖ సమకూరుస్తుందని పవన్ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఆలయాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. ప్రధాన ఆలయాలైన శ్రీపురుహూతిక అమ్మవారు, శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీపాద శ్రీవల్లభస్వామి ఆలయాలతోపాటు 19 ఆలయాల అభివృద్ధి నిమిత్తం కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేసేందుకు ఇప్పటికే దేవాదాయ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించిందని, మ్యాచింగ్ గ్రాంట్‌తో నిధులు మంజూరు చేస్తారన్నారు.

# విశాఖపట్నం సీఐఐ సమ్మిట్‌కు అద్భుత స్పందన

**- మంత్రి కందుల దుర్గేష్ హర్షం**

**- టూరిజం స్టాల్‌ను ప్రారంభించిన మంత్రి**



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ సీఐఐ సమ్మిట్‌కు అద్భుత స్పందన వచ్చిందని, కూటమి ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో దాదాపు 70కి పైగా దేశాల నుండి ప్రతినిధులు వచ్చారని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ వెల్లడించారు. సీఐఐ సమ్మిట్ సక్సెస్ పై హర్షం వ్యక్తం చేశారు. సీఐఐ సదస్సు ద్వారా విశాఖ, అమరావతి, తిరుపతిలో పర్యాటక రంగంలో పెట్టుబడులు రానున్నాయని, పర్యాటక రంగంలో దాదాపు 100 అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామని వెల్లడించారు. సీఐఐ సమ్మిట్ లో భాగంగా టూరిజం స్టాల్‌ను మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం సందర్శించి ప్రారంభించారు. మంత్రి దుర్గేష్ కి టూరిజం స్టాళ్ల వివరాలను స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి, టూరిజం అధికారులు వివరించారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఏయే పర్యాటక ప్రాంతాలున్నాయో తెలుసుకునేలా టచ్ క్యూయోస్క్ మెషిన్ ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. టెక్నాలజీ ద్వారా పర్యాటకులకు అరకు, గండికోట తదితర పర్యాటక గమ్యస్థానాల అనుభవాలను, సాహస పర్యాటక అనుభవాలను అందించే మెషిన్ ను ప్రారంభించారు. లేపాక్షి హస్త కళలు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఏపీ క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఖాదీ వస్త్రాలను పరిశీలించి తయారీ విధానం తెలుసుకున్నారు. అరకు కాఫీని రుచి చూసి అద్భుతంగా ఉందని ప్రశంసించారు. అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా ప్రమోషన్స్ కల్పిస్తున్నామని వెల్లడించారు. బీన్ బోర్డు నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఇండియన్ ఫస్ట్ రోబోటిక్ కేఫ్ ను పరిశీలించి, రోబో పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ట్రీ టూ బార్ చాక్లెట్, ఇంటర్నేషనల్ చాక్లెట్ సెలూన్, కోకోనట్ కేఫ్ సందర్శించి కొబ్బరితో తయారైన సంబంధిత తిను బండారాలను టేస్ట్ చేసారు. మంగళగిరి, పెడన, వెంకటగిరి, ఉప్పాడ, ధర్మవరం, చీరాల తదితర 34 చేనేత వస్త్రాలను పొందుపరిచిన స్టాల్ సందర్శించారు.

విభిన్న పర్యాటక ప్రక్రియలను పరిచయం చేస్తూ అన్ని పర్యాటక విభాగాలను సద్వినియోగం చేసుకుంటున్నామని, అన్ని వర్గాల వారికి అందుబాటులో పర్యాటకం ఉంటుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటక రంగం బాగుంటే ఆర్థిక పురోభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి జరుగుతుందన్నారు.

కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్టును త్వరలోనే అందుబాటులో తీసుకొస్తామని, దేశంలోనే అతి పొడవైన గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. గత ప్రభుత్వం పర్యాటక రంగాన్ని కుదేలు చేస్తే తాము తిరిగి పునరుద్ధరిస్తున్నామన్నారు.

**వేలకోట్ల పెట్టుబడులు**

విశాఖ సీఐఐ సమ్మిట్ పర్యాటక రంగానికి వేలాది కోట్ల పెట్టుబడులు తీసుకొస్తుందని ఆశిస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. గత ప్రభుత్వ తీరుతో నమ్మకం కోల్పోయిన పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాతో పునరుత్తేజం వచ్చిందని,. నూతన పర్యాటక పాలసీపై ఇన్వెస్టర్స్ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. త్వరలోనే పర్యాటక రంగం మరింత పురోభివృద్ధి సాధిస్తుందని భావిస్తున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర పర్యాటక రంగానికి కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల ప్రత్యేక శ్రద్ధతో భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. గడిచిన 15 నెలల కాలంలో పర్యాటక రంగంలో దాదాపు 12 వేల కోట్లు పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడించారు.

సమ్మిట్‌లో భాగంగా కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస్ వర్మలతో పాటు, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్, సహచర మంత్రులైన నాదెండ్ల మనోహర్, అనిత, సవిత, సంధ్యారాణి, భరత్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులను మంత్రి దుర్గేష్, కలిశారు.

# ఎవరిది క్రెడిట్? ఎవరిది చౌర్యం!!

**- అబద్ధాలతో సమర్థుల క్రెడిట్ కొల్లగొట్టడం సాధ్యమా?**

**- జగన్‌రెడ్డి విధ్వంస ప్రతాపాలు జనానికి తెలీంది కాదు**

ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని మభ్యపెట్టడంలో, అబద్ధాలను వందసార్లు చెప్పి నిజం చేయడంలో జగన్‌రెడ్డికి ఉన్న నైపుణ్యాన్ని దేశం మొత్తం చూస్తోంది. 2014-19లో సీఎం చంద్రబాబు దూరదృష్టి, పారదర్శక పాలనతో ప్రపంచస్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించారు. గూగుల్, మిట్టల్, టీసీఎస్, కియా, రిలయన్స్, అదాని, జీఎంఆర్, బ్రూక్‌ఫీల్డ్, రెన్యూ, లులూ.. ఇన్ని కంపెనీలు ఏవీ యాదృచ్ఛికంగా రాలేదు. ఇవన్నీ చంద్రబాబుపై నమ్మకంతో.. ఆయన నాయకత్వాన్ని విశ్వసించి వచ్చిన పెట్టుబడులే. కానీ 2019లో జగన్ వచ్చాక.. పూర్తిగా విధ్వంసం మొదలైంది. పరిశ్రమలకు మద్దతులేకుండా, హింసాత్మక పాలనతో, రౌడీ రాజకీయంపెంచి పెట్టుబడిదారులను జగన్మోహన్‌రెడ్డి గ్యాంగ్ భయపెట్టారు. రాష్ట్రంనుంచి పారిశ్రామికవేత్తలు వెళ్లిపోవడం జగన్ పాలనకు అసలు సర్టిఫికేట్. నిరుద్యోగిత 24 శాతానికి ఎగబాకడం కూడా జగన్ వైఫల్యానికి కిరీటం. అంతా నాశనం చేసిన తర్వాత, ఎన్నికలు దగ్గరపడుతుంటే ఒక్కసారిగా "గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్" అంటూ జాతీయస్థాయి నాటకం ప్రదర్శించాడు. చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న కంపెనీలతోనే మరలా ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. అదాని, బ్రూక్ ఫీల్డ్, జీఎంఆర్ గ్రూప్స్, రెన్యూ ఇవన్నీ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఒప్పందాలే. వాటికితోడు సదస్సును చూడడానికి వచ్చిన వారికి, ఐప్యాక్ సభ్యులకు సూటు బూటు వేసి పారిశ్రామికవేత్తలుగా చిత్రీకరించి బూటకపు ఒప్పందాలను కుదుర్చుకున్నాడు. అదాని డేటా సెంటర్ శంకుస్థాపనను 2019 జనవరి 12న చంద్రబాబే చేశారు. ప్రాజెక్టును తెచ్చింది టీడీపీ ప్రభుత్వం. కానీ అదే కంపెనీతో మళ్లీ ఎంవోయూ కుదుర్చుకొని "నేనే తెచ్చాను" అని ప్రకటించుకోవడం జగన్‌రెడ్డి చేసిన అసలు క్రెడిట్ చోరీకి నిదర్శనం! రెన్యూ కూడా చంద్రబాబు హయాంలోనే రాష్ట్రానికి వచ్చింది. దీనిని 2019 జూలై 19న అసెంబ్లీలో జగనే ఒప్పుకున్నాడు. ఇప్పుడు మాత్రం "రెన్యూ మా కాలంలో వచ్చింది, చంద్రబాబు మా క్రెడిట్ దొంగిలిస్తున్నారు" అని సాక్షి ద్వారా విషం చిమ్మించడం వైసీపీ అబద్ధాలకు మరో నిలువెత్తు నిదర్శనం. "కూటమి ప్రభుత్వం మా క్రెడిట్ కొట్టేస్తోంది" అని ఫిర్యాదు చేస్తున్న జగన్‌రెడ్డే, చంద్రబాబు కృషితో వచ్చిన అదాని, రెన్యూ, జీఎంఆర్, బ్రూక్‌ఫీల్డ్‌వంటి కంపెనీలను తన పేరుతో బ్రాండింగ్ చేసుకున్నాడు.

**జగన్ డీఎన్ఏలోనే క్రెడిట్ చోరీ లక్షణం**

వైఎస్ కుటుంబానికి క్రెడిట్ చౌర్యం కొత్తేమీ కాదు. గతంలోనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో చంద్రబాబు నిలిపారు. హైటెక్ సిటీ నిర్మాణం మొదలుగొని ఓఆర్ఆర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంచుట్టి ఉమ్మడి ఏపీ అభివృద్ధికి చంద్రబాబు నాంది పలికితే.. నాడు వైఎస్ఆర్ క్రెడిట్ చోరీకి పాల్పడ్డారు. కానీ ప్రపంచం మొత్తం చూసింది హైదరాబాద్ ఎలా అభివృద్ధి అయిందో.. ఎవరు అభివృద్ధి చేశారో! వైఎస్ఆర్ బాటలోనే జగన్‌రెడ్డి కూడా పయనించాడు. చంద్రబాబు క్రెడిట్‌ని చోరీ చేసేందుకు నాడు తండ్రి.. నేడు కొడుకు ప్రయత్నిస్తున్నారు. 2014-19మధ్య నవ్యాంధ్రప్రదేశ్‌కు ఒక దిక్సూచిలా చంద్రబాబు నిలిచారు. ఎన్నో అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పోలవరాన్ని 70శాతం పూర్తి చేశారు. 12 లక్షల ఇళ్లను పూర్తిచేసి, పేదలకు అందించారు. ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకొచ్చి గ్లోబల్ దృష్టిని ఆకర్షించారు. అనూహ్యంగా 2019లో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని ఆపేశాడు. పేదలకు ఇళ్లు లేకుండా చేశాడు. రైతుల పొలాలకు నీరు రాకుండా అడ్డుకున్నాడు. పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురి చేశాడు. పారిశ్రామికవేత్తలను తరిమేశాడు. ఎన్నికల సమీపించడంతో విశాఖలో సీఐఐ సమ్మిట్‌కు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ అంటూ పేరుపెట్టి చంద్రబాబు తీసుకొచ్చిన కంపెనీలతోనే మరలా ఒప్పందాలు కుదుర్చుకొని జగన్నాటకాలు ఆడాడు. ఇది కదా అసలైన క్రెడిట్ చోరీ అంటే! దీనిని కదా డ్రామాలనేది!! నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు, లోకేష్ ఒక భరోసాను కల్పించారు. ఫ్రెండ్లీ విధానాన్ని అమలుచేసి సింగిల్ విండో ద్వారా అన్ని అనుమతులను వేగంగా ఇవ్వడంతో పరిశ్రమలు రాష్ట్రానికి క్యూ కట్టాయి. దేశంలోనే ఏ రాష్ట్రమూ తీసుకురాలేని విధంగా పాలసీలకు రూపకల్పన చేసి పరిశ్రమల ఆకర్షణలో రాష్ట్రాన్ని ముందుంచిన దార్శనికులు చంద్రబాబు, లోకేష్.

**జగన్ దగ్గరనుండి ఏ క్రెడిట్ చోరీ చేయాలి?**

ఉన్న పరిశ్రమలను తరిమేయడమా? ల్యాండ్, శాండ్, మైన్, వైన్ చోరీకి కేరాఫ్‌గా జగన్ నిలిచాడు. ఆ క్రెడిట్ చోరీచేయాలా? చెల్లికి రావాల్సిన వాటాను కూడా జగన్‌రెడ్డి చోరీ చేశాడు. అసలు నిజంగా జగన్‌రెడ్డే పరిశ్రమలను తెచ్చివుంటే రాష్ట్రంలో 24శాతం నిరుద్యోగిత రేటు ఎందుకుంటుంది? నిరుద్యోగిత రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో ఏపీ ఎందుకుంది? తన చోరీ లక్షణాల్ని చంద్రబాబుకు అంటగట్టి, చెప్పిన అబద్ధాన్నే వందసార్లు చెప్పడం జగన్‌రెడ్డి నైజం. పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అనేది బహిరంగ సత్యం. సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా అది మరోసారి నిరూపితమైంది. ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల్లోనే ఇన్ని లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడం అది కేవలం చంద్రబాబు పట్టుదల, నారా లోకేష్ కృషి వలనే సాధ్యమైంది. ఆంధ్రప్రదేశ్ మరోసారి విశాఖ వేదికగా గ్లోబల్ దృష్టిని ఆకర్షించింది. వైసీపీ విధ్వంసకర విధానాలకుగురై రాష్ట్రం విడిచి వెళ్ళిన కంపెనీలు తిరిగి రాష్ట్రానికి రావడం శుభపరిణామం!

## అట్టహాసంగా ప్రారంభమైన సీఐఐ సదస్సు... హాజరైన ప్రముఖులు




విశాఖపట్నం (చైతన్యరథం): 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు సదస్సును ప్రారంభించారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారు. మంత్రి నారా లోకేశ్, సీఎస్ విజయానంద్, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమానీ, సీఐఐ డైరెక్టర్ చంద్రజిత్ బెనర్జీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదానీ పోర్ట్స్, సెజ్ ఎండీ కరణ్ అదానీ, యూసఫ్ అలీ, బాబా కల్యాణి తదితర దిగ్గజ పారిశ్రామికవేత్తలు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సదస్సుకు తరలి వచ్చారు. దేశాభివృద్ధిలో ఏపీది కీలకపాత్రని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఏపీ అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటివాటిని పారిశ్రామికత్తలు వినియోగించుకోవాలని సీఐఐ వేదికగా ఆయన పిలుపునిచ్చారు. భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె. ఎల్ల విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్రసంగించారు.

**హాజరైన ప్రముఖులు**

'ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ భారత్ ముందుకువెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో స్వయం ప్రతిపత్తి సాధించేలా దేశం ముందడుగు వేస్తోంది. భాగస్వామ్యం, ఆవిష్కరణలు, విలువ ఆధారిత ఉత్పత్తులతోనే ఆత్మనిర్భర్ భారత్ ఆవిష్కృతం అవుతుంది. కోవిడ్ లాంటి విపత్తు వచ్చినప్పుడు ప్రపంచానికి వాక్సిన్ అందించగలిగిన దేశంగా భారత్ అవతరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు జీనోమ్ వ్యాలీ లాంటి ఎకోసిస్టమ్‌ను తయారు చేశారు. అదే జీనోమ్ వ్యాలీలో భారత్ బయోటెక్ కోవిడ్‌కు వ్యాక్సీన్ తయారు చేసి అందించింది.' అని సీఐఐ, ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె.ఎల్ల వెల్లడించారు.

అన్న క్యాంటీన్లకు రూ.కోటి విరాళం: ప్రముఖ ఫర్నిచర్ సంస్థ బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ఛైర్మన్ ఎన్‌కే అగర్వాల్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కలప ఆధారిత ఇంజినీర్డ్ ప్యానెల్ తయారీ యూనిట్ ఏర్పాటుపై చర్చించారు. అనంతరం అన్న క్యాంటీన్ల నిర్వహణకు కోటి రూపాయల విరాళాన్ని సీఎంకు అందించారు.

**సీబీఎన్‌బ్రాండ్ ప్రగతి పరుగులు**

'ఆంధ్రప్రదేశ్ కేవలం ఒక రాష్ట్రమే కాదు, దేశానికి ఓ గ్రోత్ ఇంజిన్ అని బజాజ్ ఫిన్ సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ కితాబిచ్చారు. వెయ్యి కిలోమీటర్ల తీరం కలిగిన ఏపీ వాణిజ్యం, సాంకేతికత, ఆవిష్కరణలకు గేట్‌వేగా ఉంటోందని ప్రశంసించారు. విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో యువతకు అండగా ఉండేలా రాహుల్ బజాజ్ స్కిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు స్పష్టమైన విధానాలు, దార్శనికత వల్ల ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టే ధైర్యం వచ్చిందని భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్, జేఎండీ- అమిత్ కల్యాణి అన్నారు. డిఫెన్స్‌తోపాటు, షిప్ బిల్డింగ్ రంగంలోనూ అదనపు పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. ఏపీలో సీబీఎన్ బ్రాండ్‌తో ప్రగతి పరుగులు పెడుతోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్రసంగించిన భరత్ పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు ముందుకొచ్చినా మద్దతుగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని హామీ ఇచ్చారు. 550 పారిశ్రామిక పార్కులు ఏపీలో పెట్టుబడుల కోసం సిద్ధంగా ఉన్నాయని, ఇది ఏపీ పారిశ్రామిక దశాబ్దమని భరత్ వ్యాఖ్యానించారు.

**ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం : ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోందన్నారు. సంపద సృష్టిస్తేనే ప్రపంచంలో పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఏపీలో సుపరిపాలన, అత్యుత్తమ విధానాలనే సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఆచరిస్తోందని తెలిపారు. అభివృద్ధికి – సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీని అభివృద్ధి చేయడానికి అంతే శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడానికి చంద్రబాబు.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి దేశాభివృద్ధి దోహదం చేస్తున్నాయని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకనామి ఇలా వేర్వేరు రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయని ఉపరాష్ట్రపతి వెల్లడించారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ప్రభుత్వ విప్..



కురుపాం (చైతన్యరథం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రజాదర్బార్ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతుల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 30వ సీసీఐ సదస్సులో జీసీసీ స్టాల్

● ప్రారంభించిన జీసీసీ సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో నిర్వహించిన 30వ సీఐఐ సదస్సులో గిరిజన సహకార సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గురువారం అధికారికంగా పరిచయం చేశారు. గిరిజనుల చేత తయారయ్యే ఆర్గానిక్, హ్యాండ్‌క్రాఫ్ట్, విలువాధారిత ఉత్పత్తులను సదస్సుకు విచ్చేసిన పరిశ్రమల ప్రతినిధులకు వివరిస్తూ జీసీసీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... "గిరిజనుల ఆర్థిక సాధికారత కోసం జీసీసీ అమలు చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం అత్యంత ప్రశంసనీయం" అని పేర్కొన్నారు. జీసీసీను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లడానికి అత్యధిక మద్దతు అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, గిరిజన ప్రాంతాల పురోగతికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చే ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, గిరిజన సంక్షేమం కోసం సమర్థవంతమైన మార్గదర్శకత అందిస్తున్న గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరిజన ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రోత్సాహం గిరిజనుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తోందని ఆయన అన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా ప్రమాణస్వీకారత్సోవం



నర్సీపట్నం (చైతన్యరథం): నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో వివిధ పదవులు పొందిన నాయకులందరితో శుక్రవారం ప్రమాణస్వీకారం మహోత్సవం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారులు నర్సీపట్నం నియోజకవర్గం యువ నాయకులు, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని నూతనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరినే అభినందించారు. పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బలరాజు



కొయ్యలగూడెం (చైతన్యరథం): కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొయ్యలగూడెం మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులందరూ తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరలు క్వింటాకు గ్రేడ్- రూ. 2389, కామన్- రూ.2369 పొందాలని సూచించారు. ధాన్యం విక్రయాల షెడ్యూల్ కోసం రైతులు 7337359375 వాట్సప్ నంబర్ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మద్దు బాల నాగేశ్వరరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి




గండేపల్లి (చైతన్యరథం): 'మన మిత్ర' ప్రచారంలో భాగంగా ప్రజా సమస్యలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని పెద్దాపురం డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి శ్యామల పేర్కొన్నారు. మండల కేంద్రమైన గండేపల్లిలో శుక్రవారం "ప్రజల చేతిలో ప్రభుత్వం" (వాట్సప్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రతి సమస్యకు త్వరితగతిన సమాధానం లభిస్తుందని చెప్పారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో గూగుల్ మీట్లో ఇంటి పన్నుపై రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.హరి కృష్ణ సత్యరెడ్డి, ఏవో చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో ఆర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పోలాకి మండలం, కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించడం జరిగిందని... ఈ ఆర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ప్రజాదర్బార్ స్వీకరించిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రజా సమస్యలు పరిష్కారించాలి

**●కొయ్యలగూడెంలో ప్రజాదర్బార్ నిర్వహించిన బొరగం శ్రీనివాసు**



పోలవరం (చైతన్యరథం): కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం మార్కెట్ యాడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాసులు తన నివాసం వద్ద "గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలను వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. ఊర చెరువుపై పనులు మరమ్మతులు చేపట్టాలని, సీసీ రోడ్డులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రావెల్ రోడ్డు, 11 కేవీ విద్యుత్ వైరు ఏర్పాటు... గవరవరంలో రెవిన్యూ సమస్య, కొయ్యలగూడెం పెన్షన్ సమస్యలు గురుంచి పలువురు అర్జీలు ఇచ్చారు. అశోక్‌నగర్‌కి చిందిన మానసిక వికలంగురాలు ఎస్‌కే. లీషాకి సదరంలో 90% మాత్రమే వైకల్యం ఉన్నట్లు సిర్టిఫికేట్ ఇచ్చారని మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మానసిక రోగి కావడంతో 100 శాతం వైకల్యం కలిగినట్లు సర్టిఫికేట్ ఇవ్వాలని కోరగా ఆ సమస్యను పరిష్కరించేందుకు అధికారులకు సూచించడం జరిగిందని బొరగం శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు మడకం కన్నపరాజు, పెండ్యాల రమాదేవి, నియోజకవర్గం పరిశీలకులు అనపర్తి వెంకట నారాయణ, పారెపల్లి రామారావు, బొబ్బర చిన్నరాజు, నిమ్మగడ్డ రవీంద్ర, పొట్ట రామారావు, జారం చాందిని, ఆకుల అరుణ, గవరవరం సొసైటీ అధ్యక్షులు దుగ్గిరాల బోస్, కన్నాపురం సొసైటీ అధ్యక్షులు వీర్రాజు, మంగిన కొండ, పారెపల్లి నరేష్, సత్యనారాయణ, చాపల చిన్నబాబు, ఎంపీటీసీ షేక్ బాజీ,తేజ, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది

**●ఆదర్శ దివ్యాంగుల ఆశ్రమం నందు ఉపకరణలు అందజేసిన ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం నామవరంలో ఉన్న ఆదర్శ దివ్యాంగుల ఆశ్రమం వార్షికోత్సవం సందర్భంగా జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారిచే దివ్యాంగులకు ఏర్పాటుచేసిన 3వీల్ చైర్స్, 5క్రాచ్చేస్, 5చేతి కర్రలు అర్హులైన వారికి ఎమ్మెల్యే గోరంట్ల అందజేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతుందని, అర్హులైన వారికి 6000 నుండి 15 వేల రూపాయల వరకు ప్రతినెల పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, వారి నైపుణ్యానికి తగ్గట్టుగా ఉద్యోగ కల్పన కల్పించే విధంగా రోజుల్లో ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులకు, బధిరులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారికి కూడా తగిన పరికరాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నిచ్చని కోళ్ల సత్తిబాబు, పెంకే కోటేశ్వరరావు, యర్ర ఉమా మహేశ్వరి, అంకం గంగరాజు, అవ్వ లక్ష్మి, వర్రె రవి, చిక్కాల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీకి కార్యకర్తలే బలం : జోగేశ్వరరావు




మండపేట (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని మండపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అధికారం ఉన్నా.. లేకున్నా అండగా నిలిచే కార్యకర్తలు మనకే సొంతమన్నారు. పార్టీ ఏర్పడినప్పటి నుండి గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీలు ఏర్పాటు చేసుకుంటున్నాం. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుచుకోవాలన్నారు. మండపేట టీడీపీ కార్యాలయంలో జరిగిన రాయవరం మండలం కస్టర్ల యూనిట్, గ్రామ బూత్ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవంలో వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా పార్టీ పదవులు పొందిన నాయకులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో రాయవరం మండలం టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి మాధవరావు మండల టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**●శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి నిర్వహించారు. ప్రజల సమస్యలు, వారి అర్జీల స్వీకరణ, సత్వర పరిష్కారం ఇవన్నీ సీఎం నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రీవెన్స్ డే లో భాగమని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ.... ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజల అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అనుసంధానం చేసి, వారికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు అన్ని ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పష్టం చేశారు. ఈ గ్రీవెన్స్ కు అవినీతి ఫిర్యాదులు, ట్రాన్స్‌ఫర్‌లు, పెన్షన్‌లు, పోలీస్ సమస్యలు, వస్తువుల పోగొట్టుకోవడం, అభివృద్ధి పనుల లోపాలు, రోడ్లు, డ్రైన్లు లేకపోవడం, శివారు ప్రాంతాల్లో దొంగతనాలు వంటి సమస్యలు తెలిపారు. వాటిలో చాలావరకు సత్వరమే పరిష్కరిస్తున్నామని, మిగతావాటిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ఉన్నామని చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, మారుమూల ప్రాంతాల వరకు కూడా రోడ్లు వేశామని, జిటి రోడ్ వంటి ప్రధాన రహదారుల విషయమై ఆర్ అండ్ బి శాఖ ఇప్పటికే అంచనాలు రూపొందించి, నిధుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. భారీ వాహనాల రాకపోకల వల్ల జేకేసి కాలేజి వంటి రోడ్లు ధ్వంసం అవుతున్నందున, వాటిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నామని, పోలీసులు, ఆర్టీవో అధికారులకి అవసరమైన దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేసే పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. మిగతా పెండింగ్ పనులన్నీ కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, అభివృద్ధిలో ముందుండేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. వారంలో నాలుగు రోజులు నియోజకవర్గ కార్యాలయం ప్రజల కోసం ఓపెన్‌గా ఉంటుందని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో అభివృద్ధి విప్లవం... సంక్షేమానికి ప్రాధాన్యం

**● రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయి... అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో అభివృద్ధి విప్లవం కొనసాగుతోందని, అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు నడుస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక కరిముల్లా నగర్ లో 1.17 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గుంతల రోడ్లు ఇకపై ఎక్కడా కనిపించని చెప్పారు. గత ప్రభుత్వంలో రోడ్డెక్కితే వాహనాలకు, ప్రయాణికులకు గాయాలయ్యేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని అన్నారు. కేవలం అభివృద్ధి మాత్రమే కాకుండా సంక్షేమాన్ని కూడా సమాన స్థాయిలో అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ మహా యజ్ఞంలో అధికార యంత్రాంగం సమన్వయంతోనే సహకారం అందిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఒకవైపు సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం వస్తోందని, లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోనూ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు తాము ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందడుగు వేస్తున్నామన్నారు. ఇప్పటికే జాబ్ మేళా వంటి కార్యక్రమాలు నిర్వహించి వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో మల్లెంపూడి శ్రీను, డివిజన్ అధ్యక్షులు బ్రహ్మసాని శ్రీనివాస్, ఏడుకొండలు, అబ్బాస్ అలీ, బాజీ, సరోజ,శ్రీకాంత్, గోపి, రహమతునిస, శ్రీను, సైదా, దుర్గ, శ్రీలక్ష్మి, బాషా తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా సీఐఐ

**● చంద్రబాబు, లోకేష్‌ల కృషి ఫలితమే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు : మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి**



పల్నాడు (చైతన్యరథం): ఏపీని పెట్టుబడులకు హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఎంతో వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నారని అందుకు నిరూపణగానే విశాఖ వేదికగా సీఐఐ సదస్సు నిలుస్తుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మలపాటి శ్రీధర్ వ్యాఖ్యానించారు. ఈ సదస్సు ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడటం మాత్రమే కాదు, ఏపీ గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకరించింది. పెట్టుబడులకు మరోసారి ఏపీని గమ్యస్థానంగా చంద్రబాబు నిలపుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 17 నెలల్లోనే రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. చంద్రబాబు, లోకేష్ కృషితో ఇప్పటివరకు రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పించాలనే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనలు, గ్లోబల్ రోడ్ షోలు, పెట్టుబడిదారులతో ప్రత్యక్ష చర్చలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. యువతకు అవకాశాలే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని అన్నారు. లోకేష్ శ్రమకు ఫలితంగా, విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల (రూ. 1.33 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టబోతోంది. విశాఖను గ్లోబల్ డిజిటల్ హబ్గా తీర్చిదిద్దడంలో ఈ పెట్టుబడి కీలక పాత్ర పోషించనుంది. 2014-19లో కూడా ఆంధ్రప్రదేశ్ను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చిన నాయకుడు చంద్రబాబేనని అధికార రికార్డులే చెబుతున్నాయనీ, అలాగే 2014-19 మధ్య రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీని ద్వారా 5.13 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని నాటి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అసెంబ్లీలో సాక్షిగా సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే అభివృద్ధి శకాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లే నాందిగా విశాఖలో జరుగనున్న ఈ సమ్మిట్ ఉండబోతుందన్నారు. 2019-24 మధ్య జగన్ రెడ్డి పాలనలో పెట్టుబడులు రాష్ట్రాన్ని పూర్తిగా వదిలి వెళ్లాయని, పరిశ్రమలకు వేధింపులు, అనిశ్చితి, పన్నుల హింస, రాజకీయ జోక్యంతో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం నుంచి పారిపోయాయన్నారు. రాష్ట్రాభివృద్ధిని పరిశ్రమలను తరిమేసిన నాయకుడిగా జగన్ చరిత్రహీనుడిగా నిలిచిపోతారని కొమ్మాలపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## లోకేశ్ విస్తృత ప్రచారమే ఎన్డీయే విజయంలో కీలక పాత్ర పోషించింది

● బీహార్ ఎన్నికల ప్రచారంలో లోకేశ్ అడుగుపెట్టినప్పుడే ఎన్డీయే విజయం ఖాయమైంది : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ విజయపరంపర కొనసాగుతుందని చెప్పడానికి బీహార్లో ఎన్డీయే కూటమి విజయమే నిదర్శనమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌లకే దక్కుతుందని ఆయన స్పష్టంచేశారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక (గ్రీవెన్స్)లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి... వాటి పరిష్కారంపై అధికార యంత్రాంగానికి సూచనలుచేసి, అర్జీదారులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల ఫలితాలు, విశాఖ సీఐఐ సమ్మిట్ నిర్వహణ, 22 ఏ (1) సీ సమస్య పరిష్కారం. 167 ఏ బైపాస్ అంశాలపై స్పందించారు. ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ లకే దక్కుతుందని, విశాఖ సీఐఐ సదస్సు ప్రారంభానికి ముందే వారిద్దరి సమక్షంలో 3.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు జరగడం వారిపై పారిశ్రామికవేత్తలకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. సదస్సు జరిగే రెండు రోజుల్లో రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారుతుందన్న ఆయన, రెన్యూ పవర్ ఛైర్మన్ సుమంత్ సిన్హా వ్యాఖ్యలే అందుకు నిదర్శనమన్నారు. పనిచేసే ప్రభుత్వం ఉంటే ప్రజలకు, రాష్ట్రానికి ఎలాంటి మేలు జరుగుతుందో చెప్పడానికి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌ల నాయకత్వమే నిదర్శనమన్నారు.

## టీడీపీ అనుబంధ కమిటీలచే ప్రమాణం చేయించిన వర్ల రామయ్య



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని గంగినేని కళ్యాణ మండపంలో నియోజకవర్గం పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ మరియు బూత్ స్థాయిల నూతన కమిటీల బాధ్యులు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నూతనంగా నియమితులైన బాధ్యులు పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కమిటీలపై ఉందని వారు దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణ, ఐక్యతతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని వారు సూచించారు. అనంతరం, వివిధ స్థాయిల నూతన బాధ్యులచేత అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నాలుగవ స్థానం : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారంలో గన్నవరం నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండాల్సిందని సాంకేతిక కారణాలతో నాలుగో స్థానానికి పరిమితం అయ్యిందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారంలో నియోజకవర్గంలోని అధికారులు సక్రమంగా పనిచేయడం వల్లే నాల్గవ స్థానం సాధ్యమైందని ఈ సందర్భంగా అధికారులను అభినందించారు. గన్నవరం నియోజకవర్గంలో మొదటిసారి నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో 1500 అర్జీలు రాగా, తదుపరి 450 అర్జీలు, శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 145 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఈవిధంగా ప్రజల నుంచి అర్జీలు తగ్గుతుండటాన్ని బట్టి చూస్తే సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉన్నట్లు భావించాలన్నారు. నిధులతో సంబంధం లేని అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తేనే గన్నవరం నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలన్నీ ఆన్ లైన్ చేస్తున్నామని, వీటిపై ప్రభుత్వం ఆడిట్ నిర్వహిస్తుందని ప్రతి అర్జీదారునికి ఫోన్ చేసి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందని యార్లగడ్డ కితాబిచ్చారు.

## విద్య, నైతికత, జాతీయతతో పిల్లలను తీర్చిదిద్దాలి : జీవీ



వినుకొండ (చైతన్యరథం): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినుకొండ పట్టణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని స్మరించుకున్నారు. చీఫ్‌విప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిల్లలపై నెహ్రూ మమకారం, ప్రేమాభిమానాలను స్మరించుకుంటూ జీవీ మాట్లాడారు. చాచా నెహ్రూ చూపిన దారి... పిల్లలను వెలుగులోకి తెచ్చే దారి" అని అన్నారు. "పిల్లలు ఏ దేశానికైనా నిజమైన సంపద. చాచా నెహ్రూ చూపిన ప్రేమ, మనసు, ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకం. దేశ భవిష్యత్తు, సమాజ అభివృద్ధి పిల్లల విద్య, ఆరోగ్యం, నైతిక విలువలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. "ప్రతి పిల్లవాడిలో ప్రతిభ ఉంది. ఆ ప్రతిభను వెలికి తీయడం కుటుంబం, ఉపాధ్యాయులు, ప్రభుత్వమంతా కలిసి చేపట్టవలసిన బాధ్యత. పిల్లలు చదువుల్లో, క్రీడల్లో, సృజనాత్మకతలో ముందుకు సాగాలంటే అందరం తోడ్పాటు అందించాలి."అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల అభివృద్ధికి అనువైన వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని జీవీ సూచించారు.

## విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

● మెరుగైన విద్యను అందించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి

●బాలల దినోత్సవ వేడుకల్లో దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా..



విజయవాడ (చైతన్యరథం): విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం బలోపేతం చేస్తుందని పశ్చిమ నియోజకవర్గంలో విద్యార్థులకు, మెరుగైన విద్యను అందించి వారిని ఉన్నత శిఖరాలను తీసుకెళ్లేలా ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారని ఏపీ దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా అన్నారు. సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భవానిపురం, సాయి అన్నా గార్డెన్స్‌లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, టీడీపీ సీనియర్ నాయకులు కోగంటి రామారావు,(పోరంకి)వికాస విద్యావనం ఫౌండర్ అండ్ వికాస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ పరిమి, మరియు డాక్టర్ పరిమి సందు, ఎన్టీఆర్ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా సుల్తానా బేగం, మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ లక్ష్మీ భార్గవి, అర్బన్ సీడీపీఓ జోత్స్న,పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తూ, చిన్నారులకు మెరుగైన విద్యను అందిస్తూ అంగన్వాడీ కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను బలోపేతం చేస్తూ వారికి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల నుంచి మెరుగైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరేలా చేయడం ఎమ్మెల్యే సుజనా ఉద్దేశమన్నారు. విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపడానికి స్వచ్ఛంద సంస్థలైన సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సుజనా చౌదరి ఏడాది క్రితం ప్రారంభించిన విజయ దీపం విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపుతుందన్నారు. పశ్చిమ ప్రజల కోసం ఉద్యోగమేళాల ద్వారా ఉపాధి కల్పన, ప్రజల ఆరోగ్యం కొరకు ఉచిత మెడికల్ క్యాంపులు సుజనా ఫౌండేషన్ ద్వారా పేదలందరికీ సహాయం అందిస్తూ ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా సేవా కార్యక్రమాలను చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో అన్ని రోడ్లు పూర్తి చేస్తాం

● జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం చేపడుతోందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాలను అభివృద్ధి కార్యక్రమాలను మీడియాకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## మైనారిటీలకు అండగా టీడీపీ : మహమ్మద్ నూర్



అమరావతి (చైతన్యరథం): నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం జయంతి పురస్కరించుకొని మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా... ఇచ్చిన మాట ప్రకారం మైనారిటీలకు ఇమామ్ మరియు మౌజన్లకు గౌరవ వేతనాలను కోసం రూ.90 కోట్లు రిలీజ్ చేస్తూ జీవో జారీ చేసిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నెరవేర్చి మైనారిటీల పక్షపాతి అని నిరూపించుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, రాష్ట్ర మంత్రి లోకేష్‌కి మైనారిటీల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ నూర్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ముస్లింలను అన్ని విధాలుగా మోసం చేసిందని నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడిందన్నారు. మాట తప్పను మడమ తిప్పను అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్మోహన్‌రెడ్డి అని మా నాయకుడు అలా కాదని మాటిస్తే మాట నిలబెట్టుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారు అంటే అది చంద్రబాబునాయుడు అని మైనారిటీలకు ఎప్పుడు టీడీపీ అండగా ఉంటుందని మహమ్మద్‌నూర్ తెలిపారు.





# పేదల ఇంటి కల కూటమితోనే సాకారం

## పిడతాపోలూరు గృహప్రవేశాల్లో పాల్గొన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

సర్వేపల్లి, (చైతన్యరథం): ముత్తుకూరు మండలం పిడతాపోలూరులో 31 గిరిజన ఇళ్లకు గృహప్రవేశాల కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దంపతులకు వస్త్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, "గిరిజనులతో గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక ఇళ్ల నిధులను రూ.2.55 లక్షలుగా పెంచారు, ఇందులో కేంద్రం రూ.1.80 లక్షలు, రాష్ట్రం రూ.75 వేలుగా అందిస్తోంది." అన్నారు. వైసీపీ పాలనలో నాసిరక నిర్మాణాలు, నిధుల తగ్గింపు వల్ల పిడతాపోలూరులో ఇళ్ల పనులు అర్ధాంతరంగా నిలిచాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అదనపు నిధులతో గృహ నిర్మాణాలను పూర్తి చేసింది. 62 ఇళ్లలో 31 ఇళ్లు పూర్తయ్యాయి, నిధులను రూ.55.80 లక్షల నుండి రూ.79.05 లక్షలకు పెంచారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 50 వేల పైగా గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. సెయిల్ కంపెనీ 280 కుటుంబాలను దత్తత తీసుకొని రూ.3 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిందని వెల్లడించారు. 10 పామాయిల్ కంపెనీలు, అదానీ కృష్ణపట్నం పోర్ట్ కంపెనీ, జెమినీ కంపెనీ 50 పడకల ఆస్పత్రి నిర్మాణం, నర్సింగ్ కాలేజీ వంటి ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారన్నారు. గిరిజనులు, దళితులు, బీసీల కోసం నాణ్యమైన ఇళ్ల నిర్మాణం, సీఎస్ఆర్ నిధుల సద్వినియోగం చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో పేదల సంక్షేమం, అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాలు పునరుద్ధరించామన్నారు.

# మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో ప్రజాదర్బార్

## అర్జీలు ఇచ్చి సమస్యలు ఏకరువు పెట్టిన బాధితులు

తిరుపతి, (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమానికి తిరుపతిలో ప్రజలు భారీగా తరలివచ్చి వారి సమస్యలు అర్జీ రూపంలో తెలియజేశారు. మొత్తం 83 అర్జీలు రాగా వాటిలో ఇంటి స్థలాల కోసం 40 అర్జీలు, పెన్షన్ కోసం 26, రేషన్ కార్డ్స్ కొరకు 6 అర్జీలు, జాబ్ కోసం 3, డ్రైనేజీ సమస్యలు కోసం 5, సీఎం ఆర్ఎఫ్ కోసం 2 అర్జీలు యాదవ కాలనీలో ఒక పెద్ద చెట్టు ఊదడం వలన వర్షం పడినప్పుడు అది పడిపోవడానికి ఆస్కారం ఉందని అందువల్ల ఆ చెట్టును తొలగించాలని లేనిచో అది పడిన 10 ఇండ్లకు చాలా ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. యాదవ కాలనీలో 35 ఇండ్లలో వర్షం నీరు అధికంగా చేరుతుందని తెలిపారు. అక్కడ కాలువలు ఏర్పాటు చేయాలని, మాలవాజీ హై స్కూల్ దగ్గర కమ్యూనిటీ హాల్ ప్రక్కన పోలీస్ క్వార్టర్స్ వెనుక మున్సిపల్ కాలువ ఉందని అక్కడ అపపార్ట్మెంట్ కడుతూ మట్టిని కాలువలో వేయడం వల్ల కాలువ పూడిపోయిందని బాధితులు వాపోయారు. అక్కడే పబ్లిక్ టాప్ ఉందని, నీరు పట్టుక చాలా ఇబ్బందిగా ఉదని తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర పార్టీ ప్రెసిడెంట్ చినబాబు, రాష్ట్ర నాయకులు బుల్లెట్ రమణా, మన్యం శ్రీనివాసులు, బిజీ కృష్ణ యాదమ్, కోడూరు బాలసుబ్రమణ్యం, రాష్ట్ర డైరెక్టర్ కరాటే చంద్ర, రాష్ట్ర డైరెక్టర్ మధు, జయకుమార్, ఆర్పీ శ్రీనివాసులు, రజని కాంత్ నాయుడు, ఆముదాల తులసి, సింగం శెట్టి సుబ్బరామయ్య, రా మూర్తీ రాయల్, విశ్వనాధం, రాజారాం, శంకర్ యాదవ్, బ్యాంక్ శాంతమ్మ, రేవతి, హేమావతి, సూర్య కుమారి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# టీటీడీ సతీష్ మరణంపై సర్వత్రా అనుమానాలు

## ఆ ముగ్గురు రెడ్లను విచారణకు పిలిపించాలి : గొల్ల నరసింహ యాదవ్ డిమాండ్

తిరుపతి, (చైతన్యరథం): టీటీడీకి చెందిన సతీష్ కుమార్ మరణంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయని, ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రైల్వే ట్రాక్‌కి సుమారు 30 అడుగుల దూరంలో దేహం కనబడడం సాధారణ ప్రమాదం లేదా ఆత్మహత్యగా చూడలేనని తెలిపారు. నరసింహ యాదవ్ పేర్కొన్నారు, గతంలో ముఖ్యమైన సాక్షులను హతమార్చడం వంటి ఉదాహరణలు జరిగినందున, ఈ ఘటనపై కూడా వివరంగా, పారదర్శకంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ టీటీడీ చైర్మన్లు సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి,



అలాగే మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారణకు పిలిస్తే నిజాలు వెలుగులోకి రావచ్చని సూచించారు. సాక్షుల భద్రతను కాపాడడం అత్యంత అవసరమని, కేంద్రం, కోర్టులు ఈ వ్యవహారంలో సమగ్రమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "విచారణ ప్రక్రియనులో సాక్షులను భయపెడుతూ, హింసించే ప్రయత్నాలు జరగకూడదు, న్యాయం, పారదర్శకత, సాక్షుల భద్రత తప్పనిసరి." అన్నారు. అంతేకాదు, తీతీదే జట్టులోని పరకామణి దోపిడీ, నెయ్యి కల్తీ, ఇతర అక్రమాలు వంటి అంశాలను కూడా వెలికి తీసేలా విచారణ జరగాలని సూచించారు. సతీష్ కుమార్ మరణానికి సంబంధించిన అనుమానాలను దూరం చేస్తూ, అన్ని పరిస్థితులు పరిశీలించి సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# పేదల సొంతింటి కల కూటమితోనే సాకారం

విజయవాడ, (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హయాంలో చంద్రబాబు నేతృత్వంలో పేదల సొంతింటి కల సాకారమవుతున్న చారిత్రాత్మక రోజు అని ప్రతి ఒక్కరికీ సొంతిళ్లు ఉండాలనే ఎన్టీఆర్ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి వల్ల అది సాధ్యం అవుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు అమరావతిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం 16 నెలల్లోనే మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసి పేదలకు తాళాలు అందిస్తుంటే మరొకవైపు పీఎంఏవై 2.0 క్రింద నూతన ఏళ్లకు శ్రీకారం చుడుతున్నామని ఆయన తెలిపారు గత 16 నెలల్లో పీఎం ఏవై (యు) బి ఎల్ సి 2.13.180 గృహాలు పీఎం ఎ వై (జి) 66.397 గృహాలు పీఎంజేఎం 5.980 గృహాలు ఇలా మొత్తం 2.85.557 గృహాలను పూర్తి చేయటం అయిందని ఆయన తెలిపారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నిర్మాణంలో ఉన్న ఇళ్లను నేడు పేదలకు చంద్రబాబు అందిస్తున్నారని ఆయన తెలిపారు.

# విశాఖ సమ్మిట్‌తో ఏపీకి మహర్దశ : డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎంత వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నారో నిరూపణగా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలవనుందనీ దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడటం మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్‌పై గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకృతమయిందన్నారు. పెట్టుబడులకు మరోసారి ఏపీని గమ్యస్థానంగా సీఎం చంద్రబాబు కృషి నిలుపుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 17 నెలల్లోనే రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం మొదలయిందన్నారు. చంద్రబాబు, లోకేష్ కృషితో ఇప్పటివరకు రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పించాలనే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనలు, గ్లోబల్ రోడ్ షోలు, పెట్టుబడిదారులతో ప్రత్యక్ష చర్చలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నారన్నారు. యువతకు అవకాశాలే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని అన్నారు. లోకేష్ శ్రమకు ఫలితంగా, విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల (రూ.1.33 లక్షల కోట్లు) పెట్టుబడులు పెడుతోందన్నారు. విశాఖను గ్లోబల్ డిజిటల్ హబ్‌గా తీర్చిదిద్దడంలో ఈ పెట్టుబడి కీలక పాత్ర పోషిస్తుందన్నారు.



2014-19లో కూడా ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చిన నాయకుడు చంద్రబాబేనని అధికార రికార్డులే చెబుతున్నాయనీ, అలాగే 2014-19 మధ్య రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీని ద్వారా 5.13 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని నాటి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అసెంబ్లీలో సాక్షిగా సమాధానం ఇచ్చారని గుర్తు చేసారు. జగన్ రెడ్డి పాలనలో పెట్టుబడులు రాష్ట్రాన్ని పూర్తిగా వదిలి వెళ్లాయన్నారు. పరిశ్రమలకు వేధింపులు, అనిశ్చితి, పన్నుల హింస, రాజకీయ జోక్యాల వల్ల రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం నుంచి పరారయ్యాయన్నారు. పెట్టుబడులు ఆగిపోవడంతో రాష్ట్ర నిరుద్యోగిత రేటు 24శాతానికి పెరిగిపోయిందన్నారు. ఉద్యోగాలు దొరకక రాష్ట్రంలో 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న దారుణ పరిస్థితి వైసీపీ పాలనలో నెలకొందని అన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వానికి ఆదాయ వనరుగా నిలిచిన అమర రాజా బ్యాటరీస్‌ను కూడా జగన్ వేధింపుల పాలు చేసి రాష్ట్రం నుంచి తరిమేశాడు. జాకీ, కియా అనుబంధ యూనిట్లు, బీఆర్ షెట్టి గ్రూప్, సింగపూర్ స్టార్టప్స్ వంటి ఎన్నో కంపెనీలను పెట్టుబడులు పెట్టనీయకుండా అడ్డుకున్నారు. జగన్ పాలన పెట్టుబడులను తరిమేసే పాలనగా చరిత్రలో చరిత్రహీనుడిగా నిలిచిపోయారన్నారు.

# భారీగా టీడీపీలోకి వైసీపీ వలసలు

## కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పరిటాల

చెన్నేకొత్తపల్లి, (చైతన్యరథం): మండలంలో వైసీపీలో కీలకంగా ఉన్న పలువురు గ్రామ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. చెన్నేకొత్తపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎల్.నారాయణ చౌదరి, మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి ఇతర ముఖ్య నాయకుల సమక్షంలో మేడాపురంకి చెందిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే సునీత వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో పుట్టపర్తి పెద్దన్న, మల్లికార్జున, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేంద్ర, శ్రీదేవి తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సుమచిత స్థానం ఉంటుందన్నారు. మండలంలో జరిగే అభివృద్ధికి సహకరిస్తూ.. పార్టీ కోసం పని చేయాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. వైసీపీని రాష్ట్రంలో ప్రజలే కాకుండా ఆ పార్టీ నాయకులు కూడా నమ్మడం లేదన్నారు. రానున్న రోజుల్లో వైసీపీ మరింత పతనావస్థకు చేరుకుంటుందన్నారు.



# ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాం

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా



రాప్తాడు, (చైతన్యరథం): ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి విజ్ఞప్తికి పరిష్కారం చూపిస్తామని, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు. చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు, ఇంటి పట్టాలు ఇవ్వాలని, కనకదాస విగ్రహ ప్రతిష్టకోసం, గీతా మందిరం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తులు వచ్చాయి. ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకుంటూ, వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఇందులో ముఖ్యంగా చెన్నేకొత్తపల్లి మండలం ప్రసన్నాయపేటకు చెందిన కృష్ణారెడ్డి మహిళా సంఘాలను మోసం చేసి 33లక్షలు కాజేసిన సంఘటన మీద ఫిర్యాదు అందింది. మహిళా సంఘాల సభ్యులు కన్నీరు పెట్టుకుంటూ తమ సమస్యను చెప్పుకున్నారు. మహిళలు ఎంతో కష్టపడి రుణాలు చెల్లించేందుకు డబ్బు ఇస్తే.. ఇలా బ్యాంక్ కు చెల్లించకుండా కృష్ణారెడ్డి అనే వ్యక్తి.. మోసం చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి ఎక్కడున్న వెంటనే అరెస్ట్ చేయాలని.. మహిళలకు ఇవ్వాల్సిన డబ్బును రికవరీ చేయాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. మరోవైపు మండలంలో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయని.. ఆన్ లైన్ లో యజమానికి తెలియకుండా ఎలా పేర్లు మారుస్తారని నిలదీశారు. అర్హత ఉన్న వ్యక్తి అర్జీని రెవెన్యూ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. పింఛన్లు, ఇంటి పట్టాలు త్వరలోనే అందజేస్తామన్నారు. మండల కేంద్రంలో భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్టాపనకు, గీతా మందరం నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తామన్నారు. నరసింగరాయుని పల్లి గ్రామం నుంచి ఓబులంపల్లి మెయిన్ రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపడుతామన్నారు. బసంపల్లి వెళ్లేదారిలో మట్టి రోడ్డు నిర్మాణం అలాగే గ్రామంలో స్మశాన వాటికకు స్థలం మంజూరు చేస్తామన్నారు. ఇక్కడ వచ్చిన ప్రతి అర్జీకి నిర్దిష్ట సమయంలోనే పరిష్కారం చూపించాలన్నారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకపోతే, అందుకు గల కారణాలు కూడా తెలియజేయాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు..

# మడకశిరలో కొలువుదీరిన టీడీపీ కమిటీలు



## ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

మడకశిర, (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గంలో మండల, గ్రామ స్థాయి పార్టీ కమిటీలకు సంబంధించిన నాయకులు కొలువుదీరారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఏర్పడిన కమిటీల నాయకులతో మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు గారు మడకశిరలోని తమ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పలువురు ముఖ్య నాయకులతో కలిసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఎగరేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కొత్తగా నియమించబడిన నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామస్థాయిలో పార్టీని పటిష్టవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు నాయకులు నిరంతరం అందుబాటులో ఉండాలని, వారి అవసరాలు, సమస్యలు తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారులు, ప్రజలకు మధ్య నాయకులు వారధిలా ఉండి పనిచేయాలని, ప్రజా సంక్షేమం – అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, ఐదు మండలాల సింగిల్ విండో అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా టీడీపీ కమిటీల ప్రమాణస్వీకారం

## పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు



ఒంగోలు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం ఒంగోలులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సుమారు 1600 మందికిపైగా కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో నగర, మండల కమిటీలు, నగర /మండల అనుబంధ కమిటీలు, గ్రామ కమిటీలు,యూనిట్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, డివిజన్, గ్రామ కమిటీల సభ్యులు ఉన్నారు. నగర అధ్యక్షులుగా బండారు మదన్, ఒంగోలు మండల అధ్యక్షులుగా గుండపనేని శ్రీనివాసులు, కొత్తపట్నం మండల అధ్యక్షులుగా ద్వారాబాకుల శ్రీనివాసులరెడ్డి కమిటీ సభ్యులు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తగా కష్టపడి పనిచేసే వారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరూ నిజాయితీగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి పనులను డివిజన్ గ్రామస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలందరికీ వివరించాలని కోరారు. మరో 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు చూపించిన ఆదరణ ఎన్ని జన్మలెత్తినా మర్చిపోలేనని అన్నారు. గత ప్రభుత్వ రాక్షస పాలనలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న మీరందరికీ ధన్యవాదాలు తెలిపారు. కొంతమందికి పార్టీలో ఒక్కోసారి ప్రాధాన్యత లేకున్నా అందరూ పార్టీకి కట్టుబడుతున్నారని ప్రశంసించారు. ప్రస్తుతం పార్టీ పదవులు రాని నాయకులు ఉంటే, వారికి తదుపరి అవకాశం వస్తుందని, ఈ విషయాన్ని అందరూ గమనించుకోవాలని సూచించారు. వచ్చే స్థానిక ఎన్నికలు ఏప్పుడు వచ్చినా అందరూ సిద్ధంగా వుండాలి అన్ని తెలియజేసారు. తదుపరి కేక్ కట్ చేసి అందరకీ శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు అందరూ పాలొన్నారు.



# సాక్షులకు వైసీపీ ముఠాతో ముప్పే

## చిత్తూరు టీడీపీ నేతల హెచ్చరిక

చిత్తూరు, (చైతన్యరథం): వైసీపీ ఎమ్మెల్యే జగన్‌రెడ్డి తన బాబాయ్ వైయస్ వివేకానంద రెడ్డిని హత్య చేసి బాత్రూంలో పడేసినట్లు, పరకామణి చోరీ కేసులో కీలక సాక్షిని కొట్టి చంపి రైల్వే ట్రాక్ పైన పడేశారని చిత్తూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. సాక్షుల్ని తారుమారు చేయటం, అడ్డు తొలగించడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. నెయ్యి కల్తీ నెయ్యి కేసు, పరకామణి కేసుల్లో ఇతర సాక్షులకు కూడా వైసీపీ నాయకుల నుండి ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.

సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, సెల్ అధ్యక్షుడు మేషక్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, బీసీ సెల్ జిల్లా పూతలపట్టు అధ్యక్షుడు ధరణి ప్రకాష్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి జైపాల్ పాల్గొన్నారు.

# మరో ఘాతుకానికి పాల్పడిన వైసీపీ ముఠా

## టీడీపీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి

శ్రీకాళహస్తి నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుడికి సంబంధించిన పరకామణిలో డాలర్లు కొట్టేసిన కేసులో రవికుమార్ అనే ముద్దాయిని పై మొదటగా ఫిర్యాదు చేసిన విజిలెన్స్ మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్ అనుమానాస్పదంగా మృతిని వైసీపీ నాయకులు చేసిన హత్యగా ప్రజలంతా కూడా భావిస్తున్నారని అన్నారు. వారికి ఇది అలవాటుగా మారింది దానికి నిదర్శనాలు గతంలో పరిటాల రవిని రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హత్య చేసి దానిలో ప్రేమే ఉన్న వారందరినీ చంపడం దానికి సంబంధించి మొద్దు శీను నుండి పటోళ్లగోవర్ధన్ రెడ్డి సూరి వరకు వీరు చేసిన అరాచకాలు అందరికీ తెలుసు అని అన్నారు. అదేవిధంగా వారి బాబాయి వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి అది గుండిపోటు తో చనిపోయారని చిత్రీకరించినటువంటి అత్యంత దుర్మార్గులు జగన్మోహన్ రెడ్డి వారి పార్టీ నాయకులేని సందర్భంగా ప్రజలందరికీ గుర్తు చేస్తున్నాం అటువంటి నాయకులు ఈరోజు విచారణకు హాజరు కావలసిన మాజీ ఏవీఎస్ ఓ సతీష్ కుమార్ ని రైలు పట్టాలపై మృతదేహాన్ని పెట్టడం దానిపై గాయాలు కూడా ఉన్నాయని వారి కుటుంబ సభ్యులు మీడియా కూడా తెలపడాన్ని ప్రజలు కూడా పరకామణి కేసును నీరుగార్చడానికి వైసీపీ నాయకుల పని అని అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారని ప్రజలందరికీ తెలియపరుస్తున్నాం అన్నారు కూటమి ప్రభుత్వం నాయకత్వంలో సమగ్రమైనటువంటి విచారణ జరిపించి దోషుల్ని బాధ్యులైన వారిని చట్ట ప్రకారం శిక్షించాల్సిందిగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాం అని గురువారెడ్డి అన్నారు ఈ మధ్యనే టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి కూడా తాను పోరాటం చేస్తున్నాను ఇందులో నా ప్రాణాలకు కూడా ప్రమాదం ఉంది అని అన్నారంటే వైసీపీ నాయకుల దుర్మార్గపు ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయో వీటన్నింటికీ నిదర్శనాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలియపరుస్తున్నామన్నారు.



# బీహార్‌లో ఎన్డీఏ అఖండ విజయం

## 243 స్థానాలకు 202 స్థానాల్లో విజయధంకా, 35 సీట్లతో మహా గఠ్ బంధన్ కుదేలు



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కనీవినీ ఎరుగని రీతిలో భారీ విజయం సాధించింది. ఏకంగా 200కుపైగా స్థానాలను కైవసం చేసుకుని.. డబుల్ సెంచరీ కొట్టింది. మొత్తం 243 స్థానాలకు గానూ 202 స్థానాల్లో విజయఢంకా మోగించింది. గెలుపు ప్రభంజనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మరోసారి సిద్ధమైంది.ఎన్డీయే కూటమిలోని బీజేపీ (89), జేడీయూ (85), ఎల్‌జేపీ (ఆర్వీ) (19), హెచ్‌ఏఎం(5), ఆర్‌ఎల్‌ఎం (4) సీట్లలో విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాతో పాటు జానపద గాయనీ మైథిలీ ఠాకూర్, శ్రేయసి సింగ్, ప్రేమ్ కుమార్, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ తదితర కీలక నేతలు గెలుపొందారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 125 సీట్లు సాధించింది. ఇందులో బీజేపీ (74), జేడీయూ (43), వీఐపీ (04), హెచ్ఎఎం (04) స్థానాల్లో గెలుపొందాయి. ఈసారి నితీశ్ కుమార్ పార్టీ భారీగా పుంజుకుంది. 2020 ఎన్నికలతో పోలిస్తే దాదాపు రెట్టింపు సీట్లలో (85) విజయం సాధించడం గమనార్హం. కాషాయ పార్టీ సైతం 15 సీట్లు అదనంగా తన ఖాతాలో వేసుకుంది.

మరోవైపు, ప్రతిపక్ష మహాగడ్ ఠ్ధన్ ఘోర ఓటమిని చవిచూసింది. 2020 ఎన్నికల్లో 110 స్థానాల్లో విజయం సాధించగా.. ఈసారి 35 సీట్లకే పరిమితమైంది. ఆర్జేడీ 2020 ఎన్నికల్లో 75 సీట్లు సాధించగా.. ఈసారి 25 స్థానాల్లోనే గెలిచింది. ఏకంగా 50 సీట్లు కోల్పోయింది. కాంగ్రెస్ 19 నుంచి ప్రస్తుతం ఆరు స్థానాలకే పరిమితమైంది. రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి పార్టీ చరిత్రలోనే ఇది రెండో పేలవ ప్రదర్శన. 2010లో హస్తం పార్టీకి నాలుగు సీట్లే వచ్చాయి. వామపక్షాలు కూడా ఈసారి మూడు స్థానాలే దక్కించుకున్నాయి.

### అద్భుతమైన తీర్పు : ప్రధాని మోదీ

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు భారీ మెజార్టీ రావడంపై ప్రధాని మోదీ స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు చెప్పారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి గెలిచాయన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పనిచేసేందుకు ఈ వారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రి అమిత్ షా. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా బీహార్ విజయంపై స్పందించారు. "వికసిత్ బీహార్‌పై విశ్వాసం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయమిది. జంగల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు ఏ వేషంలో వచ్చినా.. వారికి దోచుకునే అవకాశం లభించదు" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. "మోదీ, నితీశ్ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ విధానాలపై ప్రజల్లో నెలకొన్న నమ్మకానికి ఈ విజయం నిదర్శనం.

| బిహార్ (243/243) | | |
|---|---|---|
| పార్టీ | ఆధిక్యం | గెలుపు |
| ఎన్డీయే | - | 202 |
| ఎంజీబీ | - | 35 |
| జన్‌సురాజ్ | - | - |
| ఇతరులు | - | 6 |

జంగలారాజ్, అవినీతిని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారు. సుపరిపాలన, స్థిరత్వం, అభివృద్ధికి ఓటేశారు" అని భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు.

### అఖండ మెజార్టీ ఇచ్చారు : సీఎం నీతీశ్

అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ అన్నారు. తమకు ఆపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

# సోషల్ మీడియాలో సంచలనం .. ఎన్నికల్లో విజయదరహాసం!

## అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అతిపిన్న వయస్కురాలు ఆధ్యాత్మిక, జానపద గాయని మైథిలీ



ఆమె ఆధ్యాత్మిక, జానపద గీతాలతో సోషల్ మీడియాలో సంచలనం. ఇప్పుడు బీహార్ రాజకీయాల్లో కూడా రికార్డు సృష్టించింది. ఈ సారి అసెంబ్లీకి ఎన్నికైన అతిపిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆమెపేరు మైథిలీ ఠాకూం. ఆలీనగర్ నియోజకవర్గం నుంచి భాజపా తరపున రంగంలోకి దిగిన ఆమె స్థానిక ఆర్జేడీ దిగ్గజ నేత వినోద్ మిశ్రాను సుమారు 11 వేల ఓట్ల తేడాతో ఓడించి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడుతోంది. వాస్తవానికి 2008లో ఆలీనగర్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి భాజపా ఇక్కడ విజయకేతనం ఎగురవేసింది. ఇన్‌స్టా, యూట్యూబుల్లో కలిపి ఆమెకు 11 కోట్ల మంది పాలోయర్లు ఉన్నారు. ఇక ఫేస్బుక్లో అయితే 1.4 కోట్ల మంది ఆమెను అనుసరిస్తున్నారు. 2024లో శబరి మీద పాడిన ఆమె పాట ప్రధాని మోదీని ఆకట్టుకుంది. ఆ యువతి పేరు మైదిలీ ఠాకూర్. సాక్షాత్తూ దేశ ప్రధానే ఆమెపై ప్రశంసల జల్లు కురిపించారు. కేంద్ర ప్రభుత్వం తొలిసారి జాతీయ స్థాయి క్రియేటర్లకు అవార్డులు ఇచ్చినప్పుడు అందుకున్న తొలి 24 మందిలో ఆమె కూడా ఉంది. నాడు 'కల్చరల్ అంబాసిడర్ అఫ్ ది ఇయర్‌గా ఎంపికయింది.

సంగీత సాధన కోసం 17 సార్లు ఇల్లు మారాల్సి వచ్చింది..

మైథిలీ 2000వ సంవత్సరం జూలై 25న మధుబనిలోని లేనిపట్టిలో జన్మించింది. ఆమె తండ్రి రమేశ్ ఠాకూర్. శాస్త్రీయ సంగీతకారుడు, గాయకుడు, టీచర్. తల్లి భారతీ గృహిణి, రమేశ్ చిన్నప్పటి నుంచే కుమార్తెకు శాస్త్రీయ సంగీతం నేర్పించారు. ఆమె సోదరులు అయాచీ, రిషబ్ కూడా సంగీతం నేర్చుకొన్నారు. ఆమె తన జానపద పాటలతో సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకొంది. ఇండియన్ ఐడియల్లో పాల్గొంది. ఆ. తర్వాత ఐ జీనియస్ యంగ్ సింగింగ్ స్టార్లో విజేతగా నిలిచింది. రైజింగ్ సింగర్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది.

తమ పిల్లల సంగీత సాధన ఇతరులకు ఇబ్బందిగా మారుతుండటంతో 17 సార్లు ఇళ్లు మారినట్లు మైథిలీ తల్లి భారతీ ఓ సందర్భంలో మీడియాకు వెల్లడించారు. తాము కేవలం ఒక చిన్న గదులను అద్దెకు తీసుకొని జీవనం సాగించినట్టు ఆమె పేర్కొన్నారు. 2017లో ఎట్టకేలకు ఆ కుటుంబం సొంత ఇల్లు కొనుగోలు చేసింది. ఆ తర్వాత 2020లో ఓ అపార్ట్మెంట్లోకి మారారు. 2023లో ఎన్నికల కమిషన్ ఆమెను మధుబనికి బ్రాండ్ అంబాసిడర్గా ఎంపికచేసింది. ఆ తర్వాత సంవత్సరమే ప్రధాని మోదీ నుంచి అవార్డు అందుకొంది.

# పునరావృతమైన ఫలితాలు

## ఓట్లు వచ్చినా గల్లంతయిన ఆర్జేడీ సీట్లు

బీహార్‌లో లాలూ ప్రసాద్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ కొన్నేళ్లుగా అధికారానికి దూరమైనప్పటికీ.. యాదవ్, ముస్లిం వర్గం మద్దతుతో స్థిర ఓటు బ్యాంకును కొనసాగిస్తోంది. 2005 నుంచి ఇప్పట వరకు చూస్తే ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో 18 నుంచి 23శాతం ఓట్లు పొందుతోంది. ఈ ఎన్నికల్లోనూ 22,8శాతం ఓట్లు సాధించింది. భారీగా సీట్లు కోల్పోయినప్పటికీ.. ప్రత్యర్థుల కుటే ఈ పార్టీకే ఓట్లు ఎక్కువగా రావడం గమనార్హం. జేడీయూకు 18.9శాతం, భాజపాకు 20.6శాతం. కాంగ్రెస్కు 8,7శాతం ఓట్లు వచ్చాయి.

### మళ్లీ 2010 ఫలితాలే

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ స్థిరమైన ఓట్ల శాతం పొందినప్పటికీ, సీట్లు మాత్రం భారీగా కోల్పోయింది. 2005లో ఆర్జేడీ 75 స్థానాల్లో గెలుపొందగా, 23. 4 శాతం ఓట్లు పొందింది. 2010లో కేవలం 22 స్థానాల్లో విజయం సాధించింది.2015లో 80, 2020 ఎన్నికల్లో 75 స్థానాల్లో విజయం సాధించగా ఈ సారి 26 స్థానాలకే పరిమితమయింది. 2010 తర్వాత ఈ స్థాయిలో సీట్లు కోల్పోవడం ఇదే తొలిసారి. ఇక్కడ కాంగ్రెస్ పరిస్థితి కూడా ఈసారి మరింత దిగజారింది. 2015 (27), 2020 (19)లలో కాస్త మెరుగైన ఫలితాలు సాధించిన కాంగ్రెస్ ఈసారి కేవలం ఆరు స్థానాలతోనే సరిపెట్టుకుంది. 2010లో ఈ పార్టీ కేవలం నాలుగు చోట్ల గెలుపొందింది. ఈసారి 8.7 శాతం ఓట్లతో ఓటు బ్యాంకును కాపాడుకునే ప్రయత్నం చేసింది. మొత్తంగా రెండు పార్టీలకు దాదాపు 2010 నాటి ఫలితాలే రిపీట్ అయినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

# హత్యకేసులో అరెస్టు.. ఎన్నికల్లో గెలుపు!

## బీహార్‌లో జేడీయూ అభ్యర్థి అనంత్‌సింగ్ సంచలనం




ప్రశాంత్ కిశోర్ మద్దతుదారు దులార్ చంద్ యాదవ్ హత్య కేసులో అరెస్టయిన జేడీయూ అభ్యర్థి ఆనంత్ సింగ్ బీహార్ ఎన్నికల్లో విజయం సాధించారు. మొకామా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన ఆనంత్ సింగ్ 28,206 ఓట్ల ఆధిక్యంతో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్టేడీ) అభ్యర్థి వీణాదేవిపై గెలుపొందారు. అనంత్‌సింగ్ ఇప్పటి వరకు నాలుగుసార్లు మొకామా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2005లో జేడీయూ తరపున పోటీ చేసి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.. 2010లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2015లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి మరోసారి విజయం సాధించారు. 2020 ఎన్నికలకు ముందు ఆర్జేడీలో చేరి ఎమ్మెల్యే స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 2022లో ఆయుధాల సరఫరాకు సంబంధించిన కేసులో దోషిగా తేలడంతో ఎమ్మెల్యే సీటును కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన భార్య సిలందేవి పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆనంత్‌సింగ్ జేడీయూ అభ్యర్థిగా పోటీ చేసి, మరోసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆయనపై 28 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇటీవల మొకామా నియోజకవర్గంలో ఇన్సురాజ్ పార్టీ అభ్యర్థిగా పీయూష్ ప్రియదర్శి ప్రచారం చేస్తుండగా.. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.. ఆ సమయంలో పీయూష్ మామ, పార్టీ కార్యకర్త దులార్ చంద్‌పై కొందరు దుండగులు కాల్పులు జరిపారు. దులార్‌చంద్ హత్య నేపథ్యంలో అదే నియోజకవర్గం నుంచి జేడీయూ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనంత్ సింగ్‌పై పోలీసులు నిఘా ఉంచారు. ఆనంతరం ఆయనను అరెస్టు చేశారు.

# బీహార్ ఫలితాలు మాకో గుణపాఠం

## భవిష్యత్తు ఎన్నికల కోసం కొత్త వ్యూహాలు : కర్ణాటక డీసీఎం డీకే



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష ఇండియా" కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీనిపై ఫలితాలపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. భవిష్యత్తు ఎన్నికల కోసం కాంగ్రెస్‌తోపాటు 'ఇండియా' కూటమి కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తాజా ఫలితాలను తమ పార్టీకి, మిత్రపక్షాలకు ఓ గుణపాఠంగా పేర్కొన్నారు.

"బీహార్ ఫలితాలు... ప్రజలు ఇచ్చిన తీర్పు. మాకు ఒక గుణపాఠం లాంటిది. కాంగ్రెస్ పార్టీకి, "ఇండియా' కూటమికి కొత్త వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. దీని కోసం కసరత్తు చేస్తాం" అని డీకే శివకుమార్ మీడియాతో అన్నారు. బీహార్‌లో మహిళల ఓట్ల శాతం పెరుగుదల, వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం వంటివి ఎన్డీయే విజయానికి దోహదం చేశాయా! అనే ప్రశ్నకు బదులిస్తూ.. "దీన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నా వద్దకు ఇంకా వివరణాత్మక నివేదిక రాలేదు. తర్వాత మాట్లాడతాను" అని చెప్పారు.



# అంగారకుడివైపు 'ఎస్క పేడ్'

- నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన 'న్యూగ్లెన్'
- రాకెట్ ప్రయోగం విజయవంతం

అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మార్స్ మిషన్ 'ఎస్క పేడ్' ప్రయోగం విజయవంతమైంది. అపరకుబేరుడు, అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆర్జిన్'కు చెందిన జంబో రాకెట్ అంతరిక్ష నౌకను నింగిలో ప్రవేశపెట్టింది. అనంతరం రాకెట్ విజయవంతంగా భూమిని చేరింది. వాతావరణ సమస్యలు, సౌర తుపాను కారణాలతో కొన్ని రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న 'ఎస్క పేడ్' మిషన్ ఎట్టకేలకు గురువారం అంగారకుడి దిశగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఫ్లోరిడా తీరంలోని కేప్ కెనవెరల్ స్పేస్ స్టేషన్‌నుంచి అతి శక్తివంతమైన రాకెట్ అయిన 'న్యూ గ్లెన్'తో అంతరిక్ష నౌక ఆకాశంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగంతో 321 అడుగుల భారీ రాకెట్ అయిన 'న్యూ గ్లెన్'.. రోబోటిక్ మార్స్ సైన్స్, భారీ వాణిజ్య రాకెట్లకు సంబంధించి కొత్త శకానికి నాంది పలికింది.

**ఒకే మిషన్లో రెండు ఉపగ్రహాలు**

'ఎస్క పేడ్'ను నాసా ప్రతిష్టాత్మకంగా చేపట్టడానికి గల కారణం.. మిషన్లో రెండు ఉపగ్రహాలు ఉండడమే. బ్లూ, గోల్డ్ పేర్లు కలిగిన ఉపగ్రహాలు అంగారకుడి వాతావరణాన్ని పరిశీలించనున్నాయి. అంగారక గ్రహం ఎలా తన వాతావరణాన్ని కోల్పోయిందో ఇవి పరిశోధిస్తాయి. మార్స్ పరిణామం, నివాసయోగ్యతకు సంబంధించి అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. అంతేకాకుండా ఈ ఉపగ్రహాలు మార్స్ అయస్కాంత క్షేత్రం ప్లాస్మా వాతావరణాన్ని శోధించనున్నాయి. బిలియన్ల ఏళ్లకొద్దీ నిగూఢంగా ఉన్న డేటాను ఇవి సేకరించనున్నాయి. 'ఎస్క పేడ్' అంతరిక్ష వాహక నౌక ఒక ఏడాది పాటు భూకక్షలో తిరుగుతూ 2027నాటికి అంగారకుడి కక్షలోకి చేరనుంది. ఒకసారి మార్స్ కక్షలోకి ప్రవేశించగానే బ్లూ, గోల్డ్ ఉపగ్రహాలు పనిచేయడం ప్రారంభిస్తాయి.

**స్పేస్‌ఎక్స్‌కు పోటీగా బ్లూ ఆర్జిన్..**

ప్రయోగం అనంతరం జంబో రాకెట్ 'న్యూ గ్లెన్' తిరిగి భూమిని చేరింది. అట్లాంటిక్ సముద్రంలోని రికవరీ షిప్ జాక్లైన్‌పై సురక్షితంగా దిగింది. దీంతో బ్లూ ఆర్జిన్ చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా మిగిలింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్‌కు మాత్రమే రాకెట్ల రీయూజబుల్ టెక్నాలజీ ఉంది. తాజాగా 'బ్లూ ఆర్జిన్' ఆ మార్క్‌ను సాధించింది. దీంతో స్పేస్ ఎక్స్‌కు బ్లూ ఆర్జిన్ పోటీదారుగా మారింది.

# వాడుకుని.. వదిలేస్తాం!

## అమెరికన్లకు శిక్షణ కోసమే హెచ్1బీ వీసాలు: బెసెంట్



అమెరికాలో నిపుణుల కొరత ఉందంటూ హెచ్1బీ వీసా విధానంపై అధ్యక్షుడు ట్రంప్ స్వరం మార్చిన మరుసటి రోజే ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికన్లకు శిక్షణ ఇచ్చిన అనంతరం వీసాదారులను వారి స్వదేశాలకు పంపించి వేయాలన్నదే ట్రంప్ ప్రణాళిక అని వెల్లడించారు. హెచ్1బీ వీసా విధానంపై ట్రంప్ వ్యాఖ్యల గురించి అడిగిన ప్రశ్నకు బెసెంట్ సమాధానమిచ్చారు. "నైపుణ్యం ఉన్నవారికే అమెరికాలో ఉద్యోగాలు వస్తాయి.. విదేశీ కార్మికులను ఇక్కడకు తీసుకువచ్చి వారితో అమెరికన్లకు శిక్షణనిప్పించాలి. మూడునుంచి ఏడేళ్ల తర్వాత వారు తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాలి. అప్పుడు అమెరికన్లకు ఉద్యోగాలు దొరుకుతాయి. 20-30 ఏళ్లుగా అమెరికాలో తయారీరంగం మందకొడిగా సాగుతోంది. కొన్నేళ్లుగా ఇక్కడ నౌకలను నిర్మించడంలేదు. సెమీకండక్టర్ పరిశ్రమనూ అమెరికాకు తీసుకురావాలని అనుకుంటున్నాం" అని బెసెంట్ తెలిపారు. మరోవైపు, దేశంలో వీసా కార్యక్రమాలు కొనసాగుతాయని అమెరికా అంతర్గత భద్రతా విభాగం కార్యదర్శి క్రీస్తీ నియోమ్ తెలిపారు.

## సైనిక చట్టాల్లోనూ

# భారీ సవరణలు

## మునీర్‌కు అనుకూలంగా పాక్ పార్లమెంటు చర్యలు



పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్‌కు త్రివిధ దళాల పగ్గాలు అప్పగించేందుకు వీలుగా ఆ దేశ పార్లమెంట్ గురువారం సైనిక చట్టాలకు సవరణ చేసింది. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన 27వ రాజ్యాంగ సవరణ బిల్లును పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ కూడా ఆమోదముద్ర వేసిన వెంటనే ఈ చట్టాల్లో మార్పులకు పార్లమెంటు అంగీకారం తెలపడం గమనార్హం. దీంతో ఇప్పటివరకు సైన్యాధిపతిగానే ఉన్న మునీర్.. త్రిదళాధిపతి (సీడీఎఫ్)గా కొనసాగడానికి ఉన్న చట్టపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయినట్టే. సీడీఎఫ్ హోదాలో ఆయన నియామక తేదీనుంచి ఐదేళ్లు కొనసాగుతారు.

27 రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా.. పాక్ సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు రాజీనామా చేశారు. సవరణ రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు విరుద్ధంగా ఉందని వారు పేర్కొన్నారు. సవరణ బిల్లుకు అధ్యక్షుడు జర్దారీ గురువారం ఆమోదం తెలిపిన వెంటనే జస్టిస్ మన్సూర్ అలీ, జస్టిస్ అతార్ మినాల్లాలు.. పదవుల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు. 27వ సవరణ ప్రకారం.. రాజ్యాంగానికి సంబంధించిన కేసులను విచారించేందుకు ఫెడరల్ రాజ్యాంగ న్యాయస్థానం ఏర్పాటు కానుంది. దీంతో సుప్రీంకోర్టు కేవలం సివిల్, క్రిమినల్ కేసులకే పరిమితం కానుంది.



## చిన్నారుల్లో పెరుగుతున్న

# అధిక రక్తపోటు ముప్పు

గత రెండు దశాబ్దాల్లో అధిక రక్తపోటు బారినపడిన చిన్నారులు, టీనేజర్ల సంఖ్య రెండింతలైందని ఓ అధ్యయనం పేర్కొంది. 2000 సంవత్సరంలో మొత్తం చిన్నారులు, టీనేజర్లలో రక్తపోటుతో ఇబ్బంది పడేవారు 3.2 శాతంఉండగా 2020కి అది 6 శాతానికి చేరింది. యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్బరో శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం వివరాలు తాజాగా ది లాన్సెట్ చైల్డ్ అండ్ అడాలసెంట్ హెల్త్ జర్నల్లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధన కోసం వారు 21 దేశాలకు చెందిన 4,43,000 చిన్నారుల వైద్య నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. "చిన్న వయసులో రక్తపోటు వచ్చిన వారికి చికిత్స అందించకపోతే భవిష్యత్తులో వారికి తీవ్రమైన గుండె, కిడ్నీ సమస్యలు వచ్చే ముప్పుంది. ప్రస్తుతం బీపీ వచ్చిన చిన్నారుల సంఖ్య పెరగడానికి ఊబకాయమే ప్రధాన కారణం. ఊబకాయంతో ఇబ్బంది పడే ప్రతి ఐదుగురు చిన్నారుల్లో ఒకరు రక్తపోటు బారిన పడుతున్నారు" అని నివేదికలో పేర్కొన్నారు. టీనేజర్లకు ఎప్పటికప్పుడు బీపీ పరీక్షలు చేయిస్తూ ఉండాలని సూచించారు.

# కుట్రదారు కొంప కూల్చివేత



ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు కారకుడైన ఉమర్ మహమ్మద్ అలియాస్ ఉమర్- ఉన్- నబీ ఇంటిని భద్రతా బలగాలు శుక్రవారం నేలమట్టం చేశాయి. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామాలో అతడి నివాసాన్ని తెల్లవారుజామున కూల్చివేసినట్టు అధికారులు వెల్లడించారు. దీంతో భారత్‌లో ఉగ్రవాద కార్యకలపాలకు మద్దతిస్తున్న వారికి ఇది ఓ సందేశాత్మక హెచ్చరికగా అభివర్ణించారు. ఎర్రకోట సమీపంలో గత సోమవారం సాయంత్రం తీవ్ర కలకలం రేపిన బాంబు పేలుడులో ఇప్పటివరకూ 13మంది మృతి చెందారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పేలుడు జరిగిన ప్రదేశంలో లభించిన ఉమర్ నమూనాలను అతడి తల్లినుంచి సేకరించిన డీఎన్‌ఏ నమూనాలతో పోల్చగా.. కారులో ఉన్నది అతడేనని నిర్ధారణ అయింది. నిందితుడు ఉమర్.. ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో వైద్యునిగా పనిచేసేవాడు. ఈ ఘటనలో అతడి సన్నిహితులైన వైద్యులు ముజామ్మిల్, షాహీన్‌లను అదుపులోకి తీసుకుని అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

# బుమ్.. బుమ్.. బుమ్రా!

▲ సౌతాఫ్రికా వెన్ను విరిచిన పేస్ గుర్రం

▲ 159 పరుగులకే ఆలౌట్

▲ తొలి టెస్ట్ తొలి రోజు భారత్ పై చేయి

▲ 37/1తో ఆడుతున్న టీమిండియా




సౌతాఫ్రికా జరుగుతున్న తొలి టెస్టులో మొదటిరోజు టీమిండియా పై చేయి సాధించింది. కోల్‌కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా శుక్రవారం మెదలైన తొలి టెస్ట్‌లో భారత పేసు గుర్రం జస్ప్రీత్ బుమ్రా (5/27) విజృంభించడంతో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 159 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఫస్ట్ ఇన్నింగ్సును ఆరంభించిన టీమ్ ఇండియా ఆట ముగిసేసరికి 37/1 స్కోరుతో నిలిచింది. భారత్ ఇంకా 122 పరుగుల వెనుకంజలో ఉంది. సఫారీలు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్ ఆచితూచి ఆడారు. వెలుతురు సరిగా లేనందున ఆటను ముందుగానే ముగించారు.

### శుభారంభం దక్కినా..

ఓపెనర్లు మార్క్రమ్, రికెల్టన్ సౌతాఫ్రికాకు శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 63 బంతుల్లో 57 పరుగులు జోడించింది. ఈ క్రమంలో బుమ్రా వరుస ఓవర్లలో ఓపెనరిద్దరినీ ఔట్ చేసి సౌతాఫ్రికాను దెబ్బకొట్టాడు. ఇక కెప్టెన్ తెంబా బవుమా దారుణంగా విఫలమయ్యాడు. కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్లో ధ్రువ్ జురెల్‌కు క్యాచ్ ఇచ్చి మూడు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వెనుదిరిగాడు. 71/3తో కష్టాల్లో పడిన జట్టును జోర్జి, ముల్దర్ ఆదుకునే ప్రయత్నం చేశారు. లంచ్ బ్రేక్ సమయానికి సౌతాఫ్రికా 3 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది.

రెండో సెషన్‌లో సఫారీల జట్టు ఐదు వికెట్లు కోల్పోయింది. వన్ డౌన్ బ్యాటర్ వియాన్ ముల్డర్ 51 బంతులు ఎదుర్కొని 24 పరుగులు చేసి కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్లో అవుటయ్యాడు. మరోవైపు.. టోనీ డి జోర్జి (55 బంతుల్లో 24) నిలబడే ప్రయత్నం చేయగా బుమ్రా.. అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. వికెట్ కీపర్ కైల్ వెరెన్నె (16)తో పాటు.. మార్కో యాన్సెన్ (0)ను ఒకే ఓవర్లో మొహమ్మద్ సిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే జోర్జి కూడా బుమ్రా బౌలింగ్లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. వెరెనె, మార్కో యాన్సెన్ (0)ని సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. కోర్బిన్ బాష్ (3)ని అక్షర్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపడంతో సౌతాఫ్రికా 154/8తో టీ బ్రేక్ కు వెళ్లింది. చివరి సెషన్ ఆరంభమైన తర్వాత మూడు ఓవర్లలోనే సఫారీల కథ ముగిసింది. బుమ్రా ఒకే ఓవర్లో సైమన్ హార్మర్ (5), కేశవ్ మహరాజ్ (0)ని ఔట్ చేసి సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌న ముగించాడు. ట్రిస్టన్ స్టబ్స్ 74 బంతులు ఎదుర్కొని 15 పరుగులతో ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు.

భారత బౌలర్లలో పేసర్లు బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగగా.. సిరాజ్ రెండు వికెట్లు దక్కించుకున్నాడు. స్పిన్నర్లలో కుల్దీప్ యాదవ్ రెండు, అక్షర్ పటేల్ ఒక వికెట్ దక్కించుకున్నారు.

### జైశ్వాల్ విఫలం

అనంతరం బ్యాటింగ్ కు దిగిన భారత జట్టుకు శుభారంభం లభించలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన లభించిన లైఫ్‌లను దుర్వినియోగం చేసుకున్నాడు. మొత్తంగా 27 బంతులు ఎదుర్కొన్న జైశ్వాల్.. మూడు ఫోర్ల సాయంతో 12 పరుగులు చేసి.. మార్కో యాన్సెన్ బౌలింగ్లో బౌల్డ్ అయ్యాడు. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ 59 బంతుల్లో 13, వన్‌డౌన్ బ్యాటర్ వాషింగ్టన్ సుందర్ 38 బంతుల్లో 6 పరుగులతో క్రీజులో నిలిచారు.

### ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్లు

కోల్‌కతా వేదికగా జరుగుతున్న తొలి టెస్టు అరుదైన రికార్డుకు వేదికైంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆరుగురు ఎడమ చేతి వాటం ప్లేయర్లతో బరిలోకి దిగింది. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఆరుగురు లెఫ్ట్ హ్యాండ్ ఆటగాళ్లు ఆడడం ఇదే తొలిసారి.

యశస్వి జైశ్వాల్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, పంత్, కుల్దీప్ యాదవ్ వంటి ఆరుగురు ఎడమ చేతి వాటం ప్లేయర్లు ఉన్నారు. టాప్–8లో అయితే ఏకంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఏకంగా ఐదుగురు ఉండడం గమనార్హం.

అంతకు ముందు మూడు సందర్భాల్లో భారత్ ఐదుగురు లెఫ్ట్ హ్యాండర్లతో ఆడింది. కానీ ఆరు మంది ఆడడం మాత్రం ఇదే మొదటి సారి. అయితే హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న ఈ నిర్ణయంపై మాజీ క్రికెటర్లు విమర్శలు కురిపిస్తున్నారు. ఆరుగురు అవసరమా అంటూ మండిపడుతున్నారు. అందులో నలుగురు స్పిన్నర్లే ఉన్నారు. ఈ మ్యాచ్‌ల్లో కేవలం ఇద్దరు ఫాస్ట్ బౌలర్లతో మాత్రమే భారత్ ఆడుతోంది.

## వైభవ్ సూర్యవంశీ సూపర్ సెంచరీ

**- జితేష్ శర్మ విధ్వంసం**

**- భారత్-ఏ 297 పరుగుల భారీ స్కోరు**

**-ఏసీసీ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ 20 టోర్నీ**



భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి అద్భుత ప్రదర్శనతో దుమ్ములేపాడు. ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్–2025 టోర్నమెంట్‌లో అద్భుత శతకం సాధించాడు. ఈ టీ20 ఈవెంట్లో భాగంగా భారత్–'ఏ' జట్టు తమ తొలి మ్యాచ్‌లో శుక్రవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో తలపడింది. దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఐపీఎల్ సెన్సేషన్ ప్రియాన్ ఆర్య వేగంగా ఆడే (6 బంతుల్లో 10) ప్రయత్నంలో రనౌట్ అయ్యాడు. ఈ క్రమంలో మరో ఓపెనర్, భారత చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ.. వన్డే డౌన్ బ్యాటర్ నమన్ ధీర్‌తో కలిసి.. స్కోరు బోర్డును పరుగులు తీయించాడు. కేవలం పదహారు బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్న వైభవ్ సూర్యవంశీ.. ఆ తర్వాత జోరును మరింత పెంచాడు. ప్రత్యర్థి జట్టు బౌలింగ్‌ను చెండాడుతూ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ వైభవ్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. కేవలం 32 బంతుల్లోనే వంద పరుగులు మార్కు అందుకుని మరోసారి సత్తా చాటాడు. టీ20 ఫార్మాట్లో అతడికి ఇది రెండో సెంచరీ కావడం విశేషం. సూర్యవంశీ కేవలం 41 బంతుల్లో 144 (11 ఫోర్లు, 15 సిక్సులు) చేశాడు. వైభవ్ సూర్యవంశీ సునామీ ఇన్నింగ్సుకు తోడు..జితేష్ శర్మ (83 నాటౌట్, 32 బంతులు, 8 ఫోర్లు, 6 సిక్సులు), నమన్ ధీర్ (34, 23 బంతులు, 3 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపులు మెరిపించడంతో భారత్–ఏ 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 297 పరుగుల భారీ స్కోరు చేసింది.

## ఎస్ఆర్‌హెచ్ నుంచి లక్నోకి షమీ



త్వరలో ఐపీఎల్ మినీ వేలం జరగనున్న నేపథ్యంలో ఫ్రాంఛైజీలు తమ జట్ల కూర్పుల్లో కీలక మార్పులకు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే పలు ఆటగాళ్లను ఇచ్చి పుచ్చుకునేందుకు, వదులుకునేందుకు కొన్ని ఫ్రాంఛైజీలు రెడీ అయ్యాయన్న వార్తలు వెల్లడవుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో వార్త అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. పేసర్ మహ్మద్ షమీని సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్).. లక్నో సూపర్ జెయింట్స్‌కు (ఎల్ఎస్‌జీ) ఇచ్చేందుకు రెడీ అయినట్టు తెలుస్తోంది. అయితే, ఇది ప్లేయర్లను ఇచ్చిపుచ్చుకొనే ట్రేడ్ కాదని సమాచారం. షమీ కోసం లక్నో సూపర్ జెయింట్స్ సుమారు రూ.10 కోట్లు ఇచ్చేందుకు రెడీగా ఉందట. ఐపీఎల్– 2025 వేలంలో షమీని సన్‌రైజర్స్ సరిగ్గా ఇంతే మొత్తానికి చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. అయితే, షమీ ట్రేడ్ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. గత సీజన్‌లో ఎస్ఆర్‌ఎచ్ తరపున షమీ 6 వికెట్లు తీశాడు. ప్రస్తుతం బెంగాల్ తరపున రంజీ ట్రోఫీలో ఆడుతున్నాడు.

**ఆ పోస్టు అర్థం అదేనా?**

లక్నో సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో తాజాగా పెట్టిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బెన్ స్టోక్స్‌ని షమీ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ ఫొటోను ఎల్ఎస్జీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ఏ కారణం లేకుండా ఈ ఏక్‌నా (స్టేడియం) మూమెంట్ గురించి ఆలోచిస్తున్నాను.. అనే క్యాప్షన్ జోడించింది. దీంతో వచ్చే సీజన్లో షమీ లక్నోకు ఆడుతున్నాడని ఆ జట్టు చెప్పకనే చెప్పిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## కోల్‌కతా బౌలింగ్ కోచ్‌గా సౌథీ



ఐపీఎల్–2026కు ముందు తమ కొత్త బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ పేస్ బౌలర్ టిమ్ సౌథీని కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం నియమించుకుంది. ఈ విషయాన్ని ఆ ఫ్రాంఛైజీ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు కోల్‌కతాకు బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్ వ్యవహరించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఇటీవలే చంద్రకాంత్ పండిత్ స్థానంలో అభిషేక్ నాయర్‌ను హెడ్ కోచ్‌గా, ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్‌ను సహాయక కోచ్‌గా నియమించుకున్న విషయం తెలిసిందే. మెంటార్‌గా డారెన్ బ్రావో కొనసాగుతున్నాడు..

కొత్త నియామకంపై సౌథీ స్పందిస్తూ..'కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తిరిగి కలిసి పనిచేయడం గౌరవంగా ఉందన్నాడు. ఈ ఫ్రాంచైజీకి ఘనమైన చరిత్ర, పెద్దసంఖ్యలో అభిమానులు, అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. నేను బౌలర్లతో కలిసి మా జట్టు ఐపీఎల్ 2026లో విజయం సాధించేందుకు కృషి చేస్తానని సౌథీ అన్నాడు. కోల్కతా నైట్ రైడర్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ.. మేము సౌథీకి ఘన స్వాగతం పలుకుతున్నాం. అతడి అనుభవం మా జట్టు బౌలింగ్ విభాగానికి ఎంతో ఉపయోగపడుతుంది. అతడి నాయకత్వ లక్షణాలు మా యువ బౌలర్లకు మార్గనిర్దేశనం చేస్తాయని పేర్కొన్నాడు.

సౌథీ న్యూజిలాండ్ తరపున 107 టెస్ట్ మ్యాచ్‌లు, 161 వన్డేలు, 126 టీ20లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి అతడు 700 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. గత సీజన్లో కెప్టెన్‌గా వ్యవహరించిన అజింక్య రహానేను కేకేఆర్ రిటైన్ చేసుకునే అవకాశం కనిపించడం లేదు. ఆయా ఫ్రాంచైజీలు రిటైన్ చేసుకునే, వదులుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించడానికి ఆఖరి గడువు ఈ నెల 15తో ముగియనుంది. ఈ నేపథ్యంలో అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సాయి సుదర్శన్‌ను ఎందుకు తప్పించారు?




కోల్‌కతా వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్‌లో భారత తుది జట్టులో సాయి సుదర్శన్‌కు చోటు కల్పించకపోవటాన్ని పలువురు తప్పుపడుతున్నారు. టీమిండియా దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే, మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా ఈ నిర్ణయంపై విమర్శలు గుప్పించారు.

దీనిపై సోనీ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే స్పందిస్తూ.. సౌతాఫ్రికాతో తొలి టెస్టుకు ఇండియా ప్లేయింగ్ ఎలెవన్ చూసి ఆశ్చర్యపోయాను. ఈ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ ఖచ్చితంగా ఆడుతాడని అనుకున్నాను. కానీ అతడిని పక్కన పెట్టారు. వాషింగ్టన్ సుందర్‌ను నంబర్ 3లో ఆడించారు. అస్సలు జట్టు మేనేజ్‌మెంట్ ప్రణాళిక ఎంటో అర్థం కావడం లేదు. నలుగురు స్పిన్నర్లు, కేవలం ఇద్దరు ఫాస్ట్ బౌలర్లతో ఆడడం ఏమిటని ప్రశ్నించాడు.

మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా మాట్లాడుతూ.. ఢిల్లీలో అతడు ఆడిన ఇన్నింగ్స్ విషయంలో సంతృప్తిగా లేనప్పుడు, అతన్ని అసలు జట్టులోకే తీసుకోకుండా ఉండాల్సింది. అతడి మీద విశ్వాసం లేనప్పుడు, జట్టులోకి తీసుకోవడం ఎందుకని సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆకాష్ చోప్రా ప్రశ్నించాడు. మూడో స్థానంపై విపరీతమైన ప్రయోగాలు చేయడం సమంజసం కాదని అతడు అభిప్రాయపడ్డాడు. మూడో స్థానాన్ని మ్యూజికల్ చైర్‌గా మార్చకూడదు. ఇంతకుముందు కరుణ్‌నాయర్ ఆడాడు. తర్వాత అభిమన్యు ఈశ్వరన్‌ను ఆడిస్తారేమో.. అని ఆకాష్ చోప్రా వ్యంగ్యంగా అన్నాడు.

# పాస్'పోర్ట్ లేకుండా రావొద్దు

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన మొదటి ఈవెంట్ నేడు రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనుంది. ఈ నేపథ్యంలో అభిమానులను ఉద్దేశించి మహేశ్ బాబు ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈవెంట్‌కు పాస్'పోర్టు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారని స్పష్టం చేశారు. పోలీసులకు సహకరించాలని కోరారు. పాస్‌పోర్టు (ఈవెంట్ పాస్) లేకుండా కంగారు పడి వచ్చేయకండి అంటూ వీడియోలో తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీ కోసం అటు అభిమానులు, ఇటు సినీ ప్రేక్షకులకు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. గ్లోబ్‌ట్రోటర్ (వర్కింగ్ టైటిల్) అంటూ ప్రచారంలో ఉన్న మూవీకి సంబంధించిన విశేషాల కోసం అందరూ ఆసక్తిగా ఉన్నారు. నేటి గ్రాండ్ ఈవెంట్‌లో ఆ విశేషాలు తెలుస్తాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. కార్యక్రమానికి వచ్చే అభిమానులు, ప్రేక్షకుల కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా పాస్‌లను సిద్ధం చేసింది. పాస్'పోర్టు తరహాలో తీర్చిదిద్దిన పాస్‌లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మహేశ్‌బాబు ప్రీలుక్‌లో ధరించిన






త్రిశూలం బొమ్మతో ముద్రించిన పాస్ లోపల మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్, రాజమౌళి ఫొటోలను, ఈవెంట్‌కు వచ్చేవారు పాటించాల్సిన సూచనలు, సలహాలు, రావాల్సిన మ్యాప్‌ను పొందు పరిచారు. కార్యక్రమానికి వచ్చే అభిమానులకు జాగ్రత్తలు చెబుతూ రాజమౌళి ప్రత్యేక వీడియో సైతం విడుదల చేశారు. ఆ ఈవెంట్‌కు పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారని స్పష్టం చేశారు. అందరినీ అనుమతిస్తారంటూ సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు నమ్మొద్దని తెలిపారు. భారీ ఈవెంట్‌కు అందరూ సహకరించాలని కోరారు.

ఇప్పటికే ఈ మూవీ నుంచి ప్రతినాయకుడు 'కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్, మందానికిగా ప్రియాంక చోప్రా పాత్రలను పరిచయం చేశారు. ఎవరూ ఊహించని విధంగా 'సంచారీ' అంటూ సాగే గీతాన్ని సైతం విడుదల చేసి ఆశ్చర్యపరిచారు. శ్రుతిహాసన్ ఆలపించిన ఈ పాట ఇప్పటికే సోషల్మీడియాలో ట్రెండ్ అవుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరిగే గ్రాండ్ ఈవెంట్లో ఎస్ఎస్ఎంబి29 ఈ సినిమా టైటిల్‌తో పాటు, స్పెషల్ వీడియోను విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ ఈవెంట్ జియోహాట్ స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

# అఖండ-2.. రీసౌండ్!



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2' తాండవం. సినిమా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. ఇందులో భాగంగా తాజాగా తాండవం సాంగును విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ పవర్ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ పాటకు లిరిక్స్ కల్యాణ్ చక్రవర్తి రాయగా.. శంకర్ మహాదేవన్, కైలాశ్ ఖేర్, దీపక్ ఆలపించారు.

# ఓటీటీకి వచ్చేశాడు డ్యూడ్!



కోలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నేహాశెట్టి, మమిత బైజు హీరోయిన్లుగా దర్శకుడు కీర్తీశ్వరన్ తెరకెక్కించిన దీపావళి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రమే "డ్యూడ్". మంచి బజ్ నడుమ రిలీజ్‌కి వచ్చిన ఈ చిత్రం తెలుగు, తమిళ ఆడియెన్స్ అంచనాలు అందుకొని 100 కోట్లకి పైగా వసూళ్లు రాబట్టింది. మరి ఈ సినిమా ఎట్టకేలకి థియేటర్స్‌నుంచి ఓటిటిలో స్ట్రీమింగ్‌కి వచ్చింది. చిత్రం స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. అందులో ఇప్పుడు పాన్ ఇండియా భాషల్లో అందుబాటులో ఉంది డ్యూడ్. ఈ చిత్రం అప్పుడు మిస్సై.. ఇప్పుడు చూడాలి అనుకునేవారు డెఫినెట్‌గా చూడొచ్చు. చిత్రానికి సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరాలు సమకూరిస్తే.. మైత్రి మూవీ మేకర్స్ చిత్రాన్ని నిర్మించారు.

స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా శ్రీనిధిశెట్టి, రాశి ఖన్నా హీరోయిన్లుగా దర్శకురాలు నీరజ కోన తెరకెక్కించిన ఇంట్రెస్టింగ్ చిత్రమే తెలుసు కదా. నీరజ డెబ్యూ సినిమాగా ఈ దీపావళికి రిలీజైన సినిమా ఒకింత డీసెంట్ టాక్‌నే యువతలో అందు కుంది. ఇక సినిమా థియేటర్స్ నుంచి ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్‌కి వచ్చే సింది. ఓటీటీ హక్కులు నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోవడంతో.. శుక్రవారం నుంచి సినిమా పాన్ ఇండియా భాషల్లో అలరిస్తోంది. ఓటీటీ ఆడియన్స్ నుంచి సినిమా ఎలాంటి రెస్పాన్స్ అందుకుం టుందో చూడాలి. థమన్ సంగీతం సమకూర్చిన సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించింది.

# నాకున్న 'పలకలు' చాలు!



భాషతో సంబంధం లేకుండా తన నటనతో మాధవన్ అభిమానులను సొంతం చేసుకున్నారు. అయితే అందరి హీరోల మాదిరిగా కాకుండా మాధవన్ సిక్స్ ప్యాక్‌వున్న పాత్రలను చాలా తక్కువగా పోషించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన దీని గురించి మాట్లాడారు. సిక్స్ ప్యాక్ ఉండటం నిజంగా గొప్ప విషయమన్నారు.

కానీ, తాను ఫ్యామిలీ హీరో అని అందుకే తనకు ఫ్యామిలీ ప్యాక్ ఉంటుందని సిక్స్ ప్యాక్ అవసరం లేదని సరదాగా చెప్పారు. "సరైన వ్యాయామాలతో సిక్స్‌ప్యాక్ పొందడం నిజంగా గొప్ప విషయం. అలాంటి శరీరాకృతి కావాలంటే మన శరీరంలో కొవ్వుశాతం కూడా కచ్చితమైన పరిణామంలో ఉండాలి. ఒకవేళ అందులో ఏదైనా తేడా వస్తే వయసుకుమించి కనిపిస్తాం. ఒక సినిమా కోసం నేను సిక్స్‌ప్యాక్ ప్రయత్నించా. అందరూ మూడు నెలల్లో దాన్ని పూర్తి చేయొచ్చని చెప్పారు. కానీ నాకు మాత్రం ఏడాదిన్నర పట్టింది. అది ఎంత కష్టమైన పనో అప్పుడే అర్థమైంది. అయినా నా అభిమానులంతా నేను ఇప్పుడు ఉన్నవిధంగానే ఇష్టపడుతున్నారు. అందుకే నేను నా ఫ్యామిలీ ప్యాక్‌తో సంతోషంగా ఉన్నా" అని మాధవన్ ఫన్ చేశారు. తాజాగా మాధవన్ 'దే దే ప్యార్ దే 2'తో ప్రేక్షకులను పలకరించారు. విజయవంతమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'దే దే ప్యార్ దే'కు కొనసాగింపుగా ఇది రూపొందింది. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, రకుల్ ప్రీత్ సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కింది.

## రూటుమార్చిన శర్వా..

హీరో శర్వానంద్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'బైకర్'. ఫస్ట్‌లుక్ పోస్టర్‌తోనే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలో శర్వానంద్ తొలిసారి రేసర్‌గా కనిపించబోతున్నాడు. స్లిమ్ లుక్‌తో శర్వానంద్ కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా సినిమా నుండి 'ప్రెట్టీ బేబీ' వీడియో సాంగ్ రిలీజ్ చేశారు. పాట ఆద్యంతం క్యాచీ ట్యూన్‌తో పెప్పీ నెంబర్‌గా సాగింది. శర్వానంద్ ఈ పాటలో మాళవికనాయర్‌తో కలిసి చేసిన డ్యాన్స్ మూవ్స్ కూడా ఆకట్టుకుంటున్నాయి. శర్వానంద్ సినిమా కోసం తన రూటు మార్చాడని చెప్పాలి. శర్వాను ఈ రేంజ్‌లో ఎనర్జిటిక్‌గా డ్యాన్స్ వేస్తూ చూడటం అభిమానులకు సంతోషాన్నిచ్చింది. ఇక ఈ సినిమాలో డా.రాజశేఖర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. గిబ్రాన్ సంగీతం అందిస్తున్న సినిమాను అభిలాష్ రెడ్డి డైరెక్ట్ చేస్తుండగా.. యువీ సినిమాస్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తోంది. డిసెంబర్ 6న చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



## టైం టార్గెట్ పెట్టుకున్న బన్నీ

ప్రస్తుతం వరల్డ్ క్లాస్ లెవెల్ హంగులతో తెరకెక్కిస్తున్న ఇండియన్ సినిమాల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో చేస్తున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ ఒకటి. అనౌన్సమెంట్‌తోనే క్రేజీ హైప్‌ని అందుకున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. అయితే ఈ సినిమా కోసం బన్నీ టార్గెట్‌ని ఫిక్స్ చేసుకున్నట్టు ఇప్పుడు తెలుస్తుంది. చాలా సైలెంట్‌గా తన పార్ట్‌ని బన్నీ పూర్తి చేసేస్తున్నాడట. ఇలా తన పోర్షన్ వరకు వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మేనాటికి కంప్లీట్ చేసే యోచనలో ఉన్నాడట. దీనితో బన్నీ మాత్రం పక్కా ప్లానింగ్‌గా ఈ సినిమాని కంప్లీట్ చేస్తున్నాడని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో దీపికా పదుకొనె హీరోయిన్‌గా నటిస్తుండగా.. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే సన్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్న సినిమా ఇండియన్ సినిమా దగ్గర భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న అతి కొద్ది సినిమాల్లో ఒకటిగా ఉంది.

